

పేరిణి.. ప్రేరణ

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తూ.. బుధవారం రవీంద్రభారతిలో నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ -వరంగల్, భాషా సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో పేరిణి సంప్రదాయంలో ప్రదర్శించిన 'ప్రేరణ' (ది ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ సోల్) నృత్యరూపకం ఆలోచింపజేసింది. సుమారు 40 మంది కళాకారులు రెండున్నర గంటల పాటు కళారూపకాన్ని ప్రదర్శించారు. కాకతీయుల కాలం నాటి కళాస్ఫూర్తితో ప్రారంభమైన ప్రదర్శన ప్రస్తుత సమాజంలోని మహిళా సమస్యలను ఎత్తిచూపింది. - న్యూస్‌టుడే, రవీంద్రభారతి

చెట్ల పరిరక్షణపై హైడ్రా దృష్టి



ఈనాడు, హైదరాబాద్: జలాశయాలతో పాటు చెట్ల పరిరక్షణపై హైడ్రా దృష్టి సారించింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ, హైడ్రా, అటవీ విభాగాలతో జోన్లవారీగా ఓ బృందాన్ని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో చెట్ల స్థితిపై సర్వే చేసేందుకు సిద్ధమైంది. బుధవారం హైడ్రా కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా, అటవీశాఖ అధికారులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమావేశమయ్యారు. కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్ల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించిన ఆయన ట్రీ ప్లాంటేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, 100శాతం చెట్లు బతికేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం వాల్టా (తెలంగాణ వాటర్ ల్యాండ్ అండ్ ట్రీ యాక్ట్) చట్టం అమలవుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ఎండిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లను ముందే గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతున్న చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయడం, ఇంకా ఇబ్బందిగా ఉంటే వాటిని వేరే చోటికి తరలించి ట్రీ ప్లాంటేషన్ విధానంలో పెంచడం, చెట్లు తొలగించిన దగ్గర మొక్కలు నాటడంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ తీగలకు తగులుతున్నాయని అశాస్త్రీయంగా కొమ్మలు నరకడాన్ని విస్మరించి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని అభిప్రాయపడ్డారు.

ముందు కొంతే.. ఆ తరువాతే పూర్తి

- ప్రయోగాత్మకంగా 2.5 కి.మీ.ల మూసీ పునరుజ్జీవం
- నార్సింగి నుంచి ఓఆర్ఆర్ వరకు చేపట్టే అవకాశం



మూసీ పునరుజ్జీవం కోసం రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను అమలు చేయాలని తాజాగా నిర్ణయించింది. ఒకేసారి ఈ పెద్ద ప్రాజెక్టు నిర్మాణాన్ని మొదలుపెడితే అనేక సమస్యలు ఎదురవుతాయన్న ఉద్దేశంతో మొదటిదశలో 2.5 కి.మీ.ల మేర పునరుజ్జీవం పోయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. పూర్తిస్థాయి సుందరీకరణను ప్రజలకు చూపించిన తరువాతే మిగిలిన ప్రాజెక్టును చేపట్టాలని అనుకుంటున్నారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

ముందుకు ఇలా..

- నగర పరిధిలో నార్సింగి నుంచి నాగోలు వరకు ఉన్న 55 కి.మీ.ల మూసీ సుందరీకరణతోపాటు ఇతర పునరుజ్జీవ చర్యల కోసం రూ.50 వేల కోట్లు ఖర్చవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.
- నార్సింగి నుంచి బాపూ ఘాట్ వరకు నది వెంట పెద్దగా నిర్మాణాలు లేవు. ఇక్కడ సుందరీకరణ పనులు చేపట్టవచ్చని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కూడా పరిశీలించినట్లు తెలిసింది.
- మూసీ గర్భంలో 1600 ఇళ్లలో ఉంటున్న వారిని తరలించాలి. బఫర్‌జోన్‌లోని 13 వేల మంది నిర్వాసితులను తరలించడం అంత సులభం కాదు. దీంతో ముందుగా కొంతభాగం అభివృద్ధి చేయాలనే నిర్ణయానికి సీఎం వచ్చారు.
- నార్సింగి నుంచి బాహ్యవలయ రహదారి (ఓఆర్ఆర్) వరకు 2.5 కి.మీ.ల మూసీ పరిధిలో నిర్మాణాలు లేవు. ఇక్కడ పనులు చేయొచ్చనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది.

రెండ్రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి గచ్చిబౌలి ప్రాంతంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న తరువాత దీనిపై రంగారెడ్డి జిల్లా అధికారి ఒకరితో మాట్లాడినట్లు తెలిసింది. 'మీ జిల్లా పరిధిలో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా మొదలుపెడదాం.. సిద్ధంగా ఉండండి' అన్నట్లు సమాచారం.

నివేదిక ఆధారం..

మూసీ పూర్తిస్థాయి నివేదికను తయారు చేసే పనిని సలహాదారు సంస్థకు ఇప్పటికే అప్పగించింది. మూడు నెలల్లో ప్రాథమిక నివేదికను ఇవ్వాలని ఈ సంస్థను ప్రభుత్వం కోరింది. ఇందులో 2.5 కి.మీ.ల మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కూడా ఉండనుందని చెబుతున్నారు. దీని ఆధారంగా ప్రభుత్వమే ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టును మొదలుపెడతారని తెలిసింది. పునరుజ్జీవంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. కొన్నిచోట్ల నదిలో పెద్ద పెద్ద బండరాళ్లు ఉండగా.. మరికొన్నిచోట్ల లక్షల టన్నుల డంపింగ్‌తో నిండిపోయింది. వీటన్నింటిని తొలగించడం కత్తిమీద సామేనని అంటున్నారు. ప్రయోగాత్మక ప్రాజెక్టుతో వీటన్నింటికీ సమాధానం లభిస్తుందని చెబుతున్నారు.

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, ఈనాడు-హైదరాబాద్



స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన స్వదేశీ మేళాను బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. పలు స్టాళ్లను సందర్శించి ఉత్పత్తులను తిలకించారు.




కాటేసే కాలనాగులా!

పాతనగరం బహదూర్‌పురలోని పిజా హోటల్ సమీపంలోని గల్లీలో మురుగు నాలాపై వరుసగా ఇనుప జాలిలు ఉంచారు. చిన్నారులు ఆడుకుంటూ అందులో పడిపోయే ప్రమాదం ఉంది.

సాఫీగా వెళ్లేలా..
సొరంగ మార్గం

- బేగంపేట ఎయిర్‌పోర్టు సమీపంలో 0.6 కి.మీల నిర్మాణానికి ప్రణాళిక
- ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా ఏర్పాటు



ప్రతిపాదిత సొరంగమార్గ పటం

సికింద్రాబాద్ జంక్షన్ ప్యారడైజ్ నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి జంక్షన్ల మీదుగా డెయిరీ ఫాం వరకు తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా బేగంపేట వద్ద సొరంగ మార్గం పనుల కోసం తాజాగా హెచ్‌ఎండీఏ ఎయిర్‌పోర్టు అథారిటీకి ప్రతిపాదనలు పంపింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు నగరం నుంచి సాఫీగా ప్రయాణం సాగించేందుకు ఈ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్, తాడ్‌బండ్, బోయినపల్లి చౌరస్తా దాటి బయటకు వెళ్లాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌తో సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ జాతీయ రహదారి వైపు ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. బోయినపల్లి చౌరస్తా నుంచి బలంరాయి రోడ్‌ను అనుసంధానం చేస్తూ బేగంపేట ఎయిర్‌పోర్టు సమీపంలో సొరంగ మార్గం నిర్మించనున్నారు. ఇప్పటికే ఈ కారిడార్ కోసం హెచ్‌ఎండీఏ ప్రైవేటు ఆస్తులు సేకరిస్తోంది. మరోవైపు కంటోన్మెంట్‌లో రక్షణశాఖ ఆస్తులు సైతం ఇంకా హెచ్‌ఎండీఏ స్వాధీనంలోకి రాలేదు. దీనిపై ఉన్నత స్థాయిలో కసరత్తు జరుగుతోంది. త్వరలో ఈ ఆస్తుల అప్పగింత ప్రక్రియ పూర్తి కానుందని అధికారులు తెలిపారు. పూర్తిస్థాయిలో ఆస్తులు హెచ్‌ఎండీఏ చేతికి వచ్చిన తర్వాత టెండర్లను ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులకు మార్గం సుగమం కానుంది.

మొత్తం కారిడార్	5.32 కి.మీ.లు.
ఎలివేటెడ్ కారిడార్ వ్యయం:	రూ. 1580 కోట్లు
సొరంగ మార్గం:	0.6 కి.మీ.లు.

ఈనాడు, హైదరాబాద్



పరివారంతో పరీవాహకంలో..

మూసీ పునరుజ్జీవంతో ఇళ్లు కోల్పోతున్న పరీవాహకంలోని నిరుపేదలను బుధవారం భాజపా నాయకులు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కలిసి వారితో మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పేదలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రామంతాపూర్ డివిజన్ కేసీఆర్ నగర్, కొత్తపేట న్యూ మారుతీనగర్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి తదితరులతో కలిసి పర్యటించారు. వివరాలు 8లో..

హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్ నుంచి..
నిషేధిత జాబితా తొలగింపు



వివరాల్లేక ఖాళీగా వెబ్‌సైట్

ఈనాడు, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ పరిధిలో వందలాది పంచాయతీ లేఅవుట్లు నిషేధిత జాబితాలో ఉన్నట్లు వెబ్‌సైట్‌లో కొన్నిరోజులుగా వివరాలు అందుబాటులో ఉండటంతో ఉన్నతాధికారులు స్పందించారు. దాదాపు 20 ఏళ్ల నాటి పాత వివరాలు తాజాగా హెచ్‌ఎండీఏలో కన్పించడం, అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దీనిపై కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ విచారణకు ఆదేశించారు. అధికారులు స్పందించి ఐటీ విభాగంతో సమావేశమై ఈ వివరాలు ఎలా బయటకు వచ్చాయో ఆరా తీశారు. వెంటనే వెబ్‌సైట్ నుంచి తొలగించాలని ఆదేశించారు. దీంతో హెచ్‌ఎండీఏ అధికారిక సైట్ నుంచి వాటిని డిలీట్ చేశారు. హుడా, హెచ్‌ఎండీఏ ఏర్పడక ముందు గతంలో వందలాది పంచాయతీ లేఅవుట్లు వందల సంఖ్యలో వెలశాయి. ముందు హుడా తర్వాత హెచ్‌ఎండీఏ అవతరించిన తర్వాత కూడా పంచాయతీ లేఅవుట్లకు కళ్లెం పడలేదు. దీంతో హెచ్‌ఎండీఏ కొన్ని లేఅవుట్లను గుర్తించి వాటిని హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో పెట్టింది. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలోని గుర్రంగూడ, నాదర్‌గుల్, బాలాపూర్, రాగన్నగూడ, తుర్కయాంజిల్, కమ్మగూడ, మన్నెగూడ, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్, ఆదిభట్ల, మంగల్‌పల్లి తదితర ప్రాంతాల్లో వందలాది పంచాయతీ లేఅవుట్లు ఉన్నట్లు చూపింది. అయితే తర్వాత కాలంలో 2007, 2011, 2015ల్లో తెచ్చిన ఎల్ఆర్ఎస్‌లో ఈ లేఅవుట్లలో చాలావరకు క్రమబద్ధీకరించారు. ఈ జాబితాతో హెచ్‌ఎండీఏకు ఎలాంటి సంబంధం లేదని, ఆయా ప్లాట్లు నిషేధిత జాబితాలో లేవని అధికారులు బుధవారం స్పష్టం చేశారు.

ఇన్‌స్పెక్టర్‌గా ఎవరొచ్చినా..
ఆ హోంగార్డుదే హవా!

- లాడ్జిలో పుట్టినరోజు వేడుకలు, బహుమతిగా ఖరీదైన వాచీ
- మధ్య మండలంలో ఠాణాపై ఆరోపణల వెల్లువ



రాంనగర్, న్యూస్‌టుడే

మధ్య మండలంలో ప్రధాన పోలీస్‌స్టేషన్. అక్కడ ఎస్‌హెచ్‌వోగా ఎవరు బాధ్యతలు చేపట్టినా ఓ హోంగార్డుదే పెత్తనం. ఇతడికి చేదోడుగా ప్రైవేటు వ్యక్తి, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారు. రెండుసార్లు ఉన్నతాధికారులు బదిలీ చేసినా కదలకుండా అక్కడే పాగా వేశాడు. ఇన్‌స్పెక్టర్ల మనసు గెలిచిన ఈ హోంగార్డు పుట్టినరోజు వేడుకలు అదే ప్రాంతంలోని లాడ్జిలో ఘనంగా నిర్వహించారు. వచ్చిన ముగ్గురు ఇన్‌స్పెక్టర్లలో ఒకరు.. సదరు హోంగార్డుకు రూ.30వేల విలువైన చేతివాచీని బహుమతిగా ఇచ్చాడు. హోంగార్డు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఈ విషయం వెలుగుచూసింది. పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో అంతర్గత విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. అతని వృత్తి హోంగార్డు.. ప్రవృత్తి వసూలు చేయడం. నెలనెలా వచ్చినసొమ్మును వాటాలు వేసి పంచుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఠాణా పక్కనేఉన్న లాడ్జిలో అతడికి ఒక గదినే కేటాయించారు. ఠాణాకు వచ్చే ఫిర్యాదులు, పంచాయితీలకు ఇదే కేంద్రంగా మారిందని అక్కడి పోలీసులే చెబుతున్నారు. ఠాణాకు అదనపు గది నిర్మించేందుకు ఒక విద్యాసంస్థ ముందుకొచ్చింది. తరువాత నిర్మాణం కోసం విద్యాసంస్థలు, దుకాణదారుల నుంచి రూ.లక్షల్లో వసూలు బాధ్యత కూడా ఈ హోంగార్డుకే అప్పగించినట్టు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన ప్రముఖ హీరో సినిమా టికెట్లు థియేటర్ యాజమాన్యం నుంచి ముందే తీసుకొని బ్లాక్‌లో అమ్మించి సొమ్ము చేసుకున్నట్టు ప్రచారం సాగుతోంది. ఆ సొమ్ముతో ఒక హోటల్‌లో పార్టీ సైతం చేసుకున్నారు. కొద్దిరోజుల కిందట ఇదే లాడ్జిలో హోంగార్డు పుట్టినరోజు వేడుక ఘనంగా జరిగింది. గతంలో ఈ ఠాణాలో పనిచేసిన ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు అతనితో కేక్ కోయించి బహుమతులు ఇచ్చారు.

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలపై ఆరోపణలు..
అధికారుల సంజాయిషీ

ఈనాడు, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం ప్రకటించిన నోటిఫికేషన్‌లో తక్కువ పోస్టులు చూపించారన్న ఆరోపణలపై 8 మంది అధికారులు బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో లిఖితపూర్వకంగా సంజాయిషీ ఇచ్చారు. నోటిఫికేషన్ సమయంలో ఉన్న ఖాళీల సంఖ్యను సమర్పించామంటూ సంజాయిషీలో పేర్కొన్నారు. వాస్తవానికి హైదరాబాద్‌లోని 694 పాఠశాలల్లో 878 ఉపాధ్యాయులు లేరని డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్ అధికారులు ఉన్నతాధికారులకు తెలపగా.. డీఎస్సీ-2024లో అన్నే పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. కొన్ని పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులున్నా.. కొందరు అధికారులు అక్కడ పోస్టులను చూపించలేదంటూ ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. రెండురోజుల క్రితం 8 మంది డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్ అధికారులకు తాఖీదులు జారీచేశారు. సదరు అధికారులు కార్యాలయానికి వచ్చి ఖాళీల వివరాలతో కూడిన నివేదిక, సంజాయిషీలను సమర్పించారు.

యుద్ధప్రాతిపదికన పైవంతెనలు పూర్తిచేయాలి



మ్యాప్ పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఆరాంఘర్-జూపార్క్ పైవంతెన పనుల కోసం భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. బుధవారం హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి ఆయన నిర్మాణంలో ఉన్న లేఅవుట్లను పరిశీలించారు. గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు నిర్మాణంలో ఉన్న శిల్ప లేఅవుట్ ఫేస్-2 ఫ్లైఓవర్ పనులు, ఆరాంఘర్ నుంచి శాస్త్రీపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను వేగంగా పూర్తి చేయాలని రైల్వే అధికారులను కోరారు. శిల్ప లేఅవుట్ ఫేజ్-2 పైవంతెన పనులు జరుగుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులు చెప్పగా.. వెంటనే విద్యుత్తు లైన్ తొలగించాలని ఆయన ఆదేశించారు. అసంపూర్తి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

వ్యాధి నిర్ధారణే పరీక్ష



- సెల్‌ఫోన్‌లకు అందని ఆరోగ్య సమాచారం
- బస్తీ దవాఖానాల్లో రోగుల అవస్థలు

ఈనాడు, హైదరాబాద్

బస్తీ దవాఖానాల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నప్పటికీ.. చాలాచోట్ల ఆ రిపోర్టులు రోగుల సెల్ నంబరుకు చేరడం లేదు. రెండు, మూడు రోజులు దాటినా సరే.. నివేదికలు రాకపోవటంతో రోగులకు తిరిగి బస్తీ దవాఖానాలకు వచ్చి ఆరా తీస్తున్నారు. అక్కడ సిబ్బందిని ప్రశ్నిస్తే.. తమ కంప్యూటర్‌లో నివేదికలు చూపించి ఫొటోలు తీసుకోవాలని చెబుతున్నారని వాపోతున్నారు.

- గ్రేటర్ వ్యాప్తంగా 250 వరకు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. నిత్యం తొమ్మిది వేల పైనే ఇక్కడ ఓపీ ఉంటోంది. పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మరో ఎనిమిది వేల మంది చికిత్సల కోసం వస్తున్నారు.
- గ్రేటర్ వ్యాప్తంగా నిత్యం పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి 1441, బస్తీ దవాఖానాల నుంచి మరో 1087 రకాల ఆరోగ్య పరీక్షలకు సంబంధించి శాంపిళ్లను సేకరించి తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు పంపుతున్నారు.
- గతంలో శాంపిళ్లు సేకరించి సెంట్రల్ ల్యాబ్‌కు పంపిన 24 గంటల లోపు రోగుల సెల్‌ఫోన్‌కు నివేదికలు అందేవి. ప్రస్తుతం చాలా కేంద్రాల్లో తమ సెల్‌ఫోన్లకు సమాచారం అందడం లేదని రోగులు వాపోతున్నారు. రెండు, మూడు రోజుల పాటు చూసిన తర్వాత ఆయా కేంద్రాలకు వస్తున్నాయి.

చికిత్సపై ప్రభావం

అవసరమైన వారి నుంచి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపుతుంటారు. నివేదికలు సెల్‌ఫోన్‌కు అందిన తర్వాత తిరిగి వైద్యులను సంప్రదిస్తుంటారు. ల్యాబ్‌ల నుంచి నివేదికలు రాకపోవడంతో చికిత్సలో జాప్యం జరుగుతోంది. ఇంతలో రోగం ముదిరిపోయి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. వనస్థలిపురం పరిధిలోని బస్తీ దవాఖానాల్లో చాలా రోజుల నుంచి రోగుల సెల్‌ఫోన్‌కు నివేదికలు రావడం లేదని రోగులు చెబుతున్నారు. ఎల్‌బీనగర్, నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే తీరు ఉంది. డెంగీ లాంటి జ్వరం నిర్ధారణ అయిన వెంటనే చికిత్స అందించకపోతే కొన్నిసార్లు ప్లేట్‌లెట్లు తగ్గిపోయి రోగుల పరిస్థితి ప్రమాదకరంగా మారే ఆస్కారం ఉంది.

టెక్నీషియన్ల కొరత..

కొన్ని కేంద్రాల్లో టెక్నీషియన్లు అందుబాటులో ఉండటం లేదు. రెండు, మూడు కేంద్రాలకు ఒక్కరే ఇన్‌ఛార్జి కావడంతో ఒక్కో కేంద్రాన్ని తిరిగి శాంపిళ్లు తీసుకోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ రాకపోవడంతో పరీక్షలు జరగడం లేదు. ఎప్పటికప్పుడు ఆయా కేంద్రాలపై పర్యవేక్షణ లేకపోవడం తో సరైన చికిత్స అందడం లేదని రోగులు అంటున్నారు. నగర వ్యాప్తంగా శాంపిళ్లు తీసి నారాయణగూడలోని డయాగ్నోస్టిక్ హబ్‌కు తరలించేసరికి సాయంత్రం అవుతోంది. దీంతో రోగులకు నివేదికలు అందడంలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని రోగులు కోరుతున్నారు.

శాంపిళ్ల సేకరణలోనూ జాప్యం

చాలా దవాఖానాల్లో రక్త శాంపిళ్ల సేకరణలో జాప్యం జరుగుతోంది. రాజేంద్రనగర్ పరిధిలోని పలు బస్తీ దవాఖానాలకు ఉదయం 11 తర్వాతే సిబ్బంది వస్తున్నారు. మిగతా చోట్ల కూడా దీనికి భిన్నంగా లేదు. రోగులను చూసి టెస్టులు రాసే సరికి మధ్యాహ్నం దాటుతోంది. షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, థైరాయిడ్ లాంటి పరీక్షలకు ఆహారం తీసుకోకుండా వస్తుంటారు. 11 గంటలవుతున్నా శాంపిళ్ల సేకరణ లేక వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు నిరీక్షించలేక వెనుదిరుగుతున్నారు..

మలి వయసు.. జీవితంపై విరక్తి

- 95 ఏళ్ల వృద్ధురాలి బలవన్మరణం

రాంనగర్, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్‌నగర్ పరిధిలోని సిద్ధంశెట్టి అపార్ట్‌మెంట్‌లో సరోజినీదేవి(95) ఒంటరిగా నివసిస్తోంది. ఆమె భర్త గతంలోనే చనిపోయారు. సరోజినీ దేవి దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. వారందరికీ వివాహాలయ్యాయి. పెద్ద కుమారుడు ప్రసాద్ అమెరికాలో ఉంటుండగా.. చిన్న కుమారుడు రవి.. తల్లి నివాసం చెంతనే మరో అపార్ట్‌మెంట్‌లో కుటుంబసభ్యులతో నివసిస్తున్నాడు. ప్రస్తుతం వృద్ధాప్య సమస్యలతో సతమతమవుతున్న సరోజినీ దేవి నడవలేని పరిస్థితికి చేరుకుంది. దీంతో తనకు సహాయకురాలిగా ఒక కేర్‌టేకర్‌ను కూడా పెట్టుకుంది. రెండు రోజులుగా కేర్‌టేకర్ రావడం లేదు. బుధవారం ఉదయం ఐదు గంటల సమయంలో.. ఇంట్లో నుంచి పొగలు వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు తలుపులు తెరిచి పరిశీలించారు. అప్పటికే ఆమె మంటల్లో కాలిపోయి విగతజీవిగా కనిపించింది. ఘటనాస్థలంలో లభించిన సూసైడ్ నోట్‌లో.. తన చావుకు ఎవరు కారణం కాదని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసి ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

పాఠశాల స్థలాన్ని పరిరక్షించాలంటూ ఆందోళన

బండ్లగూడ, న్యూస్‌టుడే: 'మా బడి స్థలం మాకు కావాలి' అంటూ బండ్లగూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు రెండో రోజూ బుధవారం ఆందోళన కొనసాగించారు. విద్యార్థులకు అన్యాయం చేయొద్దు, కబ్జాదారులను శిక్షించాలి.. అనే ప్లకార్డులు ప్రదర్శిస్తూ బండ్లగూడలో ర్యాలీ చేపట్టారు. అనంతరం బండ్లగూడ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడటంతో వాహన రాకపోకలు స్తంభించాయి. ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కూల్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల తరఫున నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు స్థానికులు గడ్డం రామారావు గౌడ్, సహదేవ్ గౌడ్ తెలిపారు.


బండ్లగూడ చౌరస్తాలో మానవహారంగా విద్యార్థులు, తల్లిదండ్రులు

ఎల్‌.బి.నగర్

•ఎల్‌.బి.నగర్ • మలక్‌పేట

అష్టలక్ష్మి ఆలయంలో ఈటల పూజలు

ఆర్కేపురం, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరంలోని ఆర్కేపురం డివిజన్‌కి చెందిన అష్టలక్ష్మి ఆలయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.. బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతన కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధారెడ్డి, నర్సింహగుప్తా, పవన్, ఆలయ ఫౌండర్ ఛైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ఛైర్మన్ సోమ సురేశ్, కార్యదర్శి గంప జగన్, ఆలయ కోశాధికారి అయిత అంజయ్యగుప్తా పాల్గొన్నారు.


ఆలయంలో ఎంపీ రాజేందర్, హరీశ్‌బాబు తదితరులు

బొమ్మల కొలువుకు వేళాయె



దీపావళి సందర్భంగా తీరొక్క బొమ్మలతో కొలువు ఏర్పాటు చేస్తుంటారు. పండుగ సమీపిస్తుండటంతో రహదారులపై బొమ్మల విక్రయాలు ఊపందుకున్నాయి. దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారి పక్కన నడక మార్గంలో విక్రయానికి ఉంచిన బొమ్మలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. –న్యూస్‌టుడే, అక్బర్‌బాగ్

బతుకమ్మ కుంట.. దోమలతో తంటా!



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బతుకమ్మ కుంట మురుగుతో అధ్వానంగా మారింది. మురుగు పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్నామని, ఎంటమాలజీ విభాగం స్పందించి సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎల్బీనగర్

మేమున్నాం.. మీకు తోడుగా..
ఉ.10 నుంచి మ.1 గంట మధ్య
ఎల్బీనగర్: 76759 19030
మలక్‌పేట: 80085 73284
హయత్‌నగర్: 98336 64897
కర్మన్‌ఘాట్: 94400 32872
బండ్లగూడ: 96034 78579
మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, వనస్థలిపురం, బండ్లగూడ, సైదాబాద్

? గోపాలకృష్ణపురం కాలనీ పరిధి కెండీ పాఠశాల వద్ద రెండు స్తంభాలకు చాలా రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదు. – బొంతరి శ్రీను, గోపాలకృష్ణపురం

✓ కొత్తగా వీధి దీపాలు అందుబాటులో లేవు. రాగానే ఏర్పాటు చేస్తాం. – అశోక్, లైన్‌మెన్, జీహెచ్‌ఎంసీ వీధి దీపాల విభాగం

తీరని కుక్కల బెడద — స్పందనకు వందనం

హయత్ నగర్ డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో వీధి కుక్కల బెడద తీవ్రమైంది. స్థానికులు సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా..' దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన వెటర్నరీ అధికారి యాదగిరి స్పందించారు. సిబ్బందిని పంపించి, శునకాలను పట్టి తరలించారు.

? సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలోని బేతేల్ ఆరాధన మందిరం మార్గంలో వీధి దీపాలు పగలు వెలుగుతున్నాయి. రాత్రి వెలగడం లేదు. – బ్రహ్మజీ, సైదాబాద్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి. మరమ్మతులు చేపడతాం. –దుర్గారావు, సూపర్‌వైజర్, వీధి దీపాల విభాగం

సంక్షిప్త సమాచారం

బాక్స్‌డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన



కర్మన్‌ఘాట్: హస్తినాపురం డివిజన్ జడ్పీ రోడ్డు టీచర్స్ కాలనీలో బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ శంకుస్థాపన చేశారు. ప్రజా అవసరాలకు చేపడుతున్న పనులను అడ్డుకుంటే చర్యలు తప్పవన్నారు. ఈఈ కార్తీక్, ఏఈ మల్లికార్జున్, కాలనీ అధ్యక్షులు సాయిరెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రగతి పనుల పరిశీలన

హయత్‌నగర్: హయత్‌నగర్: హయత్‌నగర్ పరిధిలోని పలు కాలనీలో చేపట్టిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పరిశీలించారు. పవనగిరి కాలనీ ఫేజ్-2, ఎల్లారెడ్డికాలనీ, లక్ష్మీనగర్, కొలన్ శివారెడ్డి కాలనీ, ఆగమయ్య నగర్ కాలనీల్లో రూ.93 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

వనస్థలిపురం: వనస్థలిపురం నివాసితుల సంక్షేమ సంఘం నూతన కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా జగదీశ్ కుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా బీరం శ్రీధర్, ఉపాధ్యక్షులుగా నరసింహారాజు, జాన్, బాలరాజ్, సత్తయ్యగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా భాస్కర్‌రెడ్డి, సురేశ్‌బాబు, క్రాంతి గౌడ్, శ్రీధర్‌నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సాయికిరణ్, ఇంద్రసేనారెడ్డి, వెంకటేశ్, సుధాకర్ రెడ్డి, కోశాధికారిగా రామ్మోహన్ ఎన్నికయ్యారు.

చెరువు కట్ట పటిష్టం చేయాలి



బండ్లగూడ: బండ్లగూడ: ఫత్తుల్లాగూడ చెరువు కట్టను పటిష్టం చేసి, చుట్టూ పెరిగిన ముళ్ల కంపను తొలగించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతి చేసిన వారిలో కాటేపాక రవి, యాదయ్య, శంకరయ్య, నర్సింహా, బాలకృష్ణ ఉన్నారు.

లారీ యజమానుల వినతి

ఎల్బీనగర్: ఇసుక రీచ్‌ల్లో లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఇసుక లారీల యజమానుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం టీజీఎండీసీ నూతన ఎండీగా నియమితులైన సుశీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి చేసిన వారిలో తెలంగాణ రాష్ట్ర ఇసుక యజమానుల సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వామ్మో.. వాంబే!

నివాసాల మధ్య దుర్గంధం

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: హస్తినాపురం డివిజన్ టీకేఆర్ రోడ్డు నందనవనం వాంబే కాలనీ కాలనీ అంటే భయపడాల్సిన పరిస్థితి. నివాసాల మధ్య వ్యర్థాలు పేరుకుపోగా, రహదారులపైనే మురుగు పరుగులు పెడుతోంది. దుర్వాసన.. అపరిశుభ్రతతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు.


టీకేఆర్ రోడ్డులోని నందనవనం వాంబే కాలనీ


ఇళ్ల మధ్య వ్యర్థాలిలా..

90 శాతం నిరుపేదలే..

కాలనీ స్వరూపమిలా..
- ఏర్పాటు: 20 ఏళ్ల క్రితం
- బ్లాక్‌లు: 70
- నివాసాలు: 756
- ప్రధాన వీధులు: 2
- అంతర్గత మార్గాలు: 10
- జనాభా: 3,500

కర్మన్‌ఘాట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 71, 72, 73లో 20 ఏళ్ల క్రితం 45 ఎకరాల్లో నందనవనం ప్రాజెక్టు ఏర్పాటైంది. వాంబే కాలనీ పేరుతో 70 బ్లాక్‌ల్లో 756 ఇళ్లు నిర్మించారు. 2009లో రెండు అడుగుల డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. అనంతరం మరికొన్ని నిర్మాణాలు చేపట్టారు. అయితే పెరిగిన గృహాలకు అనుగుణంగా డ్రైనేజీ పైపులైన్లు పెంచకపోవడంతో సమస్య మొదలైంది. వాంబే కాలనీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్రజలు జీవనం సాగిస్తారు. దాదాపుగా 90 శాతం నిరుపేదలే. ఉదయాన్నే పనికి వెళ్తే.. రాత్రే ఇంటికి చేరుతారు. రోడ్డుపై పారుతున్న మురుగులోంచే నడవాల్సిన పరిస్థితి. అపార్ట్‌మెంట్ల మధ్య వీధుల్లో వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోయి పరిస్థితి దారుణంగా మారింది. నెలల తరబడి మురుగు పారుతుండటంతో భరించలేని దుర్వాసన వ్యాపిస్తోంది. మురుగులో పందులు, శునకాల సంచారం, దోమల స్వైర విహారంతో విషజ్వరాలు బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


కాలనీ రోడ్డుపై పారుతున్న మురుగు

పరిశీలించి పరిష్కార చర్యలు..
– బాలరామరాజు, జీఎం, జలమండలి

"బలహీన వర్గాల ప్రాంతమైన నందనవనం వాంబే కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపించి, క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తాం. వెంటనే తాత్కాలికంగా నివారణ చర్యలు చేపట్టి, ప్రజల ఇబ్బందులు తీర్చుతాం. సాధ్యమైనంత త్వరలో సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం."

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం


దివ్య దేవరాజన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: మూసీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని ఐఏఎస్ అధికారిణి, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ దివ్య దేవరాజన్ తెలిపారు. చావుని రెండు పడకల గృహ సముదాయాన్ని బుధవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి సందర్శించారు. రెండు పడక గదుల ఇళ్లల్లో సౌకర్యాలు ఉన్నాయా? సమస్యలేంటి? ఏయే వసతులు కల్పించాలి.. అనే విషయాలను నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారు. పై అంతస్తుల్లోకి చేరేందుకు లిఫ్టు, విద్యుత్తు, తాగు నీటి సమస్యలు తలెత్తుతున్నట్లు స్థానికులు ఆమెకు వివరించారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మూసీ నిర్వాసితులే కాకుండా స్థానికంగా నివసిస్తున్న ఇతరులకు సైతం ఆర్థిక సహాయాన్ని అందజేయాలని కోరారు. స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. పట్టణ సామాజిక అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి, చార్మినార్ జోనల్ అధికారి వెంకన్న, ఉప కమిషనర్ జయంత్, చావుని కార్పొరేటర్ సలాం షాహిద్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు లబ్ధి


లబ్ధిదారులకు మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. హయత్‌నగర్ డివిజన్ హైకోర్టు కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, రేణుక దంపతులకు 8 ఏళ్ల బాబు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ఆ దంపతులు ఎమ్మెల్యే సాయంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. రూ.4.5 లక్షలు మంజూరు కావడంతో, అందుకు సంబంధించిన పత్రాలను బుధవారం ఎల్బీనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు ఖరీదైన వైద్యసేవలు పొందేందుకు సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, నాయకులు సదానందారెడ్డి, శంకర్, సత్తిరెడ్డి, కిట్టు యాదవ్ పాల్గొన్నారు.

డెంగీతో దెబ్బతిన్న ఊపిరితిత్తులు

బతికించిన కామినేని వైద్యులు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: డెంగీతో ఊపిరితిత్తులు తీవ్రంగా దెబ్బతిన్న రోగి ప్రాణాలను ఎల్బీనగర్ కామినేని వైద్యులు కాపాడారు. ఎక్మో చికిత్స ద్వారా ఆరోగ్యవంతుడిగా మారడంతో డిశ్చార్జి చేశారు. కామినేని ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు ఈ వివరాలు వెల్లడించారు. నాచారానికి చెందిన 51 ఏళ్ల వ్యాపారికి డెంగీ సోకింది. ఆక్సిజన్ శాచ్యురేషన్ పడిపోయి ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. కుటుంబసభ్యులు వారం క్రితం ఆసుపత్రిలో చేర్పించడంతో వైద్యులు ఎక్మో చికిత్స ప్రారంభించారు. తొమ్మిది రోజుల్లో కోలుకున్నాడు. డెంగీలో రోగనిరోధక వ్యవస్థ శరీర అవయవాలపై దాడి చేయడంతో ఊపిరితిత్తులు దెబ్బతిన్నట్లు తెలిపారు.

దుంగలే కాపాడాలిక!



మూసారాంబాగ్ పరిధి శాలివాహన నగర్ ప్రభుత్వ పాఠశాల ఎదుట నాలా క్యాచ్‌పిట్ మూత ధ్వంసమైంది. విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోయే సమయంలో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉండటంతో స్థానికులు.. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా పట్టించుకోకపోవడంతో తాత్కాలికంగా దుంగలు అడ్డుగా పెట్టారు. –న్యూస్‌టుడే, మూసారాంబాగ్

పచ్చదనం.. ప్రమాదకరం



రహదారి పక్కన ఉన్న చెట్ల కొమ్మలు.. ఎల్బీనగర్ పైవంతెన పైకి చేరాయిలా. వాహనదారులు అప్రమత్తంగా లేకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు తొలగించాల్సిన అవసరముంది. – ఈనాడు, హైదరాబాద్

మద్యం తెచ్చిచ్చి.. మత్తులోకి చేరగానే దోపిడీ

ప్రధాన సూత్రధారి బాలుడితో సహా నిందితుడి అరెస్టు.. పరారీలో మరొకరు

సైదాబాద్, న్యూస్‌టుడే: అర్ధరాత్రి మద్యం కోసం వచ్చే వ్యక్తులే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్న ఓ ముఠాను సైదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు వ్యక్తుల ముఠాలో బాలుడు ప్రధాన సూత్రధారి. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్ కథనం ప్రకారం.. ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతానికి ఈ నెల 17న మద్యం కోసం వచ్చిన ఎస్బీహెచ్ కాలనీకి చెందిన రాంమోహన్ యాదవ్, ఈ నెల 19న మొగల్‌పురాకు చెందిన సయ్యద్ అక్బర్ వచ్చారు. ముగ్గురు నిందితులు వారి నుంచి డబ్బులు తీసుకుని మద్యం తెచ్చి ఇచ్చారు. వారు మత్తులోకి జారుకోగానే దాడి చేసి నగదుతో పాటు ఫోన్లు లాక్కున్నారు. బాధితుల ఫిర్యాదులో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీల ద్వారా ఓ బాలుడు (16), ప్రసాద్ (21), మహేశ్ (21)లను నిందితులుగా గుర్తించారు. బుధవారం బాలుడు, ప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నారు. మహేశ్ పరారీలో ఉన్నాడు. బాలుడిని సైదాబాద్ జువైనల్ హోంకు తరలించారు. సైదాబాద్ ఠాణాలో 3, వనస్థలిపురం ఠాణాలో 2, సరూర్‌నగర్ ఠాణాలో ఒక కేసుల్లో బాలుడు నిందితుడని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో ప్రమాదం.. ఆటో డ్రైవరుకు పదేళ్ల జైలు



రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఆటోను నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవరుకు న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.23,000 జరిమానా విధించింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘు కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన కావలి **శ్రీను అలియాస్ శ్రీనివాస్** (32) సొంతూరు, షాద్‌నగర్ మధ్య ఆటో నడిపేవాడు. 2021 ఏప్రిల్ 10న మద్యం మత్తులో ప్రయాణికులను ఎక్కించుకొని షాద్‌నగర్ నుంచి నాగులపల్లికి వెళ్తుండగా, ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో నాగులపల్లికి చెందిన బి.గోవర్ధన్ మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. షాద్‌నగర్ పోలీసులు నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. కేసు విచారించిన జిల్లా 9వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీశ బుధవారం తుది తీర్పునిచ్చారు.

బాలికకు వేధింపులు.. యువకుడికి మూడేళ్ల శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట బాలిక వెంటపడి మార్ఫింగ్ ఫొటోలతో వేధించి డబ్బులు వసూలు చేసిన యువకుడికి న్యాయస్థానం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించింది. ప్రత్యేక పీపీ సునీత కథనం ప్రకారం.. సైదాబాద్ చావుని ప్రాంతానికి చెందిన గడ్డం సాయికుమార్ (24) ప్రైవేటు ఉద్యోగి. 2018లో మీర్‌పేట ఠాణా పరిధిలో పదో తరగతి చదివే బాలిక(14)తో పరిచయం ఏర్పడింది. ప్రేమించాలని కోరగా, ఆమె నిరాకరించడంతో వేధించడం ప్రారంభించాడు. సామాజిక మాధ్యమాల ద్వారా బాలిక ఫొటోలు సేకరించి మార్ఫింగ్ చేసి, బెదిరించాడు. బాలిక నుంచి రూ.10,000 వసూలు చేశాడు. వేధింపులు తీవ్రం కావడంతో బాలిక మీర్‌పేట ఠాణాలో ఫిర్యాదు చేసింది. జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి పద్మావతి బుధవారం తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.లక్ష పరిహారం మంజూరు చేశారు.

కారు అద్దం పగలగొట్టి.. రూ.2 లక్షల చోరీ

హయత్‌నగర్: పార్కింగ్ చేసిన కారు అద్దం పగలగొట్టి రూ.2 లక్షల నగదు చోరీ చేసిన ఘటన హయత్‌నగర్ పోలీసు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చింతల్‌కుంట సమీపంలోని సరస్వతి నగర్ కాలనీకి చెందిన సుధాకర్‌రెడ్డి స్నేహితుడి కారులో రిజిస్ట్రేషన్ నిమిత్తం హయత్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. డాక్యుమెంట్ తయారీ చేయించేందుకు వెళ్తూ, రూ.2 లక్షల నగదుతో కూడిన బ్యాగ్‌ను కారులోనే ఉంచాడు. తిరిగొచ్చేసరికి కారు అద్దం పగలగొట్టి నగదుతో కూడిన బ్యాగ్ ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి అదృశ్యం



సైదాబాద్, న్యూస్‌టుడే: వైద్య పరీక్షల కోసం సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు అదృశ్యమైన ఘటన సైదాబాద్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై నాగిశెట్టి సాయికృష్ణ కథనం ప్రకారం.. సూర్యాపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు **నాగిరెడ్డి పుల్లారెడ్డి** (86) ఈ నెల 8న హైదరాబాద్‌కు వచ్చారు. ఐఎస్ సదన్ డివిజన్ సరస్వతీనగర్ ఐబీపీ పెట్రోల్ బంక్ దగ్గర నివసించే కుమార్తె వద్ద ఉంటున్నారు. 22వ తేదీ ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుమార్తె మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT KAMAREDDY
O.S.No.116/2012

Between:
Khaja Azhar Ali (Died per L.Rs) & Ors., ...**Plaintiffs**
And
Fakrunissa Begum W/o **Malik,** Aged. 64 Yrs, R/o H.No.16-9-149, Old Malakpet, Hyderabad, Occ. Household. ...**Defendants**

Suit Summons in O.S.No.116/2012 to the 1st Defendant

The 1st Defendant may please take notice that the civil suit bearing O.S.No.116/2012 stands posted on the file of the Hon'ble Principal Junior Civil Judge, Kamareddy on **28.10. 2024 at 10.30 A.M** for your appearance in Person or through Pleader duly instructed failing which, the suit shall proceed Ex-Parte.

// BY ORDER //
Sd/- **M/s RAKESH SANGHI & C.MURALI,** Advocates
C-308, 3rd Floor, Upasana 4-1-970, Ahuja Estate Abids Road, Hyderabad-1
Place : Hyderabad
Date : 24.10.2024

అటవీశాఖ అనుమతిస్తే..

- 3 దశాబ్దాల క్రితం మూతబడిన రోడ్డు
- పునరుద్ధరించాలని స్థానికుల వినతి

తగ్గేది.. 5 కి.మీ.ల దూరం

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: మన్సూరాబాద్ నుంచి ఆటోనగర్ డంపింగ్ యార్డు మీదుగా పాత పోచంపల్లి రోడ్డు ఉండేది. ఈ రహదారికి మూడు దశాబ్దాల క్రితం 1990ల్లో అడ్డంగా గోడను నిర్మించి, అటవీశాఖ ఆధీనంలోకి తీసుకుంది. ఈ మార్గాన్ని పునరుద్ధరిస్తే ఎల్బీనగర్ వాసులు ట్రాఫిక్ సమస్య లేకుండా ఔటర్ రింగ్ రోడ్డు, పోచంపల్లి పరిసర గ్రామాలకు సులువుగా చేరుకోవచ్చు. పోచంపల్లి పరిసర గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపైకి రాకుండా నేరుగా ఎల్బీనగర్ చేరుకోవచ్చు. దీంతో నాలుగేళ్లుగా ఈ రహదారిని పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. డంపింగ్ యార్డు నుంచి దాదాపు 200 మీటర్ల స్థలంలో హరిణి వనస్థలి, క్రీడా సంస్థలు ఉన్నాయి. ఈ స్థలం అటవీ శాఖ ఆధీనంలో ఉండటంతో ఎమ్మెల్యే, కార్పొరేటర్ తదితరులు సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ స్థలం రోడ్డుకు ఇచ్చేందుకు అటవీ శాఖ సుముఖంగా ఉన్నట్లు చెబుతున్నారు. డంపింగ్ యార్డు వద్ద చెత్త పేరుకుపోయిందని, దాన్ని తొలగించుకోవాలని అటవీశాఖ అధికారులు చెబుతున్నట్లు సమాచారం.


ఆటోనగర్ మీదుగా పాత పోచంపల్లి రోడ్డు

ఎల్బీనగర్ వాసులకు ఉపయోగకరం..
– కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్

పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మార్గాన్ని పునరుద్ధరిస్తే.. ఇక్కడి నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు, పాత పోచంపల్లి సమీపంలోని 30 గ్రామాలకు నేరుగా చేరుకోవచ్చు. హైవేపై ట్రాఫిక్ సమస్యను తగ్గించవచ్చు. ఎంపీ ఈటల రాజేందర్ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక అధికారులకు సైతం వినతులు అందజేశాం. త్వరలో పరిష్కారమవుతుంది.

త్వరలో పునరుద్ధరణ పనులు
– సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎల్బీనగర్

2022లో అటవీశాఖ ముఖ్య అధికారులతో సమావేశమై సమస్యను వివరించా. రహదారి పునరుద్ధరణకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఆటోనగర్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించాల్సి ఉంది. రెండు, మూడు నెలల్లో పునరుద్ధరణ పనులు ప్రారంభమై.. పాత పోచంపల్లి రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలో ఏఐవైఎఫ్ ప్రతినిధులు

ఎల్బీనగర్: పెండింగ్‌లోని ఫీజు బకాయిలు, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు టి.మధు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఎల్బీనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టి.మధు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి, ఫీజులు చెల్లించాలన్నారు. లేనిచో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. శివకుమార్ గౌడ్, వెంకటేశ్, శివ, వీరేశ్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన 25, 26 తేదీల్లో..

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం (ఔట్‌సోర్సింగ్) పోస్టుల భర్తీకి ఈ నెల 25, 26న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ కార్యాలయం స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్‌లోని నాలుగో అంతస్తులోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో పరిశీలన ఉంటుందని తెలిపారు.

అవినీతిరహిత సమాజ నిర్మాణానికి కృషి: సీజీఎం

గన్‌ఫౌండ్రి, నారాయణగూడ: విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఐడీబీఐ బ్యాంక్ ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. గన్‌ఫౌండ్రి చాపెల్ రోడ్డులోని జోనల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ... నినాదాలు చేశారు. ఎల్బీ స్టేడియం పరిసర ప్రాంతాల మీదుగా ర్యాలీ కొనసాగింది. ఐడీబీఐ బ్యాంక్ జోనల్ సీజీఎం శరత్‌కుమార్ కామత్ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.


ప్రదర్శనలో ఐడీబీఐ ఉద్యోగులు

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కలెక్టర్

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘానికి నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు బుధవారం కలెక్టర్‌ను కలిశారు. అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను సన్మానించారు. ప్రధాన కార్యదర్శి ఖదీర్, పూనం, నామాల శ్రీనివాస్, అశన్న, మంజులారెడ్డి, వెంకటరమణ, మంచాల రవీందర్, సురేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో మాట్లాడుతున్న ఎంబీ కృష్ణయాదవ్

సంక్షిప్త సమాచారం

పైపులైన్ పనులు ప్రారంభం

చాంద్రాయణగుట్ట: గౌలిపుర డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కామాక్షమ్మ ఆలయం వద్ద రూ.1.80 లక్షలతో సీవరేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి బుధవారం ప్రారంభించారు.

మూసీ నిర్వాసితులకు న్యాయం చేయాలి: సీపీఐ

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మూసీ నది పునరుద్ధరణ, హైడ్రాలో ఇళ్లు కోల్పోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూసీ నది పునరుద్ధరణకు సీపీఐ వ్యతిరేకం కాదని, అక్కడ నివాసం ఉండే పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

సజావుగా గ్రూప్-I పరీక్షలు

సుల్తాన్‌బజార్: కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం(టీఎంవీ), జాంబాగ్‌లోని వివేక వర్ధిని(వీవీ) కళాశాల పరీక్ష కేంద్రాల్లో బుధవారం గ్రూప్-1 మెయిన్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. టీఎంవీ వింగ్-ఏలో 792 మందికి గాను 728 మంది, వింగ్-బీలో 864 మందికి గాను 779 మంది హాజరయ్యారు. వీవీ కళాశాల కేంద్రంలో 528 మందికి గాను 447 మంది రాశారు.

సికింద్రాబాద్‌లో 25న ఉద్యోగ మేళా

కార్వాన్, న్యూస్‌టుడే: ప్రైవేటు సంస్థల్లోని వివిధ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.జయశ్రీ తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా కలిగిన సం.18 నుంచి 30 మధ్య ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో సికింద్రాబాద్ చంద్రలోక్ కాంప్లెక్స్‌లోని స్టాఫింగ్ టైటాన్స్ కార్యాలయంలో నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన వారికి మంచి జీతభత్యాలు చెల్లించటం జరుగుతుందన్నారు.

దివ్వెల పండగ.. కొనుగోళ్లు మెండుగా

చార్మినార్ పరిసరాల్లో సందడి

న్యూస్‌టుడే, చార్మినార్ : చార్మినార్ పరిసర బస్తీల్లో దీపావళి సందడి నెలకొంది. పండగకు 10 రోజుల ముందుగానే దీపాల దొంతరలు, తుమ్మిడీల క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. భాగ్యలక్ష్మి ఆలయంతో పాటు చార్మినార్ ఎదుట ఉండే బంగారు, వెండి ఆభరణాల దుకాణాలను రంగుల దీపాలతో సుందరంగా అలంకరించారు. ధన్‌తేరాస్‌తో ప్రారంభమయ్యే దీపావళి పూజలు వరసగా నరక చతుర్దశి, శుభ దీపావళి పూజ, గోవర్ధన పూజ, బాయ్‌దూజ్ పూజలతో ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా చార్మినార్ భాగ్యలక్ష్మి మాత దర్శనానికి ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో తరలొస్తారు. ఈ నెల 31న దీపావళి ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో అమ్మవారి ఖజానాగా నాణేలు పంపిణీ చేస్తామని ఆలయ ట్రస్టీ శశికళ, సూర్యప్రకాశ్‌శంభు తెలిపారు. వివిధ గుడులను నిర్వాహకులు ముస్తాబు చేశారు.


కొనుగోలు చేస్తున్న మహిళలు


హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ ట్రస్టీ శశికళ

తుమ్మిడీల విక్రయాల సందడి

దీపావళిని పురస్కరించుకుని చార్మినార్ పరిసరాల్లో కొండపల్లి బొమ్మలు, మట్టి, చెక్క బొమ్మలు, తుమ్మిడీలు, దీపాంతల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆడపడుచులకు పుట్టింటి వారు తుమ్మిడీలను పండగ కానుకగా అందించడం ఉత్తరభారతీయుల సంప్రదాయం. పండగ రోజు తుమ్మిడీల్లో దీపాలను వెలిగించడానికి బంధువులకు వాటిని కానుకగా పంపిస్తారు. ఘాన్సిబజార్ మామజుమ్లాపాటక్‌లోని నితీన్‌టాయ్స్‌లో ఈ ఏడాది విద్యుత్ వెలుగులతో ఉండే తుమ్మిడీలను కళాకారుడు రాజేంద్రప్రసాద్ అగర్వాల్ ఆయన కుమారులు నితీన్‌అగర్వాల్, నితేశ్ అగర్వాల్ రూపొందించారు.


ఘాన్సిబజార్‌లో తుమ్మిడీలు తయారుచేస్తున్న నితీన్‌అగర్వాల్

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

– న్యూస్‌టుడే, చార్మినార్, కార్వాన్, కేశవగిరి, ఉస్మానియా ఆసుపత్రి

? గుల్జార్‌హౌజ్ షేర్ బెహతుల్ కమాన్ వద్ద నిత్యం సాయంత్రం ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి. పర్యాటకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. **- ఆనంద్, శ్రీనివాస్, రేణుక, గుల్జార్‌హౌజ్**

✓ వాహనాల పార్కింగ్ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. చార్మినార్‌కు వచ్చే వాహనాదారులకు మదీనా, సర్దార్‌మహల్, ఖిల్వత్ పరిసరాల్లోని వాహనాల పార్కింగ్ కేంద్రంలో నిలపాలని అవగాహన కల్పిస్తాం. **- కె.లక్ష్మణ్, ఏసీపీ, చార్మినార్**

? జాఫర్‌గూడ, ఉప్పరబస్తీల్లోని అన్నపూర్ణ, వీరభద్రస్వామి ఆలయాల వద్ద రోడ్డు తవ్వేశారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో త్వరగా కొత్త రహదారి నిర్మించాలి. **- డి.ప్రభాకర్, ఉప్పరబస్తీ, శివరాజ్, తాళ్లగడ్డ**

✓ త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఈ, గుడిమల్కాపూర్**

? చాంద్రాయణగుట్ట ఠాణా వెనుకవైపున మున్సిపల్ మైదానం ఆనుకొని వ్యాపారులు ఇష్టానుసారంగా తోపుడు బండ్లు, ఆటోలు, ఇతర వాహనాలు రోడ్డు వరకు నిలుపుతున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. **- జమీల్, బార్కస్**

✓ రెండు రోజులుగా ఆక్రమణలు లేకుండా చర్యలు చేపట్టాం. ఈసారి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. **- జె.శ్రీనునాయక్, ఇన్‌స్పెక్టర్, చాంద్రాయణగుట్ట**

? ఉస్మానియా ఓపీ ప్రాంగణంలో కొంత మంది నడవలేని నిస్సహాయ స్థితిలో రోగులు ఉంటున్నారు. వారికి సపర్యలు చేసేవారు లేకపోవడంతో నానాయాతన పడుతున్నారు. **- కె.రాజేశ్వర్‌రావు, సత్యహరీశ్చంద్ర సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు**

✓ అనాథ రోగులకు సేవలు అందించేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధుల సహకారం తీసుకుంటున్నాం. **- డా.ఎండీ.రఫీ, ఆర్ఎంవో, ఉస్మానియా ఆసుపత్రి**

ఉపకార వేతనాలు విడుదల చేయాలని ధర్నా

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, ఓయూ అధ్యక్షుడు లెనిన్‌లు మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి బకాయిలు విడుదల కాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవనాల అద్దె చెల్లించలేక, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నానా యాతన పడుతున్నారన్నారు. ధర్నా చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని బండ్లగూడ ఠాణాకు తరలించారు. నాయకులు అరెకంటి భగత్, కాంపల్లి కళ్యాణ్, అశ్విన్, ఉదయ్, పవన్ పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ నేతల ప్రదర్శన

ఉద్యోగుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తాం

అబిడ్స్, న్యూస్‌టుడే: జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో వివిధ విభాగాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పని చేస్తోందని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవిస్తామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఏవీఎస్ గాంధీ, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.రామకృష్ణలు నియమితులయ్యారు. వారిని సత్కరించారు. యూనియన్ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వి.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఆదిల్ షరీఫ్, చిత్రంలో ఏవీఎస్ గాంధీ, రామకృష్ణ, విజయ్‌కుమార్

భాజపాతోనే అభివృద్ధి సాధ్యం

ఐఎస్ సదన్, న్యూస్‌టుడే: భాజపాతోనే అభివృద్ధి సాధ్యమని కార్పొరేటర్ జంగం శ్వేత అన్నారు. వినయ్‌నగర్ కాలనీలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర సర్కారు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, నాయకులు భీష్మాచారి, లక్ష్మణ్ పాల్గొన్నారు.


సభ్యత్వాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ శ్వేత

జట్టుగా పనిచేయటమే విజయానికి మార్గం


డ్యూటీమీట్ విజేతలతో నగర సీపీ సీవీ ఆనంద్, సీసీఎస్ డీసీపీ శ్వేత

ఈనాడు, హైదరాబాద్: పోలీస్‌డ్యూటీ మీట్‌లో విజేతలుగా నిలిచిన పోలీసు బృందం స్నేహభావం, జట్టుగా పనిచేస్తే విజయాలు వరిస్తాయనేందుకు ఉదాహరణగా నిలిచారని నగర సీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఇటీవల తెలంగాణ పోలీస్ డ్యూటీమీట్‌లో 5 బంగారు, 2 వెండి, 5 కాంస్య పతకాలతో విజేతలుగా నిలిచిన 35 మంది సిబ్బందిని బుధవారం బషీరాబాగ్ సీసీఎస్ ప్రాంగణంలో సీపీ అభినందించారు. వారిని నగదు బహుమతితో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్యూటీమీట్‌లతో అంతర్గత ప్రతిభ వెలుగు చూస్తుందన్నారు. టీమ్‌తో కలసి పనిచేయడంతో స్నేహం, జట్టుతత్వం అలవడతాయని సూచించారు. పోలీసుశాఖలో సాధారణ, సంప్రదాయ పద్ధతులను మరచిపోకుండా ఆచరణలో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ డీసీపీ శ్వేత, ఏసీపీలు జి.గురురాఘవేంద్ర, జె.నందుకుమార్, పూర్ణచందర్‌రావు, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, రాజశేఖర్, డి.రాంబాబు, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

నాటకం.. నవజీవన సందేశం

నారాయణగూడ: నాటకం నవజీవన సందేశమని పలువురు వక్తలన్నారు. బుధవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో తొలి మాండలిక నాటక రచయిత కె.ఎల్(కోదాటి) నరసింహారావు శతజయంతి సందర్భంగా జరుగుతున్న నాటకోత్సవాలు ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత డీజీపీ, రసరంజని వ్యవస్థాపక అధ్యక్షులు హెచ్.జె.దొర మాట్లాడుతూ.. సమాజాన్ని సంస్కరించే, ఆలోచింపజేసే నాటకాల అవసరం ఉందన్నారు. సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచందర్‌రావు, అధ్యక్షుడు ఆకుల సదానందం, ప్రధాన కార్యదర్శి సాధుశ్యాంప్రసాద్, విప్రసేవా సంఘం అధ్యక్షుడు పెన్నంపల్లి నర్సింహారావు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న హెచ్‌జె దొర తదితరులు

పేదల ఇళ్లు కూల్చివేస్తామంటే సహించేది లేదు


కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌రాథోడ్ తదితరులు

గోషామహల్: మూసీ పునరుజ్జీవం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడాన్ని అడ్డుకొని తీరుతామని మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌రాథోడ్ అన్నారు. 'మూసీ బాధితులకు భాజపా అండ' కార్యక్రమంలో భాగంగా బుధవారం చంద్రకిరణ్‌బస్తీ, అంబేడ్కర్‌నగర్, దేవీనగర్, జగన్నాథ్‌మఠ్, ముస్లింజంగ్ బ్రిడ్జి ప్రాంతాల్లోని నివాసితులను కలిసి భరోసా కల్పించారు. మూసీ బాధితులకు న్యాయం కోసం ఈ నెల 25న మహా ధర్నా నిర్వహిస్తోందన్నారు. పార్టీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, కార్పొరేటరు రాకేశ్ జైస్వాల్, నేతలు రఘునందన్‌యాదవ్, కృష్ణ, గోపాల్‌జీ, దాసరి శేఖర్ పాల్గొన్నారు.

గంజాయి సరఫరాదారు శీలాబాయి అరెస్టు


పోలీసుల అదుపులో శీలాబాయి

ధూల్‌పేట, న్యూస్‌టుడే: పేరుమోసిన గంజాయి సరఫరాదారు శీలాబాయిని ఎట్టకేలకు ఆబ్కారీ పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్కుఫోర్స్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి నేతృత్వంలో ఎస్టీఎఫ్ బృందం, ధూల్‌పేట ఆబ్కారీ బృందం అప్పర్ ధూల్‌పేటలోని బడాబంగ్లాలో నివసిస్తున్న ఆమె ఇంటిపై దాడి చేసి అరెస్టు చేశారు. 1.405 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసులో ధూల్‌పేటకు చెందిన గణేశ్‌సింగ్, ఒడిశాకు చెందిన సరఫరాదారు సంగీత సాహూ పరారీలో ఉన్నారు. సీఐలు మధుబాబు, జీడీ గోపాల్ పాల్గొన్నారు.

● పురానాపూల్ నుంచి కార్వాన్ రహదారిలో రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న సీతారాంబాగ్‌వాసి క్రాంతి, కార్వాన్‌వాసి నిరంజన్‌లను అరెస్టు చేసి 1.308 కిలోల గంజాయి, మూడు చరవాణులు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఒడిశాకు చెందిన ప్రధాన సరఫరాదారు గిరిధర్ నిస్సాల్, నకుల్ బెహెరాలు పరారీలో ఉన్నట్లు ఎస్టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి తెలిపారు.

బస్టాపు వద్ద విక్రయిస్తూ.. గోల్కొండ: గోల్కొండ రామ్‌దేవ్‌గూడ బస్టాపు వద్ద ఆబ్కారీ అధికారులు తనిఖీలు చేపట్టారు. అల్లాపూర్‌కు చెందిన రాహుల్‌సింగ్ గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద 1.4 కిలోల గంజాయి దొరికింది. రెండు చరవాణులు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసులో రోహిత్‌సింగ్‌కు సంబంధం ఉందని తేలడంతో అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి తెలిపారు.

కరడుగట్టిన ఇద్దరు రౌడీషీటర్ల రిమాండ్


అష్వక్


అయూబ్‌ఖాన్

చార్మినార్, న్యూస్‌టుడే : నగరంలో కరడుగట్టిన రౌడీషీటర్లు మహ్మద్ అయూబ్‌ఖాన్(54), మహ్మద్ అష్వక్(40)ను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపారు. కామాటిపుర ఠాణాలో గత ఏడాది నమోదైన కేసులో తప్పించుకుని తిరుగుతున్న అయూబ్‌ఖాన్‌పై నాంపల్లి న్యాయస్థానం నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేసింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న అయూబ్‌ఖాన్‌ను దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్సైలు నర్సింహులు, ఆంజనేయులు బృందం అదుపులోకి తీసుకున్నారు. కామాటిపుర ఠాణాలో అప్పగించడంతో అక్కడి పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఫతేదర్వాజ్‌కు చెందిన మహ్మద్ అయూబ్‌ఖాన్ అలియాస్ అయూబ్ పహిల్వాన్, పఠాన్ మొదట్లో లాడ్‌బజార్‌లో ఇనుప వస్తువులు విక్రయించేవాడు. అనంతరం చిన్నపాటి గొడవలు, సివిల్ వివాదాల్లో తలదూర్చడంతో శాలిబండ పోలీసులు ఇతనిపై రౌడీషీట్ తెరిచారు. మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో 72 క్రిమినల్ కేసులు ఈయనపై నమోదయ్యాయి. వాటిలో 14 హత్యలు, 14 హత్యాయత్నం, భూ కబ్జాలు, బెదిరింపులు, అక్రమ ఆయుధాలు, దోపిడీలే అధికంగా ఉన్నాయి. పీడీయాక్టు ప్రయోగించి జైలుకు పంపినా విడుదల కాగానే మళ్లీ రౌడీదందాలతో హల్‌చల్ చేసేవాడు. గతంలో నకిలీ పాస్‌పోర్టుతో విదేశాలకు వెళ్లడం సంచలనంగా మారింది. దుబాయ్ నుంచి బంగారం స్మగ్లింగ్, వివాదాల భూముల్లో పాగా వేసి భారీగా సంపాదించాడు. కుమారుడిని రాజకీయాల్లోకి తెచ్చేందుకు ప్రయత్నించాడు. ఇతను నగరంలోకి వచ్చాడన్న సమాచారంతో ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా వేసి అరెస్టు చేశారు.

అష్వక్‌పై 44 క్రిమినల్ కేసులు

కామాటిపుర నివాసి మహ్మద్ అష్వక్‌పై 2000లో కాలాపత్తర్ ఠాణాలో రౌడీషీట్ తెరిచారు. మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఇతనిపై 44 క్రిమినల్ కేసులున్నాయి. వీటిలో 2 హత్యలు, 6 హత్యాయత్నం కేసులున్నాయి. డబ్బు కోసం ఎంతకైనా తెగించేందుకు సిద్ధపడతాడు. పోలీసులు కన్నుగప్పి తిరుగుతున్న ఇతనిని మంగళవారం అర్ధరాత్రి ఉత్తర మండలం టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర బృందం అదుపులోకి తీసుకుంది. ఈయన నుంచి కత్తి స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు

గోషామహల్, న్యూస్‌టుడే: విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో బేగంబజార్ డీఈఈ ఫర్హత్‌అలీ పేర్కొన్నారు. ఇక్కడి పనిచేసిన నెహ్రూనాయక్ సైఫాబాద్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయణ్ని భారాస నేతలు ఆనంద్‌కుమార్‌గౌడ్, ప్రియాగుప్తా, అహ్మద్ తదితరులు తోప్‌ఖానాలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో బుధవారం సన్మానించారు.


డీఈ ఫర్హత్‌అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్, ప్రియాగుప్తా, అహ్మద్

లాభాలిస్తామని.. రూ.3.60 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు ఇప్పిస్తామని ఆశచూపి నగదు దోచేశారంటూ గృహిణి హైదరాబాద్ సైబర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన గృహిణికి ఓ కంపెనీ ప్రతినిధి వాట్సాప్‌లో సంప్రదించారు. స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడి అవకాశాలను వివరించారు. నమ్మిన బాధితురాలు విడతల వారీగా రూ.3.60 లక్షలు బదిలీ చేశారు. ఆ తర్వాత మీరు పంపించిన డబ్బు ఐపీవోకు వెళ్లిందని.. దాంతో ట్రేడింగ్ తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. మరో 15 రోజుల్లో డబ్బులు తిరిగి పంపిస్తామని నమ్మించారు. ఈ ప్రక్రియ కొనసాగుతుందని.. అదనంగా కూడా పెట్టుబడులు పెట్టాలంటూ ఒత్తిడి తీసుకురావడంతో బాధితురాలికి అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు.

సైబర్ నేరానికి అడ్డుకట్ట

● బాధితుడికి రూ.53 లక్షలు తిరిగి ఇప్పించిన పోలీసులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయిన బాధితుడికి పోలీసులు నగదు తిరిగి ఇప్పించారు. నగరానికి చెందిన వయోధికుడి(84)కి ఫెడెక్స్ కొరియర్ ప్రతినిధినంటూ నేరస్థుడు ఫోన్ చేశాడు. మీ పేరుతో బుక్ అయిన పార్సిల్‌లో నిషేధిత వస్తువులు ఉన్నాయని చెప్పాడు. వెంటనే సీబీఐ అధికారులమంటూ వాట్సాప్ వీడియోకాల్ చేసి రూ.కోట్ల మోసం కేసులో మీ ప్రమేయం ఉందని బెదిరించారు. దాంతో బాధితుడు భయపడ్డారు. నేరస్థులు చెప్పిన ప్రకారం ఏకంగా రూ.2.88 కోట్లు బదిలీ చేసేశారు. తేరుకొని వెంటనే హైదరాబాద్ సైబర్ పోలీసులకు సంప్రదించారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు, పీసీలు డి.శేఖర్, హెచ్.శేఖర్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఫౌజియా బేగంలు వెంటనే బాధితుడి సొమ్ము ఏ ఏ బ్యాంకు ఖాతాలకు వెళ్లాయో తెలుసుకొని వాటికి నోటీసులిచ్చి సొమ్మును స్తంభింపజేయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో సూరత్‌లోని యాక్సిస్ బ్యాంక్‌లో రూ.53 లక్షలు, కేరళలోని ఎస్‌బీఐలో రూ.50 లక్షల వరకు ఫ్రీజ్ చేయించారు. అందులో కోర్టు ఆదేశాలతో రూ.53 లక్షలు బాధితుడి ఖాతాకు బదిలీ చేయించారు. సైబర్ పోలీసుల కృషిని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అభినందించారు.

దేవాదాయ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖలో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ సంఘాల ఐకాస అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ ఇటీవల కాలంలో పలువురికి పదోన్నతులు కల్పించడంతో ఐకాస ప్రతినిధులు మంత్రిని, శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌లను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి గీసిన మంత్రి, శాఖ కార్యదర్శి చిత్రపటాలను వారికి అందజేశారు. ఆయణ్ని వారు అభినందించారు. ఐకాస ప్రతినిధులు పరాశరం రవీంద్రాచార్యులు, అగ్నిహోత్ర చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటాన్ని మంత్రి కొండా సురేఖకు అందజేస్తున్న కృష్ణమాచారి తదితరులు

ఉంగరాలు, నగదు, సెల్‌ఫోన్ల బ్యాగు చోరీ

కాచిగూడ: కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం... నాంపల్లి ప్రాంతానికి చెందిన రతిలాల్‌జైన్.. తన భార్య, కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 5న కాచిగూడ నుంచి లాల్‌ఘర్ ఎక్స్‌ప్రెస్‌లో జోధ్‌పూర్‌కు బయలుదేరారు. రైలు ముత్కేడ్ స్టేషన్ వద్ద ఉండగా 6 గ్రాములున్న రెండు బంగారు ఉంగరాలు, రెండు సెల్‌ఫోన్లు, రూ.50 వేల నగదు ఉన్న బ్యాగు చోరీకి గురైంది. వారు తిరిగి నగరానికి వచ్చాక చూసుకునే సరికి సెల్‌ఫోన్ నుంచి ఫోన్‌పే ద్వారా రూ.68 వేల నగదు కాజేసినట్లు గుర్తించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఏఎన్ఎం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన 25, 26న

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: హైదరాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం(ఔట్‌సోర్సింగ్) పోస్టుల భర్తీకి ఈ నెల 25, 26న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ కార్యాలయం స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్‌లోని నాలుగో అంతస్తులోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో జరుగుతుందన్నారు. గతేడాది జిల్లాలోని గిరిజన వసతి గృహాలలోని ఏఎన్ఎం పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మాత్రమే పరిశీలనకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు నివాసం, స్థానికత, కులం, స్టడీ, బోనఫైడ్, విద్యార్హతల సర్టిఫికెట్లు ఒరిజినల్, ఒక జిరాక్స్ సెట్ తీసుకురావాలని సూచించారు.

సగం దారి.. వ్యర్థాలు చేరి

నగరంలో చాలా ప్రాంతాల్లో చెత్త సకాలంలో తరలించడం లేదు. దీంతో దుర్వాసనతో పాదచారులు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. అంతేకాక రోడ్డు సగభాగం వ్యర్థాలతో నిండిపోతోంది. నడకకు సైతం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


చాదర్‌ఘాట్ నుంచి కోఠి వెళ్లే దారిలో..


బేగంబజార్ ఫీల్‌ఖానా కూడలిలో..

సర్వీసు రోడ్లపై పార్కింగ్ చేస్తే చర్యలు


లారీ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ బాలాజీ

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: సర్వీసు రోడ్లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ పేర్కొన్నారు. ఉప్పర్‌పల్లిలో లారీలను నిలుపుతున్న డ్రైవర్లతో బుధవారం ఆయన మాట్లాడారు. సర్వీసు రోడ్లపై లారీలు నిలిపితే ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఇక నుంచి ఇలా నిలిపే వారికి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, ఎస్సై రాజేందర్, ఏఎస్సై రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

శంషాబాద్: గర్భిణులు మొదటి మాసం నుంచే పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. బుధవారం బురుజుగడ్డ తండా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొని పసుపు, కుంకుమ, దుస్తులు అందజేశారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. సమతుల ఆహారం తీసుకుంటేనే ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.


కార్యక్రమంలో గర్భిణులు, ఐసీడీఎస్ అధికారులు

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయురాలి డిప్యుటేషన్ రద్దుకు వినతి

జిల్లేడు చౌదరిగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు శైలజ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని హెచ్‌ఎం సునీతకు గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. ఆమె డిప్యుటేషన్‌పై వెళితే విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుందని వివరించారు.

కేశంపేటలో 108 అంబులెన్స్ తనిఖీ

కేశంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను జిల్లా ప్రోగ్రాం మేనేజరు శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, పరికరాల పనితీరును, రికార్డులను పరిశీలించారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

షాద్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన సీనియర్ నేత గున్న భీమయ్య కుమారుడు మల్లేష్‌యాదవ్ మృతి చెందిన నేపథ్యంలో.. మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ బుధవారం ఆయనను పరామర్శించారు. మల్లేష్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

బీసీ మహాసభ ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్

షాద్‌నగర్‌పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణ బీసీ నాయకుడు మానపాటి ప్రదీప్‌కుమార్ ఎంపికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ రాజధానిలో జరిగిన సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని అందించారు.

సంగెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

కేశంపేట,న్యూస్‌టుడే: జిమ్స్ హోమియోపతి వైద్య కళాశాల, ఆసుపత్రి ముచ్చింతల ఆధ్వర్యంలో బుధవారం సంగెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్న పిల్లల వ్యాధుల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎముకలు, కీళ్ల సంబంధమైన రుగ్మతలను గుర్తించేందుకు చేయించాల్సిన పరీక్షలను వివరించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన పోషక ఆహార విషయాలను తెలిపారు. పలువురు వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కాటేదాన్, న్యూస్‌టుడే: అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ ప్రేమావతిపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకులు కోరని బాల్‌రాజ్, మజ్జిగ నరసింహ యాదవ్‌లను ఆయన పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. పార్టీ నాయకులు జల్‌పల్లి నరేందర్, ధనుంజయ్, విజయ్‌కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దారులు దారుణం..

అడుగేయలేం

సర్కిల్‌లోని అన్ని బస్తీల్లో అదే దుస్థితి


నేతాజీనగర్‌లో ప్రధాన రహదారి పరిస్థితి

న్యూస్‌టుడే, రాజేంద్రనగర్

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. అన్ని బస్తీల్లోనూ గుంతలమయంగా మారాయి. కొన్నిచోట్ల సంవత్సరాలుగా అధ్వానంగా ఉన్నా మరమ్మతులు ఊసేలేదు. రెండు మూడు సంవత్సరాల క్రితం రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనా బస్తీల్లో పనులు జరగని దుస్థితి. ఈ పరిస్థితితో పలు బస్తీల్లో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల అంతో ఇంతో బాగున్న రహదారులను తవ్వేసి డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు వేస్తున్నారు. తర్వాత ఆ మార్గాలను పునర్నిర్మించాల్సిన ఉన్నా పట్టించుకోకపోవడంతో వర్షాలకు మరింత దారుణంగా మారాయి. కొన్ని చోట్ల ద్విచక్ర వాహనాలు నడపలేని విధంగా ఉంటున్నాయి.

ప్రభుత్వం మారినా..

వాస్తవానికి జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో గత మూడు సంవత్సరాలుగా పనుల్లో వేగం తగ్గింది. పూర్తయిన వాటికి బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు కొత్తవి చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత పనులు వేగం పుంజుకుంటాయని భావించినా... పరిస్థితి గతంలో మాదిరిగానే కనిపిస్తోంది. రెండేళ్ల క్రితం చేసిన పనులకూ నిధులు విడుదల చేయడం లేదని ఓ గుత్తేదారు వివరించారు. ప్రస్తుతం సర్కిల్‌లో గత రెండు, మూడు సంవత్సరాలుగా మంజూరైన నిధులకు సంబంధించి సుమారు 160 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో అత్యధికం రహదారులే కావడం విశేషం. ఇవన్నీ టెండర్లు పూర్తయి.. పనులు ప్రారంభించాల్సినవే కావడం గమనార్హం. మొదలు పెట్టాలని అధికారులు కోరుతున్నా కాంట్రాక్టర్లు స్పందించడం లేదు.

సర్కిల్: రాజేంద్రనగర్	సర్కిల్ పరిధిలో	దెబ్బతిన్న	నిర్మించాల్సిన
డివిజన్లు : 6 (రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్ నగర్, శాస్త్రీపురం)	రహదారులు: 405 కి.మీ. (సీసీ, బీటీ రోడ్లు మొత్తం కలిపి)	అంతర్గత రోడ్లు : 60 కి.మీ.	రహదారుల పొడవు: 30 కి.మీ.
	మట్టిరోడ్లు : 19 కి.మీ.	పెండింగ్‌లో ఉన్న పనులు విలువ : రూ. 60 కోట్లు	చేపట్టాల్సిన పనుల సంఖ్య : 160

వేగంగా పనులు జరిగేలా చర్యలు

– రవికుమార్, ఉపకమిషనర్

సర్కిల్‌లో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణం వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు గుత్తేదారులతో మాట్లాడి కొన్నింటి పనులు ప్రారంభించారు. పెండింగ్ జాబితాను తగ్గించే విధంగా కృషి చేస్తున్నారు. పాత పనులకు సంబంధించి ఇటీవల కొన్ని బిల్లులు విడుదలయ్యాయి. సమీక్ష నిర్వహించి ప్రాధాన్య క్రమంలో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్:	8008573330
శంకర్‌పల్లి :	8008573266
షాద్‌నగర్:	8008573907
శంషాబాద్:	9963096353

కాటేదాన్, కేశంపేట, కొందుర్గు, న్యూస్‌టుడే:

? పాతకర్నూలు రహదారి కాటేదాన్‌లో ఆటోడ్రైవర్లు ఇష్టారాజ్యంగా వాహనాలను నిలిపి వాహనదారులకు సమస్యలు సృష్టిస్తున్నారు.
– జయప్రకాష్, కాటేదాన్

✓ ఆటోవాలాలతో సమస్యలు అధికమవుతున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటాం.
– రాజేందర్‌గౌడ్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

? కొత్తపేటలోని శాస్త్రీపురం కాలనీలో వీధి దీపాలు మధ్యాహ్నం వేళల్లోనూ వెలుగుతున్నాయి. –జమాల్‌ఖాన్, కొత్తపేట

✓ విద్యుత్తు లైన్‌లో మూడో వైర్ లేని కారణంగా పగటిపూటా వెలుగుతున్నాయి. సమస్యను మండల విద్యుత్తు అధికారి దృష్టికి తీసుకెళ్లాం.
–జగన్, పంచాయతీ కార్యదర్శి, కొత్తపేట

? మండల కేంద్రం నుంచి తూంపల్లి మీదుగా జిల్లేడు చౌదరిగూడకు వెళ్లే తారు రోడ్డు వర్షాలకు దెబ్బతింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – కుమ్మరి నరేశ్, కొందుర్గు

✓ రోడ్డు మరమ్మతుల కోసం టెండర్ పూర్తయింది. గుత్తేదారుతో మాట్లాడి త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.
–శ్రీనివాస్, డీఈ పీఆర్, షాద్‌నగర్

ఖాళీ చేయాలని సబితానగర్ గుడిసెవాసులకు ఆదేశం

నార్సింగి న్యూస్‌టుడే: గండిపేట మండలం కోకాపేటలోని సబితానగర్ గుడిసెలను ఖాళీచేయాలని హెచ్ఎండీఏ అధికారులు బుధవారం వాటిలో ఉండే వారిని ఆదేశించారు. దీంతో స్థానికులకు, అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. 2009లో ప్రభుత్వం వీరికి ఇళ్లపట్టాలు మంజూరు చేసిందని, కోర్టు కేసు కారణంగా స్థలాలు చూపలేదని, తర్వాత వచ్చిన ప్రభుత్వం ఈ స్థలాన్ని ఇతరులకు కేటాయించిందని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ విజయబాబు అధికారులకు వివరించారు. తమకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయిస్తేనే ఖాళీ చేస్తామని గుడిసెవాసులు స్పష్టం చేశారు. అధికారులు స్థానికులకు గతంలో ఇచ్చిన ఇళ్లపట్టాల జిరాక్స్ ప్రతులు, గుడిసెల ఫొటోలు తీసుకుని వెళ్లారు.

విద్యార్థులకు బెల్టు, గుర్తింపు కార్డుల పంపిణీ

షాద్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఫరూఖ్‌నగర్ ఎంఈఓ మనోహర్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా సంకల్ప్, షాద్‌నగర్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ లోని చటాన్‌పల్లి, రాంనగర్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు దాత బుచ్చిగూడ లక్ష్మీనారాయణరెడ్డి సహకారంతో బుధవారం టై, బెల్టు, విద్యార్థి ఫొటోతో గుర్తింపు కార్డులు పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ రమేష్‌గాదం, కార్యదర్శి లక్ష్మీపతిరెడ్డి, కోశాధికారి రాజు, హెచ్ఎం సురేష్‌సింగ్ పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలని ఆందోళన


చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చేవెళ్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. బస్సుల కొరత సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం చేవెళ్లలో ర్యాలీ నిర్వహించి బీజాపూర్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయానికి బస్సులు నడపకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చాలా గ్రామాలకు సర్వీసులు నిలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. విద్యార్థి నాయకులు తేజ, సాయి గణేష్, చరణ్ గౌడ్, సమీర్, చందు, నవీన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు

గ్రామాల్లో భాజపా సభ్యత్వ నమోదు


ఖానాపూర్‌లో దరఖాస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

చేవెళ్ల: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం అన్నారు. బుధవారం ఖానాపూర్, ఘనాపూర్ గ్రామాల్లో సభ్యత్వ నమోదు సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి బూత్ పరిధిలో కనీసం 200 మందిని చేర్పించాలని సూచించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి ఇదే అంశంపై చర్చించారు. పార్టీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, నాయకులు ఆంజనేయులుగౌడ్, డా.వైభవ్, శంకర్, ఇంద్రసేనారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స చేయించారు.. కుటుంబ సభ్యులకు అప్పగించారు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: షాద్‌నగర్ పట్టణానికి చెందిన హైమవతి మతిస్థిమితం కోల్పోయి మూడు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలో మాసిన గుడ్డలతో రోడ్డు పక్కన తిరుగుతూ దయనీయమైన స్థితికి చేరుకుంది. గమనించిన జడ్చర్లలోని శ్రీసత్యేశ్వర సేవాశ్రమ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్ ఆశ్రమమానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పూర్తిగా కోలుకున్న హైమవతి తన కుటుంబ వివరాలను తెలపడంతో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి సహకారంతో బుధవారం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు. ఏడు సంవత్సరాల నుంచి ఆశ్రమం నడుపుతున్నామని ఇప్పటి వరకు 110 మందిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఈశ్వర్ తెలిపారు. వీరిలో మతిస్థిమితం లేనివారితోపాటు అనారోగ్యంతో బాధపడుతూ వీధుల్లో తిరుగుతున్న వారూ ఉన్నట్లు చెప్పారు. ఆశ్రమ నిర్వాహకులకు హైమావతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోండి: మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్, న్యూస్‌టుడే: వాగు స్థలంలో స్తంభాలు పాతి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతికుమారికి లేఖ రాశారు. ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ పరిధిలోని లావోని చెరువు నుంచి వర్షాకాలంలో నాలా ద్వారా వరద బొబ్బిలి చెరువుకు, అక్కడి నుంచి నందిగామ, అప్పారెడ్డిగుడ చెరువుల ద్వారా హిమాయత్‌సాగర్‌కు వెళుతుందని వివరించారు. ఈ ప్రాంతంలో గతంలో స్తంభాలు పాతేందుకు ప్రయత్నించగా రైతులతో వెళ్లి అడ్డుకోవడం జరిగిందని, వాటి ద్వారా గొలుసుకట్టు కాలువలకు ఇబ్బంది ఎదురవుతుందని పేర్కొన్నారు. అయినప్పటికీ రాత్రికి రాత్రి స్తంభాలు పాతారని అధికారులపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

ధర్నాకు వెళ్లేందుకు అనుమతించాలని వినతి

నార్సింగి: మున్సిపల్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న నగరంలోని సీడీఎంఏ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొనేందుకు అనుమతించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నార్సింగి మున్సిపల్ మేనేజర్ యోగేష్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనం, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, ఇతర సంక్షేమ పథకాలు అమలుకావడం లేదన్నారు. ఇంకా పలు సమస్యల పరిష్కారం కోసం ఈ ఆందోళన చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



నార్సింగి: అనుమానాస్పద స్థితిలో ఇల్లాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధి హైదర్షాకోట్ హిమగిరినగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా దువ్వూరు మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన **సూర్య లక్ష్మీసాయి**(26), వెంకటేష్‌ల వివాహం 2019లో జరిగింది. వీరికి ఒక బాబు(4) ఉన్నాడు. వెంకటేష్ ప్రైవేటు ఉద్యోగి. కొంత కాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. బుధవారం భర్త విధులకు వెళ్లిన తర్వాత లక్ష్మి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఇంటి ముందు వారి చిన్నారి ఏడుస్తూ కనిపించడంతో పక్కింటి వారు తలుపుతట్టగా, స్పందన లేకపోవడంతో కిటికీలోంచి చూశారు. లక్ష్మి ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. కడప నుంచి ఆమె పుట్టింటివారు వస్తున్నారని, వారితో మాట్లాడితే ఆత్మహత్యకు కారణాలు వెల్లడవుతాయని ఎస్ఐ తెలిపారు.

ఆలయాలపై దాడులు చేసేవారిని ఉరితీసే చట్టాలు రావాలి: రంగరాజన్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలు, విగ్రహాలపై దాడులకు పాల్పడే వారికి ఉరిశిక్ష విధించేలా చట్టాలను సవరించాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. సనాతన ధర్మానికి ఉండే శత్రువర్గాన్ని నాశనం చేయాలని ప్రార్థిస్తూ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... అమ్మవారిపై దుండగుడు చేసిన దాడి అమానుషమన్నారు.

ఎండిపోయింది.. తొలగిస్తే మేలు.



చేవెళ్ల కోర్టు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండు రోడ్ల మధ్య ఎండిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో పాదచారులు, వాహనదారులు నిరంతరం తిరుగుతూనే ఉంటారు. బలమైన గాలులు వీస్తే చెట్టు కూలిపోయేలా అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. ప్రమాదం జరగక ముందే తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చేవెళ్ల గ్రామీణం

ప్రయాణం.. అంచునే ప్రమాదం



కేశంపేట మండల కేంద్రం నుంచి అల్వాల వెళ్లే మార్గం ఇది. రహదారి అంచున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. ఇటీవలే ఎదురుగా వాహనం వస్తుండగా ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీకొనడంతో ఇరువురు గాయపడ్డారు. దిమ్మె ఎత్తు సైతం తక్కువగా ఉండటం, సమీపంలో నుంచే వాహనాలు రాకపోకలు సాగించాల్సి రావడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. –న్యూస్‌టుడే, కేశంపేట

పేద విద్యార్థికి రెడ్డి ఫౌండేషన్ చేయూత

మణికొండ, న్యూస్‌టుడే: మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు ఓ నిరుపేద విద్యార్థి చదువుకు చేయూత అందించారు. పంచవటి కాలనీలో నివసించే సంతోష్ స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. పేదరికం కారణంగా ఫీజు రూ. 25000 చెల్లించలేకపోవడంతో బుధవారం ఆ మొత్తాన్ని పాఠశాల నిర్వాహకులకు ఫౌండేషన్ సభ్యులు చెల్లించినట్లు ఉపాధ్యక్షులు రామసుబ్బారెడ్డి తెలిపారు.

మద్యం మత్తులో ప్రమాదం.. ఆటో డ్రైవరుకు పదేళ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఆటోను నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవరుకు న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.23,000 జరిమానా విధించింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘు కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన కావలి శ్రీను అలియాస్ శ్రీనివాస్ (32) సొంతూరు, షాద్‌నగర్ మధ్య ఆటో నడిపేవాడు. 2021 ఏప్రిల్ 10న మద్యం మత్తులో ప్రయాణికులను ఎక్కించుకొని షాద్‌నగర్ నుంచి నాగులపల్లికి వెళ్తుండగా, ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో నాగులపల్లికి చెందిన బి.గోవర్ధన్ మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. షాద్‌నగర్ పోలీసులు నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. కేసు విచారించిన జిల్లా 9వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీశ బుధవారం తీర్పునిచ్చారు.

శంషాబాద్‌లో బాలిక అదృశ్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: ఆర్జీఐఏ పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన దంపతులు దినసరి కూలీలు. ఈ నెల 20న పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చేసరికి కుమార్తె(14) కనిపించలేదు. గాలించినా ప్రయోజనం లేక బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీబీఐటీలో సోలార్ బటర్‌ఫ్లై ప్రదర్శన


తిలకిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నార్సింగి: సముద్రంలో సేకరించిన వాడిపారేసిన ప్లాస్టిక్ సీసాలను ఉపయోగించి తయారు చేసిన చక్రాలపై కదిలే ప్రత్యేక గృహాన్ని (సోలార్ బటర్‌ఫ్లై షో)బుధవారం గండిపేట సీబీఐటీ కళాశాలలో ప్రదర్శనగా ఉంచారు. రేడియేషన్, వేడికి తావులేకుండా తయారు చేసిన ఈ ఇంటిని జర్మనీలో రూపొందించారు. దీనిపై బటర్‌ఫ్లై రెక్కల మాదిరి ఏర్పాటు చేసి వాటిపై బిగించిన సోలార్ ప్యానెల్ బోర్డుల ద్వారా ఉత్పత్తయ్యే సౌరశక్తిని ఇంటి అవసరాలకు వాడుకోవచ్చు. మరోచోటికి తరలించేందుకు టెస్లా కారును ఉపయోగిస్తున్నారు. విద్యార్థులకు రీయూజబుల్ ఎనర్జీ, గ్లోబల్ వార్మింగ్ తదితర విషయాలపై అవగాహన కల్పించేందుకు ఈ వాహనం నాలుగు సంవత్సరాల ప్రపంచ పర్యటనలో భాగంగా సీబీఐటీ కళాశాలలో ప్రదర్శనకు ఉంచినట్లు కార్యక్రమ కోఆర్డినేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎన్.వసంతలక్ష్మి తెలిపారు.

వీసీని కలిసిన విద్యార్థి నేతలు

రాజేంద్రనగర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను బుధవారం విద్యార్థి నాయకులు ఆర్.శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే 200 సీట్ల పెంపకంతో పాటు, సెల్ఫ్ ఫైనాన్స్ కోటాలో రూ.10 లక్షలు ఉన్న సీటును రూ.5లక్షలు తగ్గించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

నో బ్రోకర్ టెక్నాలజీస్ సంస్థకు జరిమానా

ఈనాడు, హైదరాబాద్: వివాదాల్లో ఉన్న ఫ్లాట్‌ను విక్రయించేందుకు ప్రయత్నించిన 'నో బ్రోకర్ టెక్నాలజీస్ సొల్యూషన్స్ ప్రయివేటు లిమిటెడ్‌'కు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయలు వేసింది. టోకెన్ అడ్వాన్స్‌గా ఫిర్యాదీ చెల్లించిన రూ.1,00,000, 9 శాతం వడ్డీతో పాటు మానసిక పరిహారంగా రూ.10 వేలు, కేసు ఖర్చులు రూ.5 వేలు చెల్లించాలని ఆదేశించింది. 45 రోజుల్లో ఈ మొత్తం చెల్లించకపోతే 12 శాతం వడ్డీతో ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించింది. గండిపేటకు చెందిన ఖుష్బూకుమారి పుప్పాలగూడలో ఫ్లాట్ కొనుగోలు కోసం ప్రతివాద సంస్థను సంప్రదించారు. 2023 డిసెంబరులో రీసేల్ ఫ్లాట్ కోసం టోకెన్ అడ్వాన్స్‌గా రూ.1,00,000 చెల్లించారు. ఈ లోగా ఆ ఫ్లాట్ వివాదంలో ఉందని న్యాయస్థానం స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చిందని తెలిసి డబ్బు రీఫండ్ చేయాలని కోరారు. ప్రతివాద సంస్థ డబ్బు రీఫండ్ చేయకుండా సేవల్లో లోపం కలిగించడంతో పాటు అనైతిక వ్యాపారానికి పాల్పడిందంటూ కమిషన్‌ను ఆశ్రయించారు. విచారించిన కమిషన్ రూ.1,15,000 చెల్లించాలని ప్రతివాద సంస్థను ఆదేశించింది.

మైలార్‌దేవుపల్లిలో ఆస్తి పన్ను పునఃమదింపు

కాటేదాన్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లిలో బుధవారం ఆస్తి పన్ను పునఃమదింపు ప్రక్రియను పరిశీలించేందుకు ఉపకమిషనర్ రవికుమార్ వచ్చారు. స్థానికంగా మురుగునీటి వ్యవస్థ, ఇతర సమస్యలను ఆయనకు వివరించేందుకు ప్రయత్నించగా, వినలేదని, సమీపానికి కూడా వెళ్లకుండా సిబ్బంది అడ్డుకున్నారని స్థానికులు ఆరోపించారు. ఈ విషయంపై ఉపకమిషనర్‌ను వివరణ కోరగా.. ఆస్తి పన్ను మదింపులో భాగంగా వచ్చామని, సమస్యలపై తర్వాత మాట్లాడదామని చెప్పానన్నారు.

మహేశ్వరం

•మహేశ్వరం • ఇబ్రహీంపట్నం • కల్వకుర్తి

అష్టలక్ష్మి ఆలయంలో నేతల పూజలు



ఈటల రాజేందర్, నేతలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఆర్కేపురం, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరంలోని ఆర్కేపురం డివిజన్‌కి చెందిన అష్టలక్ష్మి ఆలయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.. బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతన కల్గి ఉండాలన్నారు. కారక్రమంలో కార్పొరేటర్లు రాధారెడ్డి, నర్సింహాగుప్తా, పవన్, ఆలయ ఫౌండర్ ఛైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ఛైర్మన్ సోమ సురేష్, కార్యదర్శి గంప జగన్, ఆలయ కోశాధికారి అయిత అంజయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



కేఎల్ఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మీర్‌పేట కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తదితరులు

మీర్‌పేట న్యూస్‌టుడే: మీర్‌పేట లెనిన్‌నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి.. మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌ను కోరారు. జలమండలి అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరిస్తానని కేఎల్ఆర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, స్వామి నాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మేడిగడ్డ పాఠశాలలో దస్త్రాల పరిశీలన

ఆమనగల్లు, న్యూస్‌టుడే: ఆమనగల్లు మండలం మేడిగడ్డ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీడీవో కుసుమమాధురి సందర్శించారు. దస్త్రాలను పరిశీలించారు. అనంతరం నర్సరీ, వాటర్ ట్యాంకు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో పాండు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలంలో భాజపా సభ్యత్వాలను అధిక సంఖ్యలో నమోదు చేయించాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచి బక్కి కుమార్ కోరారు. బుధవారం ఆయన చంద్రధన గ్రామంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని బీసీ సంక్షేమ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి తెలిపారు. చర్లపటేల్ గూడ వద్ద గురుకుల బాలికల పాఠశాలలకు చెందిన విద్యార్థులకు జిల్లా స్థాయి ఆటల పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలత, పీఈటీ లక్ష్మయ్య, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై అవగాహన సదస్సు



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిభట్ల, న్యూస్‌టుడే: వరి సేకరణ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. బుధవారం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు వరి సేకరణపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచాల, న్యూస్‌టుడే: వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణానికి ఆసక్తి గల ప్రజలు వెంటనే గ్రామ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని మంచాల ఎంపీడీఓ బాలశంకర్ కోరారు. ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పశువులకు టీకాల శిబిరం

నోముల(మంచాల): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మంచాల పశు వైద్యాధికారిణి వి.సుధారెడ్డి కోరారు. బుధవారం ఆమె నోములలో గాలికుంటు వ్యాధి టీకా శిబిరాన్ని ప్రారంభించారు.

సీఐ వెంకటేశ్వర్‌రావుకు సత్కారం

ఆర్కేపురం, న్యూస్‌టుడే: చైతన్యపురి సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావును ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత గట్ల రవీంద్ర, శివ, ఖిల్లా మైసమ్మ మాజీ ఛైర్మన్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు.. ప్రజలకు అవస్థలు

రూ.కోట్లు వెచ్చించినా నెరవేరని లక్ష్యం



బొంగుళూరు గేట్ వద్ద..

ఆదిభట్ల, న్యూస్‌టుడే: ఆదిభట్ల పురపాలిక పరిధిలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. నిధులు కేటాయించి పనులు ప్రారంభించినా.. ముందుకు సాగగ్లేదు. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బొంగుళూరు గేట్ నుంచి బొంగుళూరు గ్రామానికి వెళ్లేదారిలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని కొన్నేళ్లుగా స్థానికులు విన్నవించారు. దీంతో ఆరు నెలల క్రితం రూ.2.2 కోట్లు మంజూరయ్యాయి. రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. అయితే, పనులు అసంపూర్తిగా వదిలేశారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ◆ పురపాలిక పరిధిలోని మెట్రో సిటీలో రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు.◆ రాందాస్‌పల్లి వెళ్లేదారిలో తారు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో తాము రాకపోకలు సాగించలేమని స్కూల్ బస్సుల నిర్వాహకులు వెల్లడిస్తున్నారు. ◆ మంగళపల్లి నుంచి కొంగరకలాన్ వెళ్లేదారిలో కల్వర్టు వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే పలువురు ప్రమాదాలకు గురయ్యారు.

> **వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం**
>
> –బాలకృష్ణ, కమిషనర్, ఆదిభట్ల
>
> బొంగుళూరు వెళ్లేదారిలో రోడ్డు పనులు మధ్యలోనే గుత్తేదారుడు ఆపేశాడు. దీంతో అతనికి రెండుసార్లు నోటీసులు అందజేశాం. వారం రోజుల్లో పనులు ప్రారంభిచేలా చర్యలు తీసుకుంటాం. పురపాలిక పరిధిలోని అన్ని రోడ్డు సమస్యలు పరిష్కరిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

మీర్‌పేట ఆర్కేపురం, సరూర్‌నగర్, న్యూస్‌టుడే:

? మీర్‌పేటలో వీధి వ్యాపారులకు నిర్మించిన దుకాణాల సముదాయాన్ని లబ్ధిదారులకు ఎప్పుడు కేటాయిస్తారు.
– పి.నర్సింహ, వీధి వ్యాపారి, మీర్‌పేట

✓ దుకాణాల అంశంపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి నివేదిక కలెక్టర్‌కు పంపిస్తాం. – చంద్రశేఖర్, కమిషనర్, మీర్‌పేట

? ఆర్కేపురంలో దోమల బెడద ఎక్కువగా ఉంది.
– మోహన్, స్నేహపురి కాలనీ

✓ వెంటనే ఫాగింగ్ చేయిస్తాం. – సుజాత, సరూర్‌నగర్ డీసీ

? సరూర్‌నగర్ డివిజన్‌లోని హుడాసాయి నగర్ కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. –రమేష్, హుడాసాయి నగర్ కాలనీ

✓ మరమ్మతులు చేయిస్తాం.– సుజాత, ఉప కమిషనర్, సరూర్‌నగర్ సర్కిల్

ఆలయ కమిటీ నియామకం



పవన్‌కుమార్‌రెడ్డికి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపలి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గాన్ని బుధవారం నియమించారు. కమిటీ ఛైర్మన్‌గా జిల్లెల పవన్‌కుమార్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్‌గా కె.అమృత, డైరెక్టర్లుగా ఎం.స్వామిగౌడ్, డి.వెంకటయ్య, టి.యాదయ్య, డి.జంగయ్యను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పవన్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే కసిరెడ్డి నియామక పత్రం అందించారు. పవన్ పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ.నయీముద్దీన్, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణ, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, శివ సన్మానించారు.



తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారుగా మీర్‌పేటకు చెందిన కిషన్‌గుప్తాకు నియామకపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ –న్యూస్‌టుడే, మీర్‌పేట

పరిశుభ్రంపై ప్రచారం

కందుకూరు, మహేశ్వరం, న్యూస్‌టుడే: చెత్త రహిత ప్రదేశాలుగా తీర్చిదిద్దడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని ఎంపీడీఓ సరిత అన్నారు. బుధవారం జిల్లా క్రీడలు, యువజన విభాగం అధికారి ఐజయ్య ఆధ్వర్యంలో కందుకూరు ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ◆ ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలని జిల్లా యువజన అధికారి ఐజయ్య అన్నారు. బుధవారం మహేశ్వరం అక్కన్న, మాదన్న గడి కోట ప్రాంగణంలో స్వచ్ఛ భారత్‌పై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.



కందుకూరులో చెత్త సేకరిస్తున్న విద్యార్థులు



మహేశ్వరంలో విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేసిన ఐజయ్య

ఆధునిక పద్ధతుల్లో పత్తి సాగు

మంచాల, న్యూస్‌టుడే: రైతులు ఆధునిక పద్ధతుల్లో పత్తి సాగు చేసి అధిక లాభాలు పొందాలని కేంద్రీయ పత్తి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అమృత కోరారు. బుధవారం మంచాల రైతు వేదికలో పత్తి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పత్తి సాగును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు, ఏడీఏ సుజాత, ఏఓ మాధవీలత శాస్త్రవేత్తలు ఏఆర్‌రెడ్డి, మీరా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

తులం బంగారం హామీ ఏమైంది?

కందుకూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన తులం బంగారం హామీ ఏమైందని ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రశ్నించారు. బుధవారం కందుకూరులో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు గోపాల్, ఎంపీడీఓ సరిత, ప్యాక్స్ ఛైర్మన్ చంద్రశేఖర్, విజయేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జయేందర్, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మినర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ గోదాము త్వరలో ప్రారంభిస్తాం

యాచారం: యాచారంలో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న గోదామును త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర కేంద్ర సహకార బ్యాంకు వైస్‌ఛైర్మన్, రంగారెడ్డి డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. యాచారం పీఏసీఎస్‌ను బుధవారం ఆయన సందర్శించారు. గోదాములో ఎరువుల నిల్వలను పరిశీలించారు. పీఏసీఎస్ ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి, సీఈఓ నాగరాజు సంఘం వివరాలు సత్తయ్యకు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి లయన్స్ క్లబ్ తోడ్పాటు


తలకొండపల్లి, న్యూస్‌టుడే: చుక్కాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలను బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు పి.లక్ష్మారెడ్డి, క్లబ్ సభ్యుడు రామ్మోహన్ పరిశీలించారు. నీటి ట్యాంకును హెచ్ఎం పాండుకు అందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి లయన్స్ క్లబ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాండురంగారెడ్డి, రాంరెడ్డి, అంజయ్యగుప్తా, ఓంకారం, మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పెంటారెడ్డి, యాదయ్య, పాషా పాల్గొన్నారు.



ట్యాంకును ఉపాధ్యాయులకు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఘనంగా హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు

తలకొండపల్లి, న్యూస్‌టుడే: వెల్జాల్ గ్రామంలో హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలను బుధవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేకు కోసి స్థానికులకు అందజేశారు. కార్యక్రమంలో విష్ణు, వెంకటేశ్, జి.శేఖర్, అంజి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



వెల్జాల్ పాఠశాలలో సామగ్రి అందుకున్న విద్యార్థులతో ప్రభాస్ అభిమానులు

సీఎం ఇల్లు ముట్టడి 26న

మంచాల, న్యూస్‌టుడే: ఎన్నికల హామీ మేరకు ఆసరా పింఛన్ల మొత్తం రూ.4 వేలకు పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య కోరారు. బుధవారం మంచాలలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 26న సీఎం ఇల్లు ముట్టడికి అందరూ రావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, దానయ్య, సంజీవ, బాను, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి అప్పగింత

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మేడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి(14) ఇబ్రహీంపట్నం ప్రభుత్వ గురుకుల వసతి గృహంలో ఉంటూ.. 9వ తరగతి చదువుకుంటున్నాడు. ఈనెల 22న మంగళవారం వసతిగృహం నుంచి అదృశ్యమయ్యాడు. పోలీసులు బుధవారం అతనిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.

బాలికకు వేధింపులు.. యువకుడికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట బాలిక వెంటపడి మార్ఫింగ్ ఫొటోలతో వేధించి డబ్బులు వసూలు చేసిన యువకుడికి న్యాయస్థానం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించింది. ప్రత్యేక పీపీ సునీత కథనం ప్రకారం.. సైదాబాద్ చావుని ప్రాంతానికి చెందిన గడ్డం సాయి కుమార్ (24) ప్రైవేటు ఉద్యోగి. 2018లో మీర్‌పేట ఠాణా పరిధిలో పదో తరగతి చదివే బాలిక(14)తో పరిచయం ఏర్పడింది. ప్రేమించాలని కోరగా, ఆమె నిరాకరించడంతో వేధించడం ప్రారంభించాడు. సామాజిక మాధ్యమాల ద్వారా బాలిక ఫొటోలు సేకరించి మార్ఫింగ్ చేసి, బెదిరించాడు. బాలిక నుంచి రూ.10,000 వసూలు చేశాడు. వేధింపులు తీవ్రం కావడంతో బాలిక మీర్‌పేట ఠాణాలో ఫిర్యాదు చేసింది. జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి పద్మావతి బుధవారం తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.లక్ష పరిహారం మంజూరు చేశారు.

కొమ్మలు కొట్టేసి.. అక్కడే వదిలేసి

ఆర్కేపురం: వాసవీ కాలనీకి చెందిన అష్టలక్ష్మి ఆలయం యాగశాల సమీపంలో చెట్ల కొమ్మలు నరికేసి అక్కడే వదిలారు. నెల రోజులైనా వాటిని తరలించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆకట్టుకునేలా మరో చార్మినార్



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కోహెడ గ్రామానికి సమీపంలోని పొలంలో చార్మినార్ సెట్టింగ్ ఏర్పాటు చేశారు. రహదారిపై ప్రయాణించే వాహనదారులు దీనిని చూసి సెల్ఫీలు దిగుతున్నారు.
- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



అధికారులతో మేయర్ పారిజాత

బాలాపూర్, న్యూస్‌టుడే: కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత అన్నారు. కార్పొరేషన్ 18వ డివిజన్ సీపీఎన్ఆర్ టౌన్‌షిప్ కాలనీ -2 లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.మనోహర్, పి.సుదర్శన్‌రెడ్డి, ఏఈ వినీల్‌గౌడ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ◆ ఆర్‌సీఐ ఎక్స్ రోడ్డు నుంచి ఎయిర్ పోర్టుకు ఆరు లైన్ల రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభించాలని హెచ్ఆర్‌డీసీఎల్ అధికారులకు మేయర్ సూచించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో రోడ్డు విస్తరణ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఈఈ విజయ్‌కుమార్, డీఈ నర్సింహరాజు, కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, ఏఈ వినీల్‌గౌడ్, జి.ప్రభాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల్లో పురోగతి కరవు



పెద్దఅంబర్‌పేట్: పెద్దఅంబర్‌పేట-సంఘీరోడ్డులో పలు చోట్ల కల్వర్టు పనులు రూ.7.5 కోట్ల వ్యయంతో చేపట్టారు. పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం ప్రారంభించినా.. పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు.

వేల ఎకరాలకు ఆధారం.. అయినా అధ్వానం

• సహదేవి సముద్రం చెరువు దుస్థితి
• ఫీడర్ ఛానెల్ ఏర్పాటు చేయాలని అన్నదాతల ఆవేదన



వెల్జాల్ గ్రామం వద్ద తటాకం ఇలా..

తలకొండపల్లి, న్యూస్‌టుడే: సహదేవి సముద్రం చెరువు వంద ఎకరాల్లో విస్తరించి ఉంది. ఒక్కసారి నిండిందంటే 2 వేల ఎకరాలకు సాగునీరు, 32 గ్రామాల్లో భూగర్భ జలాలను పెంచుతుంది. తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ఉన్న ఈ తటాకం అభివృద్ధికి నోచుకోవట్లేదు. అధిక వర్షపాతం నమోదవుతున్నా.. 44 ఏళ్ల నుంచి మత్తడి పారని దుస్థితి నెలకొంది. కల్వకుర్తి నియోజకవర్గంలోనే పెద్ద చెరువుగా దీనికి పేరుంది. పైనుంచి వచ్చే నీరు బాగా తగ్గింది. వర్షకాలంలో ఒక్కసారి చెరువు నిండితే ఏడాది అంతా ఆయా గ్రామాలకు సాగు, తాగునీరు అందేది. ఇంతటి ఘనత ఉన్న ఈ చెరువు కొన్ని ఏళ్ల నుంచి నిరాదరణకు గురైంది.

2001లో చంద్రబాబు పరిశీలన..

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2001లో అప్పటి సీఎం చంద్రబాబు ఈ చెరువును పరిశీలించారు. కట్టను పునరుద్ధరించాలని, లింగంధన వాగు నుంచి ఫీడర్ ఛానెల్ ఏర్పాటు చేయాలని అప్పటి అధికారులను చంద్రబాబు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనులు జరగలేదు. ఆ తర్వాత నుంచి ప్రతి ఎన్నికల్లోనూ ఈ చెరువును అభివృద్ధి చేస్తామని అన్ని పార్టీల నేతలు హామీలు ఇస్తున్నారు. అందరి హామీలు నీటిమీద రాతలుగానే మిగిలాయని స్థానిక రైతులు వాపోతున్నారు. చెరువు నిండటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కలసికట్టుగా మత్తుపై సమరం

ఎన్‌సీహెచ్‌ఆర్‌డీలో టీజీన్యాబ్ వర్క్‌షాప్ ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మత్తుమూలాలను సమూలంగా పెకిలించేందుకు పోలీసు, ఇతర విభాగాలతో సమన్వయంతో చేస్తున్న సమరం సానుకూల ఫలితాలను ఇస్తుందని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. టీజీన్యాబ్ ఏర్పాటై ఏడాదైన సందర్భంగా జూబ్లీహిల్స్ మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎంసీహెచ్‌ఆర్‌డీ)లో నాలుగురోజుల వర్క్‌షాప్‌ను బుధవారం ప్రారంభించారు.


మాట్లాడుతున్న సందీప్ శాండిల్య

డ్రగ్ కట్టడిలో భాగంగా ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు, ఇంజినీరింగ్, వైద్య, సాంకేతిక, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీ(ఏడీసీ)లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో 16,477 విద్యాసంస్థల్లో 4511 ప్రహరీ/ఏడీసీలు ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాల రవాణా కేసుల్లో ఎన్‌డీపీఎస్ చట్టం ద్వారా నిందితులకు పడుతున్న శిక్షల తక్కువశాతం (అబ్కారీ 4 శాతం, పోలీసు 11 శాతం) గురించి చెప్పారు. రాష్ట్రంలోని దర్యాప్తు అధికారులు, పోలీసు, అబ్కారీ, కస్టమ్స్, డీఆర్ఐ, ఎన్‌సీబీ లకు 10 నెలల వ్యవధిలో 21,246 మందికి కొత్తచట్టాలు, ఎన్‌డీపీఎస్‌పై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఏడాది వ్యవధిలో విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 16,500 మంది ఎన్‌ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది తదితరులకు 2 లక్షల మందికి మత్తుపదార్థాల గుర్తింపు, కట్టడిపై శిక్షణ ఇచ్చినట్టు వివరించారు.

ఇరానీ చాయ్ తాగి జనంతో ముచ్చట్లు

నాంపల్లిలో కేటీఆర్ సందడి

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం నగరంలో సందడి చేశారు. మంత్రి కొండా సురేఖపై తాను వేసిన కేసు విషయమై బుధవారం నాంపల్లిలోని న్యాయస్థానంలో జరిగిన విచారణలో పాల్గొనేందుకు వచ్చిన కేటీఆర్.. అనంతరం భారాస నేతలతో కలిసి నాంపల్లిలోని ఏక్‌మినార్ మసీదు వద్దనున్న ఓ ఇరానీ కేఫ్‌లో చాయ్ తాగారు. కేఫ్‌కు వచ్చిన వారితో ముచ్చటించారు. వారితో స్వీయచిత్రాలు దిగారు. తర్వాత ఆ పక్కనే ఉన్న వస్త్ర దుకాణ యజమాని ఆహ్వానం మేరకు వెళ్లి అక్కడి వారితో ముచ్చటించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బాల్క సుమన్ తదితరులు ఉన్నారు.


నాంపల్లిలోని ఓ కేఫ్‌లో చాయ్ తాగుతున్న కేటీఆర్, బాల్క సుమన్, జగదీశ్‌రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి



వినాయక నవరాత్రులు, దసరా ఉత్సవాలు ముగిసినా గణేశ్, అమ్మవారి విగ్రహాల వ్యర్థాల తొలగింపు జరగలేదు. శామీర్‌పేట పెద్దచెరువులో వ్యర్థాలు ఇంకా కుప్పలుగా కనిపిస్తున్నాయి. దీంతో ఆహ్లాదం కరవైంది. ఆ పరిసరాలు కంపు కొడుతున్నాయి. అటువైపు వెళ్లాలంటేనే జనం ఇబ్బంది పడుతున్నారు. ఉదయపు నడకకు రాలేకపోతున్నామని, శుభ్రపరచాలని కోరుతున్నారు.

అలైడ్ హెల్త్ కేర్ సైన్సెస్ కోర్సుల పేరుతో మోసం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: హెల్త్ కేర్ సైన్సెస్ అనుబంధ కోర్సుల పేరుతో విద్యార్థులను మోసగిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అలైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సైన్స్‌లో లేని బి.వోక్ కోర్సు నైపుణ్య శిక్షణ అంటూ తప్పుదోవ పట్టిస్తున్నారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వంశీ ప్రసాద్ బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆందోళన వ్యక్తం చేశారు.

జలమండలిలో మేనేజర్లేరీ?

★ 330 మందికి ఉన్నది 186

★ క్షేత్రస్థాయిలో పనులపై ప్రభావం

జలమండలిలో క్షేత్రస్థాయిలో కీలకమైన మేనేజర్ల పోస్టులు భారీగా ఖాళీగా ఉండటంతో ఆ ప్రభావం తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపై పడుతోంది. ప్రస్తుతం జలమండలి సేవలు అవుటర్ రింగ్ రోడ్డు వరకు దాదాపు 1,450 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించాయి. 80 లక్షల జనాభా దాటిన మహానగరంలో నిత్యం తాగునీటి సరఫరా, మురుగు నీటి పారుదల పెద్ద సవాలే. స్థానిక సమస్యల పరిష్కారంలో, కొత్త నల్లాల మంజూరులో మేనేజర్ల పాత్ర కీలకం. - ఈనాడు, హైదరాబాద్



అయితే.. జలమండలి పరిధి పెరుగుతున్నా సరిపడా మేనేజర్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం 320 పోస్టులకు గాను...186 మంది మాత్రమే ఉన్నారు. దీంతో రెండు, మూడు సెక్షన్లకు ఒక్కరే ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. మరికొందరి సిబ్బందిని సీనియారిటీ ప్రాతిపదికన ఎఫ్ఏసీగా బాధ్యతలు అప్పగించి నడిపిస్తున్నారు. తగినంతమంది లేక క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపిస్తోంది. అక్రమ మురుగు, నల్లా కనెక్షన్లు పెరిగిపోతున్నాయి. కిందిస్థాయిలోని పలువురు లైన్‌మేన్‌లతో ప్రైవేటు ప్లంబర్లు కుమ్మక్కై రాత్రికి రాత్రి అక్రమ నల్లాలు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటిని ప్రధాన పైపులైన్లకు అనుసంధానించడంతో కొన్ని రోజులకు అక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయి. లీకేజీల ద్వారా మురుగు నీరు తాగునీటిలో కలిసి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. అక్రమ నల్లాలతో బోర్డు ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 2-3 లక్షల అక్రమ నల్లాలు ఉన్నట్లు అంచనా.

కీలక ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టు సైతం..

జలమండలిలో కీలక ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టు సైతం నెలన్నరగా ఖాళీగా ఉంది. ఇటీవలే ఆ పోస్టులో ఉన్న వాసుదేవనాయుడు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఎండీ ఆ బాధ్యతలు చూస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 5 డైరెక్టర్ పోస్టులు, డైరెక్టర్ పర్సనల్ ఖాళీగా ఉన్నాయి. త్వరలో కొత్తగా 31 మురుగు శుద్ధి కేంద్రాలతోపాటు గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి. ప్రాజెక్టు విభాగంలో ఒకే డైరెక్టర్ ఉండటంతో ఇబ్బందులున్నాయి.

దేవాదాయ శాఖలో ఈవోల పదోన్నతుల అంశం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా అర్హత లేనివారికి పదోన్నతులు కల్పించారని, ఇందులో ఓ ఉన్నతాధికారి, సహాయాధికారి చేతివాటాన్ని ప్రదర్శించారన్న ఆరోపణలున్నాయి. అందుకు రూ.2.5 లక్షల-రూ.5 లక్షలు వసూలు చేశారని సమాచారం. పదోన్నతి పద్ధతిలో కాకుండా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ సర్వీస్ కింద పదోన్నతులు కల్పించారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. పదోన్నతుల అంశంలో అర్హులకు న్యాయం జరగాలంటే విచారణకు ఆదేశించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

పదోన్నతికీ ఓ లెక్కుంది

దేవాదాయశాఖలో ఉన్నతాధికారుల చేతివాటం



గ్రేటర్‌లో దేవాదాయశాఖలో 650 మంది ఉద్యోగులు ఉండగా 150 మంది ప్రభుత్వ ఉద్యోగులు, మిగిలిన 500 మంది ప్రయివేటు ఉద్యోగులున్నారు. ఫౌండర్ ట్రస్టీలు, ఛైర్మన్లు దేవాలయ ఉద్యోగులను (జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్) నియమిస్తున్నారు. ప్రయివేటు ఉద్యోగుల్లో ఎక్కువ కాలం పనిచేసిన వారిని సీనియార్టీ ప్రకారం ఈఓగా (ప్రభుత్వ ఉద్యోగంలోకి) తీసుకోవచ్చనే నిబంధనలున్నాయి. దీని ఆధారంగా కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దేవాలయ ఉద్యోగుల్లో 33 మందికి ఈవోలుగా పదోన్నతులు కల్పించగా అందులో 15 మంది రాజధానిలో పనిచేసే వారే. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అర్హులను గుర్తించకుండా అనుయాయులకు పదోన్నతలు కల్పించారన్నది ప్రధాన ఆరోపణ. 2002లో వెలువడిన 261 జీవో ప్రకారం ఈఓలను నియమించాలి. దేవాలయాల్లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లను గ్రేడ్-3 ఈఓలుగా, సీనియర్ అసిస్టెంట్లను గ్రేడ్-2 ఈఓలుగా, సూపరింటెండెంట్లను గ్రేడ్-1 ఈఓలుగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ సర్వీస్ కింద నియమాకాలు చేపట్టాలి. కానీ తాజాగా ఇచ్చిన పదోన్నతులను ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఆర్డర్స్‌గా కాకుండా ప్రమోషన్ ఇస్తూ పదోన్నతి కల్పించారన్నది ఆరోపణ.

కాలుష్య పరిశ్రమలపై పీసీబీ కొరడా



ఈనాడు, హైదరాబాద్: రాజధానిలో కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలని పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) ఆదేశించింది. అనుమతులు లేకుండా నిర్వహిస్తూ, విపరీతమైన వాయు, శబ్దకాలుష్యానికి కారణమవుతున్న భాస్కర్ పాలిమర్స్, ఎస్ఎస్ఎం రాజ్ పాలిమర్స్ సంస్థలపై చర్యలు చేపట్టింది. స్థానికులు, స్వచ్ఛంద సంస్థల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆయా పరిశ్రమల్లో పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించి నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా పీసీబీ చర్యలకు ఉపక్రమించింది.

అనుమతుల్లేకుండా గుట్టుగా నిర్వహణ..

అనుమతులు లేకుండా కార్వాన్‌లో నడుపుతున్న భాస్కర్ పాలిమర్స్‌కు 2019 మే నెలలోనే కాలుష్య నియంత్రణ మండలి మూసివేత ఆదేశాలిచ్చింది. అనంతరం ఆ పరిశ్రమ నిర్వాహకులు జులైలో అనుమతులు తీసుకున్నారు. ఆ అనుమతులకు 2022 డిసెంబరు వరకే గడువు ఉండగా అనంతరం కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌వో) అనుమతులు తీసుకోలేదు. గుట్టుగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రతిరోజూ 495 కేజీల ఎల్‌డీపీఈ బ్యాగ్‌లను (ప్లాస్టిక్ కవర్ బ్యాగ్‌లు) ఉత్పత్తి చేస్తోంది. విపరీతమైన శబ్ద, వాయు కాలుష్యం నమోదవుతోందంటూ స్థానికుల నుంచి పీసీబీకి ఫిర్యాదులు అందడంతో పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు కార్వాన్‌లోని పరిశ్రమలో తనిఖీలు నిర్వహించారు. ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్ ఎక్విప్‌మెంట్ (ఏపీసీఈ) ఎక్కడా ఏర్పాటు చేయలేదని తనిఖీల్లో అధికారులు గుర్తించారు. పైగా ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని నివేదికలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమకు తక్షణమే విద్యుత్తు సరఫరాను నిలిపివేయాలని టీఎస్ఎస్పీడీసీఎల్‌కు పీసీబీ లేఖ రాసింది. ఆదేశాలకు విరుద్ధంగా పరిశ్రమను నడిపితే చట్ట ప్రకారం చర్య ఉంటాయని హెచ్చరించింది.

ఎస్ఎస్ఎం రాజ్ పాలిమర్స్ మూసివేత

ఎస్ఎస్ఎం రాజ్‌పాలిమర్స్ మూసివేతకు పీసీబీ ఆదేశాలిచ్చింది. అనుమతులు లేనిచోట కాలుష్యమయం చేశారంటూ పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందం నివేదిక ఇచ్చింది. హానికర వ్యర్థాలు, దహనం కాని కార్బన్ నిత్యం 50 కేజీల మేర ఉత్పత్తి అవుతోందని, వాయు కాలుష్య నియంత్రణ పరికరాల ఏర్పాటు చేయలేదని పేర్కొంది. పరిశ్రమల్లో యంత్రాలు పాడైపోవడంతో కాలుష్యం పెరగడంతో మూసివేయాలంది.

రూ.30లక్షలతో ఆలయ పునరుద్ధరణ: శైలజ రామయ్యర్



రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రూ.30లక్షలతో కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టామని దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ అన్నారు. ఆమె బుధవారం ఆలయాన్ని సందర్శించి డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పునరుద్ధరణ పనుల గురించి పలు సూచనలు చేశారు. అవసరమైన మరమ్మతులతో పాటు పంచలోహాలతో అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయిస్తున్నామన్నారు. ఉత్తరాయణానికి ముందే విగ్రహ స్థాపన కార్యక్రమాన్ని జరుపుతామని, అవసరమైతే చండీయాగం చేస్తామన్నారు. ప్రజలు శాంతియుతంగా ఉండి సహకరించాలని కోరారు. అదనపు కమిషనర్ జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, పలు ఆలయాలకు చెందిన పలువురు ఈవోలు హాజరయ్యారు.

అనుమతులు లేకుండా కట్టిన ఐదు ఇళ్ల సీజ్



ఎల్బీనగర్, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ విజయశ్రీ అన్నారు. బీఎన్ రెడ్డి నగర్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించిన ఐదు ఇళ్లను బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. సాగర్ కాంప్లెక్స్‌లో మూడు, శ్రీపురం కాలనీ, బీఎన్‌రెడ్డి నగర్ ఫేజ్-1లో అనుమతులు లేకుండా చేపట్టిన ఒక్కో ఇంటికి ఇదివరకే గుర్తించి నోటీసులు జారీ చేశారు. తాజాగా వాటిని సీజ్ చేశారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి అక్బర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల చలో దిల్లీ 26న: ఆర్.కృష్ణయ్య


గోడపత్రికలను విడుదల చేస్తున్న జోషి రాఘవ, రఘుపతి, ఉదయ్, గుజ్జ కృష్ణ, ఆర్.కృష్ణయ్య, నందగోపాల్, వెంకటేష్, రాందేవ్, రవి, నిఖిల్

కాచిగూడ: దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టడంతోపాటు పార్లమెంటులో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల అభ్యున్నతికి రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని కోరుతూ ఈ నెల 26న 'చలో దిల్లీ' చేపట్టినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో.. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేతలు నీలం వెంకటేష్, జోషి రాఘవ, రఘుపతి, మోదీరాందేవ్ పాల్గొన్నారు.

కుల గణనకు కట్టుబడిన రాష్ట్ర ప్రభుత్వం: పీసీసీ


మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కృష్ణాగౌడ్, నాగభూషణం, శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కుల గణనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బీసీ కులాల సంక్షేమంతోపాటు అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే చర్యలు చేపట్టారన్నారు. కుల గణన ప్రక్రియకు జీవో జారీ చేసినందుకు బుధవారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్, నేతలు నాగభూషణం, శ్రీనివాస్‌గౌడ్, చందు పటేల్, నరేష్ గౌడ్ ఆయన్ను సన్మానించి ధన్యవాదాలు తెలిపిన సందర్భంగా మాట్లాడారు.

రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో.. నేడు నామినేషన్

కాచిగూడ, న్యూస్‌టుడే: రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో నామినేషన్‌ను ఈ నెల 24న వేస్తున్నట్లు రైల్వే మజ్దూర్ యూనియన్ (ఆర్ఎంయూ) నేతలు తెలిపారు. రైల్వే ఉద్యోగులు, కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం కాచిగూడలో ఆర్ఎంయూ దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కార్యదర్శి ప్రభుచరణ్, అధ్యక్షుడు రాంప్రభు, కోశాధికారి రామారావు, ఏజీఎస్ ఎస్కే హజారియా, కార్యనిర్వాహక కార్యదర్శి మోహన్ మాట్లాడారు. నూతన విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్‌ను పునరుద్ధరింపజేయడంలో ప్రస్తుతం ఉన్న కార్మిక సంఘాలు విఫలమయ్యాయన్నారు.


చికెన్ ధరలు			
ఫాంరేటు	120-00	డ్రెస్డ్	206-00
రిటైల్	142-00	స్కిన్‌లెస్	234-00

జల్‌పల్లిలో నాలుగు డెంగీ కేసులు

జల్‌పల్లి: జల్‌పల్లి పురపాలిక వాదిహుదాకు చెందిన షేక్ నజీర్ అహ్మద్(18), షాహిన్‌నగర్‌లో ఉండే అస్ఫియా(16), సదఫ్(20), సరూర్‌నగర్‌కు చెందిన మానసకు డెంగీ వచ్చినట్లు బాలాపూర్ ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం వెల్లడించారు. జల్‌పల్లి పురపాలిక సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో సిబ్బంది బస్తీల్లో బుధవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. దాదాపు 60మందికిపైగా డెంగీ బారినపడి పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నట్లు మాజీ ఎంపీటీసీ అఫ్జల్ తెలిపారు. జనం ఫిర్యాదులు చేస్తున్నా సిబ్బంది పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించామని జల్‌పల్లి కమిషనర్ వాణిరెడ్డి పేర్కొన్నారు.

హోటల్లోకి వచ్చింది వీధి కుక్కే

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: కుక్కను బెదిరించి వీవీ ప్రైడ్ హోటల్ మూడో అంతస్తు నుంచి పడి మృతిచెందిన ఉదయ్ కిరణ్(22) విషయంలో చందానగర్ పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. అతని మృతికి ప్రధాన కారణం కుక్క అని జీహెచ్ఎంసీ తేల్చింది. హోటల్ కారిడార్‌లోకి కుక్క ఎలా వచ్చిందో తెలియలేదు. శేరిలింగంపల్లి జోన్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ విల్సన్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. యువకుడు కుక్క వెంట పడడం వలన ఘటన జరిగిందా? లేదంటే కుక్కే యువకుడి వెంట పడడం వల్ల దుర్ఘటన జరిగిందా? అన్న అంశంపై ఆరా తీశారు. వీధి కుక్క హోటల్ మూడో అంతస్తుకి వెళ్లడానికి హోటల్ నిర్వాహకుల నిర్లక్ష్యమేనని అధికారులు నిర్ధారించారు.



జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 45లో రహదారి పక్కన ఉన్న సహజ సిద్ధమైన కొండ రాళ్లకు బల్దియా అధికారులు మరింత నగిషీలు అద్దుతున్నారు. ఆకర్షణీయంగా కనిపించేలా విద్యుత్తు దీపాలను అమర్చడంతోపాటు ఫౌంటెయిన్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.



ద్విచక్ర వాహనంపై ఒక్కరు ప్రయాణించినా హెల్మెట్ ధరించాలి. ఇద్దరు వెళ్లాల్సి వస్తే ఇద్దరూ ధరించాల్సిందే. కానీ కొందరు నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరికి మించి ప్రయాణిస్తూ హెల్మెట్ లేకుండా వెళ్తూ నాంపల్లి రోడ్డులో కనిపించారు.


సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ పోలీసులు, వివిధ జోన్లు, ఐటీ విభాగం పోలీసులు రూ.2.4 కోట్ల విలువైన 800 చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. కమిషనరేట్ సమావేశ మందిరంలో బుధవారం వాటిని సొంతదారులకు అప్పగించారు. సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనా, పోగొట్టుకున్నా బాధితులు వెంటనే స్థానిక పోలీసులు, సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై హెల్ప్‌లైన్ నం.1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సైబరాబాద్ డీసీపీ (క్రైమ్స్) కె.నరసింహ సూచించారు. - రాయదుర్గం, న్యూస్‌టుడే

ఐదో అంతస్తు నుంచి పడి విద్యార్థి మృతి


శివకుమార్‌రెడ్డి

మాదాపూర్: మాదాపూర్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యార్థి ఐదో అంతస్తు నుంచి కిందపడి దుర్మరణం చెందాడు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు వెంకటరెడ్డిపల్లెకి చెందిన కొలవల మహేశ్వర్‌రెడ్డి దంపతులు కువైట్ వెళ్లారు. వీరి కుమారుడు కె.శివకుమార్‌రెడ్డి(18) మాదాపూర్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి శివకుమార్‌రెడ్డి ముగ్గురు స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాలనుకున్నాడు. ఐదో అంతస్తులో వారి గది కిటికీకి గ్రిల్స్ లేకపోవడంతో దానినుంచి పక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలోకి దిగి బయటకు వెళ్లాలనుకున్నాడు. ఈ క్రమంలో శివకుమార్‌రెడ్డి కిందపడ్డాడు. ఇద్దరు స్నేహితులు అదే కిటికీ నుంచి కిందికి వెళ్లి చూడగా శివకుమార్‌రెడ్డి రక్తపుమడుగులో పడి ఉన్నాడు. హాస్టల్ సిబ్బందికి తెలపడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కళాశాలలో భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి.

బిర్యానీ తినాలని: హాస్టల్‌లో సిబ్బంది రాత్రి 11కు నిద్రపోయిన తర్వాత శివకుమార్‌రెడ్డి, అతని స్నేహితులు బయటకు వెళ్లి బిర్యానీ తినాలని ప్లాన్ చేసుకున్నారు. బయటకు వెళ్లే క్రమంలో అతను ప్రమాదానికి గురయ్యాడు.

- ఉపేందర్‌రెడ్డి, ఏజీఎం నారాయణ కళాశాల

కొత్త రూపంలో లోన్‌యాప్‌లు



ఈనాడు, హైదరాబాద్: లోన్‌యాప్‌ల మోసాలు మళ్లీ పెరుగుతున్నాయి. రిజర్వ్‌బ్యాంకు, పోలీసుల చర్యలతో కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న మోసగాళ్లు ఇప్పుడు కొత్తరూపంలో యాప్‌లను తీసుకొస్తున్నారు. గతంలో గూగుల్ ప్లేస్టోర్, ఐస్టోర్‌లలో యాప్‌లు ఉండేవి. తాజాగా సామాజిక మాధ్యమాల్లో రీల్స్, ప్రకటనలు, ఏపీకే ఫైళ్ల ద్వారా యాప్‌లను అందుబాటులోకి తెస్తున్నారు. కుటుంబ అవసరాల కోసం ఈ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటున్న చిరుద్యోగులు, కూలీలు వడ్డీలపై వడ్డీలు కట్టలేక ప్రాణాలు బలితీసుకుంటున్నారు. తాజాగా శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ యువకుడు(23) వేధింపులకు భయపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడకు చెందిన డ్రైవర్ అదృశ్యమయ్యారు.

ఇదీ పరిస్థితి..

సాధారణంగా యాప్‌లు ప్లేస్టోర్, ఐస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. లోన్‌యాప్‌ల ఆగడాలు పెరగడంతో రిజర్వ్‌బ్యాంకు గతంలో దాదాపు 2,700, నగర పోలీసులు 500 వరకూ యాప్‌లు తొలగించారు. దీంతో నేరగాళ్లు ఈ స్టోర్లతో సంబంధం లేకుండా యాప్‌లను ఏపీకే ఫైళ్ల రూపంలో వాట్సాప్‌కు పంపిస్తున్నారు. లోన్‌యాప్‌లో రుణాలు తీసుకునే వారిలో 20- 35 ఏళ్ల వారే ఎక్కువగా ఉండడం గమనార్హం.

ఫెడెక్స్ మోసాల్లోనూ..

సైబర్ నేరగాళ్లు డ్రగ్ పార్శిల్, ఫెడెక్స్, ఈడీ కేసులతో పేరుతో భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్న ఉదంతాల్లోనే లోన్‌యాప్‌ల ప్రమేయం బయటపడుతోంది. సైబర్ నేరగాళ్లు బాధితులకు ఫోన్ చేసి బెదిరించినప్పుడు కొందరు ఖాతాలో ఉన్నది బదిలీ చేశామని, తమ దగ్గర డబ్బులేదని ప్రాధేయపడుతుంటారు. ఇలాంటి సమయాల్లో సైబర్ నేరగాళ్లు లోన్‌యాప్‌లో రుణం తీసుకుని డబ్బు పంపాలంటూ కొన్ని లింకులు పంపిస్తున్నారు. ఇటు సైబర్ నేరగాళ్ల బెదిరింపులు, అటు లోన్‌యాప్‌ల వేధింపులు తట్టుకోలేక నరకం చూస్తున్నారు.

ఇటీవలి ఉదంతాలివీ..

◆ జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి దమ్మాయిగూడకు చెందిన వ్యాపారి(42) గత ఏప్రిల్ 29న లోన్‌యాప్ నుంచి రూ.3 వేలు రుణం తీసుకుని వారంరోజుల్లో వడ్డీతో చెల్లించారు. లోన్‌యాప్ నిర్వాహకులు ఇంకా బకాయి ఉన్నావంటూ ఫోన్లు చేసి బెదిరించారు. అడిగినంత ఇవ్వకపోతే ఫొటోలు నగ్నంగా మార్చి సామాజిక మాధ్యమాల్లో పెడతామన్నారు. భయపడ్డ వ్యాపారి రూ.25.60 లక్షలు పంపించారు.


◆ రంగారెడ్డి జిల్లా నందిగామకు చెందిన వినోద్‌కుమార్(34) లోన్‌యాప్‌లో రూ.2,514 రుణం తీసుకున్నారు. చెల్లించడం ఆలస్యమవడంతో అతని బావమరిది రుణం చెల్లించారు. నేరగాళ్లు మాత్రం ఇంకా డబ్బు కట్టాలంటూ ఫోన్‌లో ఫొటోలను మార్ఫింగ్ చేసి అందరికీ పంపడంతో మనస్తాపానికి గురై తన పెళ్లి రోజున ఉరేసుకునాడు.

ఏపీకే ఫైల్స్ ఎందుకంటే..

సాధారణ యాప్‌లు పరిమితి ఉన్నంత వరకే ఫోన్‌లో డేటా సేకరిస్తాయి. నేరగాళ్లు పంపించే ఈ ఏపీకే ఫైళ్లు మాత్రం ఫోన్‌లోని ఫొటోలు, వీడియోలు, ఫోన్ నంబరు సహా అన్నీ సేకరిస్తాయి. వివిధ అవసరాల కోసం పలువురు రుణాలు తీసుకుంటారు. వేధింపులు ఉంటాయని తెలిసినా తర్వాత చూసుకుందామని ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసి మరీ రుణం తీసుకుంటున్నారు. వీరి డేటా మొత్తం గుప్పిట్లోకి తీసుకుంటున్న నేరగాళ్లు రుణం ఇచ్చి దానికి రెట్టింపు వడ్డీ వసూలు చేస్తున్నారు. కొన్నిసార్లు డబ్బు అడగకున్నా పంపి కట్టలేదంటూ వసూలు చేస్తున్నారు. బాధితుల గ్యాలరీలోని ఫొటోలను నగ్నంగా మార్చి బెదిరించడం, కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి వేధిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో రీల్స్ రూపంలో ప్రకటనలు ఇస్తున్నారు. ఈ ప్రకటనల మీద వచ్చే లింకులు క్లిక్ చేసినా లోన్‌యాప్‌లో డౌన్‌లోడ్ అవుతాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడి.. మృత్యువుతో పోరాటం

చికిత్సకు ప్రభుత్వ సాయం కావాలంటున్న కుటుంబం


సాయికుమార్

అల్వాల్: భార్య, ఇద్దరు చిన్నారులు, వృద్ధురాలైన తల్లి పోషణకు ఆధారమైన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి మృత్యువుతో పోరాడుతుంటే.. ఆసుపత్రి బిల్లు చెల్లించలేని పరిస్థితుల్లో ఆ కుటుంబ తల్లడిల్లుతోంది. ఓల్డ్‌అల్వాల్‌లో నివసించే సాయికుమార్(30) ఇళ్లకు ఫ్లష్‌విండోస్, డోర్లు బిగించే పనిచేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. అతడికి భార్య దీపిక, మూడేళ్ల కుమారుడు, 13నెలల కుమార్తె, 60 ఏళ్ల తల్లి ఉన్నారు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆదివారం రాత్రి ఫాదర్‌బాలయ్యనగర్ వద్ద కారు ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయం కావడంతో సుచిత్రలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. తలలో రక్తం గడ్డకట్టడంతో అపస్మారక స్థితికి చేరాడు. ఇప్పటికే బంధువులు, స్నేహితుల సాయంతో రూ.5లక్షల వరకు ఖర్చుచేశారు. కోలుకునే వరకు ఖరీదైన చికిత్స అందించాలని వైద్యులు చెబుతుండటంతో బాధిత కుటుంబం ఆవేదన చెందుతోంది. ప్రమాదానికి కారణమైన కారు యజమాని సాయం చేస్తానని చెప్పి స్పందించడం లేదని వాపోయారు. బాధితుడి ఆర్థిక స్థితి.. సాయికుమార్ దయనీయ పరిస్థితిపై చలించిన స్నేహితులు వాట్సాప్ గ్రూపుల ద్వారా సాయం అర్జిస్తున్నారు. ఇది వైరల్ కావడంతో పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కారులో ఉన్న వారిని విచారిస్తున్నారు. ప్రభుత్వం వైద్యానికి సాయం చేయాలని ఆ కుటుంబం వేడుకుంటోంది.

జియాగూడ మండీ.. అధ్వానమండి

- రోజూ వేలాది మేకలు, గొర్రెల అశాస్త్రీయ వధ
- ఆధునికీకరణ ప్రక్రియను అటకెక్కించిన జీహెచ్ఎంసీ


అపరిశుభ్రంగా కబేళా ప్రాంతం

ప్రపంచమంతా కాలానికి తగ్గట్టుగా పరిశుభ్రత, నాణ్యత వైపు నడుస్తోంది. జియాగూడ కబేళా మాత్రం అపరిశుభ్రత వైపు పరుగు తీస్తోంది. ఏటికేడు కబేళాలోని పరిస్థితులు దారుణంగా దిగజారుతున్నాయి. ఒకప్పుడు పొడి వాతావరణంలో నేలపై మేకలు, గొర్రెలు, పొట్టేళ్లను వధించేవారు. వెదురు తడికెలపై మాంసాన్ని ముక్కలు చేసి సంచుల్లోకి ఎత్తేవారు. ఇప్పుడు రక్తపు మడుగులో, బురద పరుపుపై తతంగాన్ని నడిపిస్తున్నారు. చెప్పడానికి కూడా వీల్లేని వాతావరణంలో కళేబరాలను మాంసపు ముక్కలుగా మార్చుతున్నారు. చెంగిచెర్లలో ఆధునిక కబేళా నిర్మాణమైనప్పటికీ.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడి పరిస్థితి కూడా దిగజారింది. దాంతో నగరంలో మాంసం ఉత్పత్తి ప్రమాణాలు పడిపోయినట్లనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- జియాగూడ కబేళాను ఆధునికీకరించేందుకు జీహెచ్ఎంసీ కొన్నేళ్లుగా ప్రయత్నం చేస్తోంది. పీపీపీ పద్ధతిలో చేపట్టే ప్రాజెక్టుకు స్థానికులు అంగీకరించ లేదు. దాంతో సొంతంగా జీహెచ్ఎంసీ నిధులతో ఆధునిక జంతు వధశాలను నిర్మించాలని సర్కారుకు ప్రతిపాదన పంపించాం. ప్రభుత్వం అనుమతి ఇస్తే పనులు చేపడతాం" అని బల్దియా ఇంజినీరింగ్ విభాగం తెలిపింది. అశాస్త్రీయ వధతో ప్రజారోగ్యం దెబ్బతినదా? అనే ప్రశ్నకు పశువైద్య విభాగం జవాబు ఇవ్వలేదు. నెల మామూళ్లు తీసుకుంటూ, అటువైపు కన్నెత్తి కూడా చూడట్లేదని విమర్శలొస్తున్నాయి.

పలు చోట్ల నుంచి..

జియాగూడ కబేళాకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, హరియాణా, గుజరాత్, తమిళనాడు, కశ్మీర్ రాష్ట్రాలతో పాటు పాకిస్థాన్ నుంచి కూడా మేకలు, గొర్రెలు వేలాదిగా వస్తుంటాయి.

మండి విస్తీర్ణం: 11 ఎకరాలు
రోజూ జరిగే వధ: 5-6 వేలు (మేకలు, గొర్రెలు)
నగరానికి సరఫరా అవుతోన్న మాంసం వాటా: 70 శాతం

కాలుష్య కోరల్లో మూసీ..

ప్రతినెలా జియాగూడ, చెంగిచెర్ల, తదితర కబేళాల్లో టన్నుల కొద్దీ జంతు వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి. వాటిని శాస్త్రీయ పద్ధతిలో భస్మం చేయాలి. లేదా వేర్వేరు విధానాల్లో కోళ్లు, చేపల ఆహారంగా మార్చవచ్చు. జియాగూడ జంతు వ్యర్థాలు రీసైక్లింగ్ కేంద్రాలకు వెళ్లట్లేదు. కార్మికులు వాటిని ఊడ్చి పక్కనున్న మూసీ నదిలో పడేస్తున్నారు.

ఈనాడు, హైదరాబాద్

మూసీ బాధితులకు మజ్లిస్ అండ


అసద్‌బాబానగర్‌లో బాధితులతో మాట్లాడుతున్న అక్బరుద్దీన్ ఒవైసీ

చార్మినార్, న్యూస్‌టుడే: పాత బస్తీలోని మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలకు మజ్లిస్ అండగా ఉంటుందని పార్టీ శాసనసభ పక్ష నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం బహదూర్‌పురలోని కిషన్‌బాగ్ మహమూద్‌నగర్, అసద్‌బాబానగర్‌లోని మూసీ పరివాహక ప్రాంతాలను సందర్శించారు. అసద్‌బాబానగర్‌లో ఆయన మాట్లాడుతూ.. పేదల నివాసాలను కూల్చివేయకుండా పార్టీ అడ్డుకుంటుందన్నారు. బాధితుల ఇళ్లకు సంబంధించి రూపాయి నష్టం జరిగినా పరిహారం ప్రభుత్వంతో ఇప్పిస్తామన్నారు. ఎమ్మెల్యే మహ్మద్ మొబీన్, కార్పొరేటర్లు ఉన్నారు.

30మంది అంతర్రాష్ట్ర సైబర్ మాయగాళ్ల అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: సామాన్యుల ఆశను అవకాశంగా చేసుకొని బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న 30 మంది అంతర్రాష్ట్ర సైబర్ మాయగాళ్లను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పెట్టుబడులు, ఫెడెక్స్ పార్శిల్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరిట మోసపోయిన బాధితులు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులు రాజస్థాన్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు అక్కడకు వెళ్లారు. ఒకేసారి 30 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పీటీ వారెంట్‌పై నగరానికి తీసుకొస్తున్నారు.

సదర్ సమ్మేళనానికి ఏర్పాట్లు


దున్నరాజుతో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఈ నెల 27న ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న 'సదర్ సమ్మేళనానికి' ఏర్పాట్లు చేస్తున్నట్లు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో దున్నరాజులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యాదవుల అతి పెద్ద పండగ సదర్ సమ్మేళనమన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ హాజరు కావాలని కోరారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రూ. 3 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్

గోల్నాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన రూ. 3 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నింబోలిఅడ్డాలో నేతలు పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, డా.ప్రశాంత్ నిమ్కర్, భూషణ్ భాస్కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, నల్లెల్ల కిషోర్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. సుమారు రూ. 4500 కోట్ల బకాయిల్లో రూ.1500 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. మిగిలింది. ఇవ్వకపోవడంతో.. కళాశాలల యాజమాన్యాలు ఫీజులను చెల్లించాలంటూ విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయని ఆయన ఆరోపించారు.

రంగనాథుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు


జస్టిస్ మాధవీదేవి దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

జియాగూడ, న్యూస్‌టుడే: జియాగూడలోని చారిత్రక రంగనాథస్వామిని బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు బద్రినాథాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ధర్మవర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో నాద రామాయణం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ధర్మవర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీ సత్యసాయి నిగమాగమం ప్రాంగణంలో 'నాద రామాయణం' కార్యక్రమాన్ని ఈ నెల 25 నుంచి 27 వరకు చేపడుతున్నట్లు ఆ ట్రస్టు ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందులో ముఖ్య వ్యాఖ్యాన ప్రసంగము డా.చాగంటి కోటేశ్వరరావు చేయనున్నారు. రామాయణ కావ్యంలోని రెండు ఘట్టాలు గంగావతరణం, షణ్ముఖోత్పత్తిలను వీణ విద్వాంసులు మల్లాది సూరిబాబు, సంగీత విద్వాంసులు మల్లాది సోదరులు శ్రీరామ్ ప్రసాద్, రవికుమార్‌లు గానము, వీణ విద్వన్మణి డి.శ్రీనివాస్‌ల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

నేటి నుంచి ఫార్మా ఇండియా ఎక్స్‌పో


గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఎక్స్‌పో నిర్వాహక ప్రతినిధులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: దేశంలో ఫార్మా రంగం ఎంతగానో అభివృద్ధి చెందుతోందని, అలాంటి ఫార్మా రంగానికి గుండెలా హైదరాబాద్ నగరం మారిందని ఇండియన్ ఎగ్జిబిషన్ సర్వీసెస్ సీఈఓ స్వదేశీ కుమార్ అన్నారు. ఇండియన్ ఎగ్జిబిషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పలు ఫార్మా కంపెనీలతో కలిసి 'ఫార్మా ఇండియా ఎక్స్‌పో 2024'ను ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్నారు. గోడ పత్రికను బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో క్లినికల్ సైంటిస్ట్, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, జెనెసిస్ కంపెనీ సీఈఓ డా.వినయ్ సరికొండ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దేశాన్ని 'ఫార్మసీ ఆఫ్ వరల్డ్' అని పిలుస్తారన్నారు. ప్రపంచంలో వ్యాక్సిన్ ఉత్పత్తిలో 60 శాతం భారత్‌లోనే జరుగుతూ ఉండడం గర్వకారణమన్నారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియా దేశాలకు తక్కువ ధరకు మందులను అందిస్తోందని అన్నారు. ఇక్కడ ప్రదర్శించే ఉత్పత్తులు ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతాయని నమ్ముతున్నామన్నారు.

గవర్నర్‌ను కలిసిన జమ్మూ కశ్మీర్ పాత్రికేయ బృందం


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో జమ్మూ కశ్మీర్ మీడియా ప్రతినిధులు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: జమ్మూ కశ్మీర్‌కు చెందిన మీడియా ప్రతినిధుల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) నిర్వహించే 'ప్రెస్ టూర్'లో భాగంగా జమ్మూ కాశ్మీర్‌లోని వివిధ పత్రికలకు చెందిన పన్నెండు మంది పాత్రికేయులు తెలంగాణలో పర్యటిస్తున్నారు. బృందానికి పీఐబీ హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్, శ్రీనగర్ పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ తారిఖ్ రాథర్ నేతృత్వం వహించారు. డిప్యూటీ డైరెక్టర్ డా. మానస్ కృష్ణకాంత్, మీడియా, కమ్యూనికేషన్ అధికారి వి.గాయత్రి ఉన్నారు.

కీర్తి నిలిచేలా.. స్ఫూర్తి పొందేలా..

పారాలింపిక్స్- 2024లో పతకాలు గెలిచిన భారత క్రీడాకారుల చిత్రాలను ఎల్బీనగర్ చింతల్‌కుంట అండర్ పాస్ గోడలపై ఆకట్టుకునేలా చిత్రీకరిస్తున్నారు. చిన్నారులు, యువ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు స్వర్ణ పతకాలు సాధించిన ఏడుగురి క్రీడాకారుల చిత్రాలు గీయిస్తున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్బీనగర్



మూసీ బాధితులకు న్యాయం కోరుతూ 25న మహా ధర్నా: భాజపా



ధర్నాచౌక్‌లో చింతల రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు


బాధితుల గోడు వింటున్న ఎమ్మెల్యే పాయల్‌శంకర్


హౌజింగ్‌బోర్డు కాలనీలో ఎమ్మెల్యే సూర్యనారాయణ

రాంనగర్, హబ్సిగూడ, చార్మినార్, రాజేంద్రనగర్, నాగోల్ – న్యూస్‌టుడే: మూసీ నది పరివాహక ప్రాంతాల్లోని ఇళ్లను కూల్చకుండా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ.. భాజపా ఆధ్వర్యంలో ఈ నెల 25న ఇందిరాపార్క్ సమీపంలోని ధర్నాచౌక్ వద్ద మహాధర్నా చేపడుతున్నామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డా.కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం పలువురు నేతలతో కలిసి ధర్నాచౌక్‌లోని స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 'మూసీ సుందరీకరణ-పునరుజ్జీవం' పేరిట పేదల ఇళ్ల జోలికి రావొద్దని రేవంత్‌రెడ్డి సర్కారును కోరారు. పేదలను కొట్టి.. పెద్దలకు కట్టబెట్టడమే సీఎం రేవంత్ ఎజెండా అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. మూసీకి సమీపంలో ఉన్న పేదల ఇళ్లను కూలగొట్టి మల్టీనేషనల్ కంపెనీలకు భూములను కట్టబెట్టడమే ప్రణాళిక ఉద్దేశమన్నారు. బుధవారం రామంతాపూర్ డివిజన్‌లో కేసీఆర్‌నగర్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌తో కలిసి పర్యటించారు. కార్పొరేటర్లు చేతన, శ్రీవాణి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. శిల్పారెడ్డి పాల్గొన్నారు. మూసీ ప్రక్షాళన మాటున కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీకి తెరలేపితే అడ్డుకుంటామని నిజామాబాద్ అర్బన్ భాజపా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం బహదూర్‌పుర హౌజింగ్‌బోర్డు, కిషన్‌బాగ్ మహమూద్‌నగర్, కాశీబుగ్గ సమీపంలోని మూసీ పరివాహక ప్రాంతాలను సందర్శించారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఉమామహేంద్ర, బహదూర్‌పుర ఇన్‌ఛార్జి వై.నరేశ్, కన్వీరు ప్రశాంత్ నేతలు పాల్గొన్నారు. మూసీ అభివృద్ధి పేరుతో పేదలకు అన్యాయం చేస్తే భాజపా పోరాటం చేస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బండ్లగూడజాగీర్ పరిధిలోని హైదర్షాకోట్, బహిరాగిగూడ, గంధంగూడ ప్రాంతాల్లో మూసీ ప్రక్షాళనలో ఇళ్లు కోల్పోతున్న వారితో భాజపా నాయకులు బుధవారం సమావేశమయ్యారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, భీమార్జున్‌రెడ్డి, మహేష్‌యాదవ్, వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు. బుధవారం రాత్రి చైతన్యపురి, కొత్తపేట డివిజన్ల పరిధిలోని మూసీ పరివాహక కాలనీల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర చేశారు. అనంతరం న్యూమారుతీనగర్ ఈస్ట్‌లోని ధర్నా చౌక్ వద్ద బైఠాయించి బాధితులతో మాట్లాడారు. గుండెపోటుతో ఆసుపత్రి పాలై కోలుకున్న లక్ష్మమ్మను పరామర్శించారు. నిర్మల్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీశ్, భాజపా జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్బీనగర్ కన్వీనర్ రవీందర్ గౌడ్, కార్పొరేటర్లు రంగానర్సింహాగుప్తా, పవన్‌కుమార్, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం చుట్టూ గోడ కూల్చివేత


జీహెచ్ఎంసీ విడుదల చేసిన కూడలి అభివృద్ధి చిత్రం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ట్యాంక్‌బండ్ డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద గోడ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఆగ్రహించిన దళిత సంఘాల ప్రతినిధులు కొందరు మంగళవారం అర్ధరాత్రి జీహెచ్ఎంసీ నిర్మించిన గోడను కూల్చివేయటంతో ఉద్రిక్తత నెలకొంది. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఛైర్మన్ జి.చెన్నయ్య, కో-ఛైర్మన్ బేర బాలకిషన్, ఎర్రమళ్ల రాములు, బూర్గుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాల సంఘాల ప్రతినిధులు ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అయితే ఇక్కడ సుందరీకరణ పనుల్లో భాగంగా ఐల్యాండ్ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలపడంతో వివాదం సద్దుమణిగింది.

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి


శ్రీకాంత్ సూరంపూడితో శ్రీకిషన్ బద్రుకా, ప్రొ.అభిరామకృష్ణ, డా.రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు

కాచిగూడ, న్యూస్‌టుడే: పారిశ్రామిక సంస్థల అవసరాలకు అనుగుణంగా వివిధ నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దాలని టీసీఎస్ ప్రాంతీయ మానవ వనరుల విభాగాధిపతి, ఎన్‌హెచ్ఆర్‌డీ జాతీయ కమిటీ సభ్యుడు, సీఐఐ హెచ్ఆర్, ఐఆర్ ప్యానెల్ తెలంగాణ కన్వీనర్ శ్రీకాంత్ సూరంపూడి అన్నారు. బుధవారం కాచిగూడలో బద్రుకా పీజీ సెంటర్ విద్యార్థుల 'ఓరియెంటేషన్ డే' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బద్రుకా విద్యా సంస్థల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొ.అభిరామకృష్ణ, పీజీ సెంటర్ డైరెక్టర్ డా.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ దంపతులకు ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పెద్దమ్మతల్లి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



మహేష్‌కుమార్‌గౌడ్ దంపతులకు పెద్దమ్మతల్లి చిత్రపటాన్ని అందిస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

రహదారికి మరమ్మతులు



కొత్తగా నిర్మించిన సీసీరోడ్డు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: సరిచేయమంటే.. తవ్వి వదిలేశారు అనే శీర్షికన ఈ నెల 18న ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించారు. శ్రీనగర్‌కాలనీ ప్రధాన పార్కు వెనుక భాగంలో ఇటీవల కొత్తగా సీసీ రోడ్డు వేశారు. నిబంధనలు పాటించకపోవడంతో రహదారిపై గుంతలు ఏర్పడి వర్షం కురిసినప్పుడు నీరు నిలుస్తుంది. దీంతో అధికారులు మంగళవారం కొత్తగా సీసీ రోడ్డును వేశారు.

హౌస్ కీపింగ్ కార్మికుల ఆందోళన బాట



సంజీవయ్య పార్కు వద్ద కార్మికుల నిరసన

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు పరిధిలో హౌస్ కీపింగ్ కార్మికులు ఆందోళన బాట పట్టారు. గత ఏడాదిన్నర కిందట తగ్గించిన వేతనాలు ఎప్పటిలా పెంచాలని డిమాండ్ చేస్తూ హుస్సేన్ సాగర్ పరిసరాల్లోనే అన్ని పార్కుల్లో పనిచేస్తున్న కార్మికులు సీఐటీయూ అనుబంధ సంఘం బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు కాంట్రాక్టు, హౌస్ కీపింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు పరిధిలోని సంజీవయ్య పార్క్, ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్క్, నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో దాదాపు 170 మంది హౌస్ కీపింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి జీవో 60 ప్రకారం రూ.15,600 వేతనం ఇచ్చేవారు, 2023 ఫిబ్రవరి నుంచి రూ.9,700 మాత్రమే ఇస్తున్నారన్నారు. దాదాపు రూ.నాలుగు వేల వేతనం తగ్గింపుపై ఏడాదిన్నర కాలంగా అధికారుల చుట్టూ తిరిగి వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని వాపోయారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 23 నుంచి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నట్లు ప్రకటించారు. 14 రోజుల తర్వాత సమ్మెలోకి వెళ్లడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ అధికారులు అందజేశారు. యూనియన్ అధ్యక్షత, ప్రధాన కార్యదర్శులు కుమారస్వామి, సుమిత్ర, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు లక్ష్మీదేవి, సావిత్రి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

షౌకత్‌నగర్ బస్తీలో సమస్యల తిష్ఠ

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్ నడిబొడ్డున ఉండే షౌకత్‌నగర్ బస్తీలో ప్రజలు ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దెబ్బతిన్న రహదారులు, వెలగని వీధిదీపాలు, అపరిశుభ్ర వాతావరణం వంటి వాటితో సతమతమవుతున్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధి బంజారాహిల్స్‌లోని షౌకత్‌నగర్ బస్తీలో దాదాపు 120కు పైగా నివాసాలు ఉండగా, ఐదువేలకు పైగా ప్రజలు నివసిస్తుంటారు. ఈ బస్తీకి రెండువైపులా ప్రధాన రహదారులైన రోడ్డు నం.2, 3 ఉంటాయి. బస్తీ నుంచి నాలుగు దారులు.. ఈ రెండు ప్రధాన రహదారులకు అనుసంధానమై ఉంటాయి. ఈ రహదారులతో పాటు బస్తీలో ఉన్న పలు అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. వర్షాలతో ఈ దారులు మరింతగా దెబ్బతిన్నా.. వాటి మరమ్మతు చేపట్టడం లేదు. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఎప్పుడు వర్షం వచ్చినా, రోడ్డు నం.3 నుంచి వచ్చే వర్షపు నీరు బస్తీలోని వీధుల్లో నిలిచిపోతోంది. ఒక్కోసారి ఆ నీరు నివాసాల్లోకి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీ నుంచి ప్రవహించే నాలా పొంగిపోయి నీరంతా రోడ్లపైకి వచ్చేస్తుందని చెబుతున్నారు.



బంజారాహిల్స్ రోడ్డు నం.2 నుంచి షౌకత్‌నగర్ బస్తీ లోపలికి వెళ్లే రహదారి



సామాజిక భవనం ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

అపరిశుభ్రత.. అంధకారం

బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రం ఉన్న గది పైకప్పు బీటలు వారటంతో ప్రమాదానికి ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఉండే ఈ గదికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. ఇక్కడి సామాజిక భవనం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఇక్కడ వ్యాయామశాలను ఏర్పాటుచేయడంతో కసరత్తుల కోసం వచ్చే యువతను అపరిశుభ్రత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన గేటు విరిగిపోయి ఉంది. బస్తీలో నాలుగైదు అడుగుల వెడల్పుతో పలు అంతర్గత రహదారులు ఉండగా, చాలాచోట్ల వీధిదీపాలు వెలగటం లేదు. దీంతో చీకటిపడిన తరువాత రాకపోకలకు ఇబ్బందిగా ఉందని అంటున్నారు. కొన్ని వీధుల్లో తక్కువ పీడనంతో నీటి సరఫరా జరగడంతో చాలినంత నీరు అందడం లేదని ప్రజలు చెబుతున్నారు.

పరిష్కారానికి చర్యలు



బస్తీలో సమస్యలు మా దృష్టికి వచ్చినప్పుడల్లా వాటిని పరిష్కరిస్తూనే ఉన్నాం. త్వరలోనే సంబంధిత శాఖల అధికారులతో ఆ బస్తీలో క్షేత్రస్థాయి పర్యటన జరిపి వాటిని పరిశీలిస్తాం. పరిష్కరించే దిశగా చర్యలు చేపడతాం.

– మన్నె కవితారెడ్డి, కార్పొరేటర్, వెంకటేశ్వరకాలనీ డివిజన్

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

న్యూస్‌టుడే, బంజారాహిల్స్

● **సమస్య:** బంజారాహిల్స్ ఉదయనగర్ బస్తీలోని మూడో వీధిలో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– ముర్తుజా, స్థానికుడు, ఉదయనగర్

జవాబు: ఇంతవరకు సమస్య దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్–18

తొమ్మిది గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ పట్టివేత

నారాయణగూడ, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి బస్సులో మత్తు పదార్థాలను తీసుకొచ్చిన ఓ వ్యక్తిని ఎస్‌టీఎఫ్ సీఐ శిరీష బృందం మాటు వేసి పట్టుకుంది. అతడి నుంచి 9 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు బస్సులో వెల్డర్‌గా పనిచేసే అజయ్‌కుమార్ నగరానికి మత్తు పదార్థాలు (ఎండీఎంఏ)తో వస్తున్నాడని ఎస్‌టీఎఫ్ పోలీసులకు సమాచారం అందింది. బుధవారం లక్డీకాపూల్‌లోని బస్టాపులో మాటువేసి పట్టుకున్నారు. బెంగళూరులో ఉండే డ్రగ్ సప్లయర్‌ను ఎవరైనా సంప్రదించి తమకు ఎండీఎంఏ కావాలని ముందుగా బుక్ చేసుకుంటారు. అజయ్‌కుమార్ సదరు వినియోగదారులకు డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి తీసుకొచ్చి అందజేసి తగిన పారితోషికం అందుకుంటాడు. ఒకసారి పెద్ద మొత్తంలో సంపాదించాలనే అత్యాశతో పోయిన నిందితుడు పోలీసులకు పట్టుబడ్డాడు.

గోర్‌బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: లంబాడీలు మాట్లాడే భాష 'గోర్ బోలి'ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) డిమాండ్ చేసింది. బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో గిరిజనుల పలు సమస్యలపై ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాడావత్ రాంబల్ నాయక్ అధ్యక్షతన సమావేశమై వివిధ గిరిజన సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లంబాడా సామాజిక వర్గంపై వివక్ష చూపుతూ అణచివేయాలని చూస్తోందని ఆరోపించారు. సమితి వ్యవస్థాపకుడు బెల్లయ్య నాయక్ ఇచ్చిన పిలుపుమేరకు త్వరలోనే గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు వేసి, డిమాండ్ల సాధనకు డిసెంబరు 22న చలో హైదరాబాద్ పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని గిరిజనులకు అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని, భవిష్యత్తు తరాలకు ఆటంకంగా ఉన్న జీవో 29ని వెనక్కి తీసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బూక్యా కొట్యా నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రామవత్ సక్కు నాయక్, ఉపాధ్యక్షుడు రాము నాయక్, జాతీయ కార్యదర్శి చిన్ని కృష్ణుడు, రాష్ట్ర కార్యదర్శి ఇస్లావత్ చందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు



సమీక్ష సమావేశంలో అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిలింనగర్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులకు సూచించారు. బంజారాహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ డివిజన్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్షించారు. నియోజకవర్గంలో అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని, దీనికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిధులు మంజూరైన నిర్మాణ పనులు పలు ప్రాంతాల్లో ప్రారంభం కాలేదని స్థానికుల నుంచి ఫిర్యాదులు తమ దృష్టికి వస్తున్నాయన్నారు. ప్రధానంగా డ్రైనేజీ, మంచినీరు, రోడ్డు, వీధి దీపాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరితగతిన ఆ పనులను పూర్తి చేయించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. పనులు వేగవంతం చేయాలని, అవసరమైన పనులకు అంచనాలు తయారు చేసే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కింద నిధులు మంజూరు చేయించే బాధ్యత తనదన్నారు. డివిజన్ల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్, జీఎం హరిశంకర్, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, నాయకులు మామిడి నర్సింగ్‌రావు, రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే : విధులకు వెళ్లిన మైనర్ బాలిక అదృశ్యమైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నరసింహరావు అనే వ్యక్తి కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. సమీపంలోని ఓ బట్టల దుకాణంలో అతని కూతురు (16) సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తోంది. ఈ నెల 22న విధులకు వెళ్లిన అతని కుమార్తె రాత్రి వరకు తిరిగి రాలేదు. రాత్రి 8గంటలకు అంబదాస్ అనే వ్యక్తి ఫోన్‌చేసి మీ కూతురు నా వద్దే ఉందని నరసింహరావుకు ఫోన్‌చేసి కట్‌చేశాడు. తిరిగి అతనికి ఫోన్‌చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. గతేడాది ఆగస్టులో కూడా అంబదాస్ మైనర్ బాలికను తీసుకుని వెళ్లడంతో అప్పట్లో కేసు నమోదైంది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చింతలబస్తీలో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



చింతలబస్తీ మార్కెట్‌ను క్రమబద్ధీకరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ట్రాఫిక్ సమస్యకు మారుపేరైన చింతలబస్తీలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సైఫాబాద్ ఏసీపీ ఎర్రా నాయక్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్, ఎస్‌ఐలు, సిబ్బంది, శాంతి భద్రత పోలీసుల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున చింతలబస్తీ రోడ్డుకు చేరుకున్న పోలీసులు అక్కడి వ్యాపారులు రోడ్డును పూర్తిగా ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు పర్యాయాలు మార్కెట్‌కు చేరుకుని రోడ్లపై కాకుండా కేటాయించిన ప్రదేశంలోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అయినా వినకపోవడంతో బుధవారం బస్తీకి చేరుకుని రోడ్డు పొడవునా రెండు వైపులా ఉన్న అక్రమ వ్యాపారాలను తొలగించారు. వారి సామగ్రిని, రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇకపై వారానికి ఒకసారి డ్రైవ్ నిర్వహిస్తామని, ఎవరైనా రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తే భారీ జరిమానాలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు.

పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఇప్పటి దాకా చెత్తను మాత్రమే తొలగించిన పారిశుద్ధ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగంతో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపట్టి పేరుకుపోయిన వ్యర్థాలనూ తొలగించారు. ఖైరతాబాద్‌లోని మహాభారత్‌నగర్ మైదానంలో ఎంతో కాలంగా కుప్పలుగా మట్టి దిబ్బలు, రాళ్లు, భవన నిర్మాణ సామగ్రి ఉన్నాయి. బుధవారం జీహెచ్ఎంసీ అధికారులు వాటిని తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక కార్పొరేటర్ విజయారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి వారితో కలిసి వ్యర్థాలను తొలగించారు. ఖైరతాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ రజినీకాంత్, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ చైతన్యం, ఇతర పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వ్యర్థాలు తొలగించేందుకు వాహనాలతో మహాభారత్‌నగర్ మైదానం చేరుకున్న స్థానిక కార్పొరేటర్, అధికారులు, సిబ్బంది

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండండి



విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సైబర్ ఎస్సై మహిపాల్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా అమ్మాయిలు మరింత జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఎస్సై మహిపాల్ హెచ్చరించారు. బుధవారం నారాయణగూడ, విఠల్‌వాడిలోని నారాయణ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫెడెక్స్ కొరియర్, డిజిటల్ అరెస్టు, ట్రేడింగ్‌లో లాభాలు, ఏపీకే ఫైల్స్, పార్ట్ టైమ్ ఉద్యోగాలు, లోన్ యాప్ వంటి అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి అప్రమత్తం చేశారు. సామాజిక మాధ్యమ వేదికలపై మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్కైప్ కాల్స్ బెదిరింపులొస్తే భయపడవద్దని.. తమ బ్యాంక్, డెబిట్, క్రెడిట్ కార్డు, ఓటీపీ నెంబర్లకు అపరిచిత వ్యక్తులతో పంచుకోరాదని చెప్పారు. ఏదైనా మోసం జరిగిందని గ్రహిస్తే వెంటనే 1930కు ఫోన్ చేయాలని, అలాగే cyber-crime.gov.inలో, అత్యవసర పరిస్థితుల్లో 87126 65171కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సైబర్ కానిస్టేబుళ్లు కరీం, సంపత్ తదితరులు ఉన్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: భర్తతో గొడవ పడిన మహిళ ఇంటి నుంచి అదృశ్యమైంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ సాయిబాబానగర్‌లో శారద, దీపక్ కుమావత్ నివసిస్తున్నారు. ఈ నెల 22న భార్యభర్తలు గొడవ పడ్డారు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శారద తిరిగి రాలేదు. చుట్టుపక్కలా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో దీపక్ బోరబండ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యురాలితో అసభ్య ప్రవర్తన

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: పెంపుడు కుక్కతో బయటికి వెళ్లిన వైద్యురాలిపై ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించి ఉడాయించిన ఘటన మధురానగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వెంగళ్‌రావునగర్‌లో నివాసముంటున్న ఓ వైద్యురాలు తన పెంపుడు కుక్కతో కలిసి ఈ నెల 21న సాయంత్రం వాకింగ్‌కు వెంగళ్‌రావునగర్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోకి వెళ్లింది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వెనకాల నుంచి వచ్చిన ఓ యువకుడు వైద్యురాలిని అసభ్యకరమైన రీతిలో తాకి, మాట్లాడి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదేశాలు రద్దయ్యే వరకు నిర్మాణాలు చేపట్టొద్దు

'ది వరల్డ్ ఎట్ జూబ్లీహిల్స్'పై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు

ఈనాడు, హైదరాబాద్: కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్ఈ), కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌వో) అనుమతులు లేకుండా ఆర్ఎంసీ (రెడీ మిక్స్ కాంక్రీట్) యూనిట్ నిర్వహిస్తున్న 'ది వరల్డ్ ఎట్ జూబ్లీహిల్స్' సంస్థపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకుంది. 'స్టాప్ కన్‌స్ట్రక్షన్' ఆదేశాలు రద్దయ్యే వరకు నిర్మాణం చేపట్టొద్దని పేర్కొంది. తక్షణమే కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ అనుమతులు తీసుకోవాలని, ఆర్ఎంసీ యూనిట్ నిర్వహణకు సీఎఫ్ఈ, సీఎఫ్‌వో తీసుకోవాలని సూచించింది. జూబ్లీహిల్స్ పరిధి షేక్‌పేట్‌లోని సర్వేనెంబర్ 1, 403లో 6,01,023.3 చదరపు మీటర్ల విస్తీర్ణంలో డీఎస్ఆర్ఎస్ఆర్ ప్రైమ్ స్పేసెస్ సంస్థ 'ది వరల్డ్ ఎట్ జూబ్లీహిల్స్' పేరుతో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టింది. ఈ మేరకు 2022లో ఈసీ అనుమతులు తీసుకుంది. కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తొమ్మిది బ్లాక్‌లలో వందల అంతస్తుల్లో నిర్మాణం చేపట్టింది. పైగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఆర్ఎంసీ యూనిట్‌ను ఏర్పాటు చేసి నాలుగు బ్లాక్‌లలో పదుల సంఖ్యలో అంతస్తుల నిర్మాణం పూర్తి చేసింది. ఈ క్రమంలోనే విపరీతమైన కాలుష్యంతో అవస్థలు పడుతున్నామంటూ స్థానికంగా ఉన్న స్కై హై కల్చర్ కమ్యూనిటీ నుంచి పీసీబీకి ఫిర్యాదులు అందాయి. అనంతరం అధికారులు నిర్మాణ ప్రాజెక్టును సందర్శించి పూర్తి నివేదిక ఇచ్చారు. ఇప్పటికే ఈ నిర్మాణానికి సంబంధించి 'స్టాప్ కన్‌స్ట్రక్షన్ ఆర్డర్' ఇవ్వగా వాటిని విస్మరించారని పేర్కొన్నారు. సీసీ రోడ్లు నిర్మించలేదని, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టలేదని గుర్తించారు. నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు చేపట్టాలని, లేదంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

సైరన్ వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల దృష్టి

40మంది వాహనదారులకు చలానా విధింపు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సైరన్లు పెట్టుకొని ప్రయాణిస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆధ్వర్యంలో పశ్చిమ మండల ట్రాఫిక్ ఏసీపీ కట్ట హరి ప్రసాద్ తన సిబ్బందితో కలిసి బుధవారం పశ్చిమ మండలంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్‌లలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్‌లో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు పలువురు తమ వాహనాలకు సైరన్లు పెట్టుకొని ప్రయాణిస్తున్న దాన్ని గమనించిన ట్రాఫిక్ పోలీసులు వారిని నిలువరించారు. ఆయా వాహనాలకు ఉన్న సైరన్లను తొలగించారు. డీసీపీ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా సైరన్ పెట్టుకొని ప్రయాణించే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెడతామని, అలాగే కారు అద్దాలకు నలుపు తెరలు ఉపయోగిస్తున్న వాహనాలపై దృష్టి పెట్టామన్నారు. పశ్చిమ మండలంలో దాదాపు 40 వాహనాలను గుర్తించి వారికి చలానాలు విధించినట్లు తెలిపారు. తనిఖీలు రోజూ కొనసాగుతాయన్నారు. వాహనదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని లేదంటే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు.



తొలగించిన సైరన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ హరి ప్రసాద్, ట్రాఫిక్ పోలీసులు

సినీనటుడు ప్రభాస్ ఇంటి వద్ద అభిమానుల కోలాహలం



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సినీ నటుడు ప్రభాస్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం అర్ధరాత్రి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వద్దకు అభిమానులు సందడి చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని పెద్దమ్మ తల్లి ఆలయం మలుపులోనే భారీకేడ్లను ఏర్పాటు చేసి అభిమానులు ప్రభాస్ ఇంటి వద్దకు చేరకుండా అడ్డుకున్నారు. అభిమానులు తమ అభిమానాన్ని చాటుతూ ఫ్లకార్డుల ప్రదర్శించడంతోపాటు కేకులు కత్తిరించారు. ఈ సందర్భంగా రోడ్ నం.36లో అర్ధరాత్రి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

స్వదేశీ మేళా సందడి షురూ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : భారతీయ హస్తకళలు, చేనేత అటవీ ఉత్పత్తులు, మిల్లెట్లు, ఇతర ఆట బొమ్మలు, పెయింటింగ్స్ వంటి వస్తువులతో స్వదేశీ మేళాను ప్రభుత్వం నిర్వహిస్తోంది. నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఈ మేళాను బుధవారం నుంచి అయిదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇది భారతీయ సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



ఆదివాసీ చిత్రాలు : నగరానికి చెందిన కొండూరు నాగేశ్వర రావు(58) చిన్నప్పటి నుంచే చిత్రాలు వేయడం నేర్చుకున్నారు. సంప్రదాయాల నుంచి ప్రేరణ పొంది వివిధ రకాల ఆయిల్, కాన్వాస్ పెయింటింగ్ వేశారు. వీటిని అమెరికా, కెనడా, జపాన్ దేశాల్లో కూడా విక్రయించారు. ఎక్కువగా ఆదివాసీ చిత్రాలు, మహిళల సంప్రదాయ కళలు, జానపదులు వంటి వాటి చిత్రాలు వేస్తారు.



ధ్రువిత్ కళ భళా : నగరానికి చెందిన ధ్రువిత్ అనే యువకుడు వివిధ రకాల పెయింటింగ్స్‌తో తన ప్రతిభను చాటుతున్నారు. ఇతడు మాట్లాడలేడు.. వినలేడు..కానీ పెయింటింగ్స్ మాత్రం చక్కగా వేస్తారు. హ్యాండ్‌మేడ్ ఆయిల్ పెయింటింగ్స్, తంజావూర్, కాన్వాస్ పెయింటింగ్స్‌లో అనేక చిత్రాలు వేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న ధ్రువిత్ వేసిన పెయింటింగ్స్ విదేశాల్లో కూడా అమ్ముడవుతున్నాయి.



తాటి ఆకులతో వస్తువుల తయారీ : కేపీహెచ్‌బీకి చెందిన కేబీటీ సుందరి తాటి ఆకులతో వివిధ రకాల వస్తువులు తయారు చేస్తున్నారు. ఈమె 1972 ముంబయిలో ఈ కళను నేర్చుకుని తరువాత ఇక్కడ అనేక మందికి వీటిపై అవగాహన కల్పించారు. వివిధ ప్రాంతాల్లో కూడా ఈ కళపై మహిళలకు శిక్షణ ఇచ్చామని ఆమె తెలిపారు. ఎక్కువగా ఆదివాసీ ప్రాంతాల్లో తాటి ఆకులతో వస్తువులను తయారు చేసి ఉపాధి పొందవచ్చని వివరించారు. తాటి ఆకులతో సంప్రదాయ, అలంకార, గృహోపకరణాలు, బొమ్మలు, బహుమతులు, ఫ్యాన్సీ వస్తువులు తయారు చేస్తున్నారు.

ఆకలితో అలమటిస్తున్న వారిలో 90 శాతం గిరిజనులే



మాట్లాడుతున్న ధరావత్ రవీంద్ర నాయక్, చిత్రంలో ఆర్.భీమా నాయక్, డా.వెంకటేశ్ చౌహాన్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా 12 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఆకలితో అలమటిస్తుండగా.. అందులో 90 శాతం గిరిజనులే ఉన్నారని మాజీ ఎంపీ ధరావత్ రవీంద్ర నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని గమనిస్తే గిరిజనుల అభివృద్ధి ఏమేర జరిగిందో అర్థం అవుతోందని, ఈ పరిస్థితిపై పాలకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏటా లక్షల కోట్లు వెచ్చిస్తున్నా ఆదివాసీలు, బంజారాల బతుకుల్లో మార్పు కనిపించడం లేదన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో అశాంతి పెరగడం, దీన్ని ప్రభుత్వాలు శాంతి భద్రతల సమస్యగా చూడటంతో ఆశించిన ఫలితాలు లేవని వాపోయారు. గిరిజనులతో సలహా మండళ్లు ఏర్పాటుచేసి, వాటి తీర్మానాలను పరిగణనలోకి తీసుకుని అమలు చేస్తే గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 1961 లెక్కల ప్రకారమే రిజర్వేషన్లు ఇస్తున్నారని, ప్రస్తుతం 12 శాతం ఉన్న ఈ వర్గాలకు అదే ప్రాతిపదికన పెంచాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలకు అందజేసినట్లు చెప్పారు. వీటి పరిష్కారం కోసం కేంద్రంలోని భాజపా ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో గిరిజన శక్తి జాతీయ అధ్యక్షుడు డా.వెంకటేష్ చౌహాన్, ఏపీ సీనియర్ గిరిజన నాయకుడు ఆర్.భీమా నాయక్ తదితరులు ఉన్నారు.

కూకట్‌పల్లి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లకు చెందిన 27మందికి బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. శేషాద్రినగర్‌లోని ఆయన కార్యాలయంలో మొత్తం రూ.9,68,500 చెక్కులు అందజేశారు. మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలి

అల్లాపూర్, న్యూస్‌టుడే: అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహాబేగం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌ను బుధవారం కలిశారు. దీపావళి పండగ సమీపిస్తున్నందున అల్లాపూర్ డివిజన్‌లోని శ్మశానవాటికల్లో తాత్కాలిక విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కార్పొరేటర్ జడ్సీకి వినతిపత్రం అందజేశారు.


జడ్సీ అపూర్వ్ చౌహాన్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం

సంక్షిప్త సమాచారం

సీఐకి సత్కారం



బాలానగర్: బాలానగర్ కొత్త సీఐ నరసింహ రాజును బుధవారం కార్పొరేటర్లు ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్ కలిశారు. శాలువాలతో ఆయన్ని సత్కరించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

బాలానగర్: ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల సహకారంతో బుధవారం బాలానగర్ ఇంద్రానగర్ అంబేడ్కర్ భవన్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆశా వర్కర్లు సబియా, కోమలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధికి శ్రీకారం

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం జరిగిందని ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు బండి రమేశ్ ప్రకటనలో తెలిపారు. ముంపు సమస్య నివారణకు సున్నం చెరువు నుంచి కాముని చెరువు వరకు నాలా విస్తరణకు రూ.27కోట్లతో పనులు మొదలు కానున్నాయన్నారు. పీజీ కళాశాల ఏర్పాటు, జేఎన్‌టీయూ నుంచి హైటెక్‌సిటీకి స్కై బస్ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు.

హిందూ శ్మశానవాటిక బాగుకు వినతి

కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని సీపీఎం నేతలు జడ్సీ అపూర్వ్‌చౌహాన్‌ను కోరారు. బుధవారం ఆయన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రహరీ గోడ నిర్మించి, వీధి దీపాలు, రోడ్లు, గేట్లు ఏర్పాటు చేయాలన్నారు. సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్, సభ్యులు తదితరులున్నారు.

నిధి ఆప్కే నికట్ 28న

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పీఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 28న నిధి ఆప్కే నికట్ నిర్వహిస్తున్నట్లు రీజనల్ పీఎఫ్ కమిషనర్-1 డాక్టర్ హేమంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6వరకు భాగ్యనగర్ కాలనీ అర్జున్ థియేటర్ ఎదురు రోడ్డులోని గ్రేస్ సెక్యూరిటీ సర్వీసెస్, మల్కాజిగిరి పారిశ్రామివాడలోని సంప్రే న్యూట్రిషన్స్ లిమిటెడ్, ప్రశాంత్‌నగర్ ఆర్టీసీ భవనం రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

అల్లాపూర్, న్యూస్‌టుడే: సమయం: ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.

ప్రాంతాలు: కైత్లాపూర్ వంతెన, బ్యాంకుకాలనీ, ఆర్ఆర్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్, చంద్రాయని తాండ కొంత ప్రాంతం.

సమయం: మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు.

ప్రాంతాలు: గాయత్రీనగర్‌పార్కు, హరిహర దేవస్థానం, గాయత్రీనగర్‌నాలా, లక్ష్మీనగర్ ప్రాంతాలు.

ఉన్నవాటిపై నిర్లక్ష్యం.. కొత్తవాటిపై ఉత్సాహం

ఒక్క భవనానికి మూడు లిఫ్ట్‌లా?

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రజాధనం.. పైసా ఖర్చు పెడుతున్నా.. పదిసార్లు ఆలోచించాల్సిన అవసరం ఉంటుంది. అవసరం లేకున్నా.. ఉన్నవాటిని వదిలేసి.. కొత్తవాటిపై మోజు చూపడం.. ఇష్టానుసారం రూ.లక్షలు వెచ్చించడం దుబారా అవుతుంది. కానీ, ప్రభుత్వ అధికారులు నిధుల దుబారాకే పెద్దపీట వేయడం కనిపిస్తోంది. జేఎన్‌టీయూ హెచ్ పరిపాలన భవనంలో ఇప్పటికే రెండు లిఫ్ట్‌లు ఉండగా.. కొత్తగా లిఫ్ట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన పరిస్థితులు.. ఇప్పటికే ఉన్నవాటి పని తీరు తదితరాల గురించి తెలుసుకుందాం..

మూడోది బిగించేందుకు పనులు మొదలు

పాత లిఫ్ట్ వినియోగంలో ఉంది. రెండోది నిరుపయోగంగా మారింది. తాజాగా ఇదే భవనంలో మూడో లిఫ్ట్ కోసం పనులు మొదలుపెట్టారు. కనీసం ఒక లిఫ్ట్ ఏర్పాటుకు రూ.8నుంచి రూ.15లక్షల వరకు వ్యయమవుతుంది. అంతగా వాడుకోవాలంటే.. రెండో లిఫ్ట్‌కు మరమ్మతులు చేస్తే.. వ్యయం తక్కువలో పూర్తవుతుంది. కానీ కొత్త లిఫ్ట్ ఏర్పాటుకు ఉత్సాహం చూపుతున్నారు. ఐఎస్‌టీ భవనంలోని లిఫ్ట్‌లోకి ఇటీవల వర్షపు నీరు చేరడం.. మోటార్లతో తోడడం.. అది సరిగా పనిచేయకపోతుండడం గమనార్హం. మరికొన్ని విభాగాల్లోనూ లిఫ్ట్ దుస్థితి ఇలాగే ఉందని ఉద్యోగులు వాపోతున్నారు.


పరిపాలన భవనంలో నిరుపయోగంగా లిఫ్ట్


కొత్తగా ఏర్పాటుచేస్తున్న లిఫ్ట్

రెండోది పనిచేసింది కొన్ని రోజులే

జేఎన్‌టీయూ హెచ్ పరిపాలన భవనం నిర్మాణ సమయంలోనే(రెండు దశాబ్దాల క్రితం) ఒక లిఫ్ట్ ఏర్పాటుచేశారు. సెల్లార్ నుంచి ఈ భవనంలోని మూడంతస్తుల వరకు ఏర్పాటుచేశారు. వీసీతో సహా రెక్టార్, రిజిస్ట్రార్, డీఏపీ, ఆడిట్ సెల్, అకౌంట్స్ ఇలా అన్ని ప్రధాన పరిపాలనాపరమైన ఉన్నతాధికారుల ఛాంబర్లు.. విభాగాల కార్యాలయాలు ఇందులోనే ఉన్నాయి. మొదట్లో కొన్నేళ్లపాటు ఈ లిఫ్ట్‌ను అధికారులతోపాటు సందర్శకులు వినియోగించేవారు. కాలక్రమంలో అధికారులు మాత్రమే వినియోగించేలా సెక్యూరిటీ ఏర్పాటుచేసి గేట్లు బిగించి పెడుతున్నారు. ఆరేడేళ్ల క్రితం ఇదే భవనం ప్రధాన ద్వారం నుంచి ఉన్న మెట్ల మార్గంలో మరో లిఫ్ట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చారు. దీనికి రూ.లక్షలు వెచ్చించినా పనిచేసిన దాఖలాలు అరుదని చెప్పాలి. ఇది వినియోగంలో లేకనే.. దాదాపు నాలుగేళ్లు దాటిందని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ లిఫ్ట్ కంపెనీ విడిభాగాలు చెడిపోవడంతో వాటిని కొనుగోలు చేసి మరమ్మతులు చేస్తే.. వినియోగంలోకి వస్తుంది. దీన్ని ఇలాగే ఉంచి కొత్తగా మరో లిఫ్ట్ ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టడం విమర్శలకు తావిస్తోంది.

సరిగా పనిచేయకపోతుండడంతోనే: డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ హెచ్: పాత లిఫ్ట్ సరిగా పనిచేయకపోతుండడంతో కొత్తది ఏర్పాటుచేస్తున్నాం. రెండో లిఫ్ట్‌కూ మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం.

రోడ్డుకు మరమ్మతులు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి డివిజన్ పరిధి దయార్‌గూడ నుంచి సంగీత్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో ఒకచోట కోసుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని కూకట్‌పల్లి సర్కిల్ అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు సత్వరమే స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి రాకపోకలు పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

మొరాయిస్తున్న విద్యుద్దీపాలకు..



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ తొమ్మిదో ఫేజ్‌లో విద్యుద్దీపాలకు జీహెచ్ఎంసీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. హెచ్ఐజీ నివాసాల సముదాయాల్లో బ్లాక్ 30 లేన్‌లో దీపాలు వెలగకుండా మొరాయిస్తుండటంతో చీకట్లు అలుముకున్నాయి. నివాసితులకు తిప్పలు తప్పడం లేదు. వీటిని బాగు చేయించాలని స్థానికులు 'ఈనాడు' దృష్టికి తీసుకురాగా ఇదే విషయాన్ని జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం డీఈ స్వప్న దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి మరమ్మతులు చేయంచడంతో వెలుగులు ప్రసరిస్తున్నాయి.

ధ్వంసమైన మ్యాన్‌హోల్‌కు..



మూసాపేట, న్యూస్‌టుడే: మూసాపేట పరిధి ప్రగతినగర్‌లో భూగర్భ మ్యాన్‌హోల్ వ్యవస్థ ధ్వంసమైంది. 15రోజులుగా కొనసాగుతున్న ఈ దుస్థితితో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను ప్రాంతీయ జలమండలి మేనేజర్ సలోమి దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లింది. స్పందించిన ఆమె మ్యాన్‌హోల్‌కు బుధవారం మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

జీవితంలో గణితం అంతర్భాగమైంది: రెక్టార్


కార్యశాల ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నిత్య జీవితంలో గణితం ఒక అంతర్భాగంగా మారిందని జేఎన్‌టీయూ రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'క్రిప్టోగ్రఫీ, సంఖ్యాసిద్ధాంతం, అనువర్తనాలు' అంశంపై నిర్వహించిన కార్యశాలలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ప్రపంచ దేశాలు వినియోగిస్తున్న సెర్చ్ ఇంజిన్లు వేగంగా పనిచేయడానికి గణిత శాస్త్రం కీలక భూమిక పోషిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో కృత్రిమ మేధ వినియోగంలోనూ గణితం ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. క్రిప్టోగ్రఫీ, సంఖ్యాసిద్ధాంతం ఉపయోగాలు వివరించి, అనువర్తనాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ హరగోపాల్, గోవర్ధన్, ఐఐటీ ప్రొఫెసర్ సి.ఎస్.శాస్త్రి, జేఎన్‌టీయూ కళాశాల గణిత విభాగం అధినేత ప్రొఫెసర్ ఎం.ఎన్.రాజశేఖర్, అధ్యాపకులు రవీంద్రరెడ్డి, శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బీ-ఫార్మసీ ధ్రువపత్రాల పరిశీలన


ప్రవేశాల విభాగంలో పరిశీలిస్తున్న కృష్ణమోహన్‌రావు, అధ్యాపకులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ హెచ్ ప్రవేశాల విభాగంలో మూడు రోజులుగా జరుగుతున్న బీ-ఫార్మసీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారంతో ముగిసింది. చివరిరోజు 600మంది విద్యార్థులు హాజరుకాగా వారి పత్రాలను అధికారులు పరిశీలించారు. ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్‌రావు పర్యవేక్షణలో అధ్యాపకులు ధ్రువపత్రాలు పరిశీలించి విద్యార్థులకు రసీదులు అందజేశారు.

అసౌకర్యం.. అలక్ష్యం

కూకట్‌పల్లిలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన బస్ టెర్మినల్ ఇది. కొన్ని నెలలకే శిథిలావస్థకు చేరుకుంది. టీవీలు, ఫ్యాన్లు పాడైపోయాయి. భవనంపై ఉక్కు డిజైన్ కవర్లు కూడా ఊడిపోతున్నాయి. ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ పోలీస్ అవుట్ పోస్టుకు తాళం వేసి ఉంటుంది. ఇక్కడి అసౌకర్యాలపై అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఆర్టీసీ పోలీస్ అవుట్ పోస్టుకు తాళం


బస్సు టెర్మినల్‌లో పని చేయని టీవీలు


ఊడిపోయేందుకు సిద్ధంగా ఉన్న రేకులు



నిప్పు రగిలితే భారీ ప్రమాదం

ఫతేనగర్ దారిలో నాలా వద్ద ఉన్న ఓ గ్యాస్ కంపెనీ ద్వారా నిత్యం లక్షలాది కిలోల గ్యాస్ సరఫరా జరుగుతోంది. అక్కడ ఉన్న గోదాం బయట రోజూ రెండు, మూడు భారీ గ్యాస్ ట్యాంకర్లు వేచి ఉంటాయి. కానీ, చుట్టుపక్కల ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఏ మాత్రం నిప్పు రవ్వ రగిలినా భారీ నష్టం జరిగే ప్రమాదముంది. అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పాఠశాల ప్రాంగణం శుభ్రం

స్పందనకు వందనం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: మూడో ఫేజ్‌లోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని జీహెచ్ఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు. ప్రాంగణంలో పేరుకుపోయిన వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ కమ్ముకుంది. దీనిపై 'ఈనాడు'లో 'చెత్తకు నిప్పు.. విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన సిబ్బంది తగలబడిన వ్యర్థాలతోపాటు ప్రాంగణంలో పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.

సాంకేతిక విశ్వవిద్యాలయంలో పనిచేయని ఇంటర్‌నెట్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పేరుకు సాంకేతిక విశ్వవిద్యాలయం. అక్కడ ఏ సమస్య తలెత్తినా.. పరిష్కారానికి నెలలు పడుతుంది. పెద్ద సమస్యనా.. లేదా రూ.లక్షలు వెచ్చించాల్సిన అవసరం ఉందా? అంటే అదీ కాదు. చిన్న.. చిన్న మరమ్మతులకే కునికిపాట్లు పడుతున్న పరిస్థితి. విద్యార్థులకు అవసరమైన.. ఇంటర్‌నెట్ విషయంలోనూ ఇదే దుస్థితి. జేఎన్‌టీయూహెచ్ ఆవరణలో సరస్వతి, కమలానెహ్రూ, గాయత్రి మూడు బాలికల వసతిగృహాలున్నాయి. ఈ మూడింటికీ ఇంటర్‌నెట్‌లో అంతరాయం తరచూ తలెత్తుతుంది. రెండు మాసాల క్రితం ఎలుకలు వైర్లను కొట్టేయడంతో కొన్నిరోజులు ఇబ్బందులు పడ్డారు. 45రోజులుగా సరస్వతి వసతిగృహంలో నెట్ రావడంలేదు. ఈసారి ఉడతలు వైర్లను కొరికేశాయి. వైర్ మార్చాల్సిన అవసరం ఉన్నా.. కాలయాపన జరుగుతుంది. దీంతో నెట్ రాక వైఫై పనిచేయక గేట్ పరీక్షకు సిద్ధమయ్యేవారు.. ప్రాంగణ నియామకాలకు హాజరుకావాల్సిన వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని వార్డెన్ సుప్రీతి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి సమస్యను పరిష్కరించి నెట్ పునరుద్ధరిస్తామని సమాధానమిచ్చారు.

364 మంది హాజరు.. 234 మంది గైర్హాజరు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో బుధవారం మూడో రోజు గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇక్కడున్న రెండు సెంటర్లలో కలిపి మొత్తం 364మంది పరీక్ష రాయగా.. 234మంది గైర్హాజరయ్యారు. కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 118మంది దివ్యాంగులైన అభ్యర్థులకు 93మంది పరీక్షకు హాజరుకాగా 25మంది రాయలేదు. అవినాష్ కామర్స్ కళాశాలలో 480మందికి 209మంది డుమ్మా కొట్టగా 271మంది పరీక్షకు హాజరయ్యారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్ నుంచి ప్రశ్నాపత్రాలు పరీక్షా కేంద్రాలకు చేరుస్తున్నారు. వర్సిటీ ప్రధాన ద్వారం, స్ట్రాంగ్‌రూమ్ వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

బాలిక ఆరోగ్య పరిస్థితిపై మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఆరా


మాట్లాడుతున్న శారద

కేపీహెచ్‌బీకాలనీ: దుండిగల్ ఠాణా పరిధిలోని బౌరంపేటకు చెందిన అయిదేళ్ల బాలిక దుండగుడి చేతిలో గాయపడ్డ సంగతి తెలిసిందే. కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలోని రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద అడిగి తెలుసుకున్నారు. బుధవారం రాత్రి బాలిక చికిత్స తీరును పర్యవేక్షించారు. బాలిక తల్లిదండ్రులను పరామర్శించారు. నిందితుడిపై కేసు నమోదు చేయాలని చెప్పామన్నారు. పాప చికిత్స ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. దోషులకు శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య కూడా బాధితురాలి తల్లిదండ్రులను పరామర్శించారు.

వరద బాధితులకు రాతపుస్తకాలు


రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులకు అందజేస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

ఫతేనగర్, న్యూస్‌టుడే: వరద బాధిత ప్రాంతాల్లో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఫతేనగర్ డివిజన్ బాలానగర్‌లోని ర్యాడ్‌క్లిఫ్ పాఠశాల యాజమాన్యం 5వేల రాత పుస్తకాలు, స్టేషనరీ సమకూర్చారు. బుధవారం కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు అందజేశారు. వీటిని ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్‌తోపాటు విజయవాడలో పిల్లలకు పంపిణీ చేయనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధి వరుణ్, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు భీంరెడ్డి, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం.. రాకపోకలు ప్రమాదకరం



ఫతేనగర్, న్యూస్‌టుడే: ఫతేనగర్ డివిజన్ పరిధి జవహర్‌కాలనీలోని కనకదుర్గాదేవి ఆలయం ముందు రోడ్డులో ఐదు మాసాల క్రితం భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మించారు. తర్వాత మరమ్మతులు చేయకపోవడం.. ఇటీవల మట్టిపోసి చేతులు దులుపుకోవడంతో గుంతలు తేలి రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఉదయం రద్దీ సమయంలో ఇటుగా భారీగా వాహనాల రాకపోకలు సాగుతుండడంతో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు చింది జనంపై పడుతుంది. మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: సీఐ

బాలానగర్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని బాలానగర్ సీఐ నరసింహరాజు హెచ్చరించారు. బుధవారం ఆయన నేతృత్వంలో పోలీసు బృందాలు బాలానగర్ చిత్తారమ్మబస్తీ నిర్మానుష్య, బహిరంగ ప్రదేశాలు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి. పాన్‌షాపుల్లో తనిఖీ చేయగా ఒక డబ్బాలో గుట్కాలు విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రోడ్లపై, బస్టాపుల్లో ఇబ్బంది కలిగిస్తున్న ఆరుగురు పోకిరీలపై కేసు నమోదు చేశారు. వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం రెండు పడకల గదుల ఇళ్ల సముదాయం నివాసితులతో సీఐ మాట్లాడుతూ..ఎటువంటి ఇబ్బంది కలిగినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఫుడ్ ట్రక్ పైనుంచి పడి వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: ఫుడ్ ట్రక్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..కామారెడ్డి పరిధి గిరిపూర్ మండలంలోని దామరచర్ల గ్రామానికి చెందిన ఫకీర్‌గౌస్(50) ఓ జూనియర్ కళాశాలలో పనిచేస్తుంటాడు. బుధవారం ఉదయం 5గంటల సమయంలో కేపీహెచ్‌బీ పరిధి శిల్పా ఎవెన్యూ కాలనీ నుంచి బౌరంపేటలోని కళాశాలకు ఫుడ్ తీసుకెళ్లే ట్రక్ పైనుంచి ప్రమాదవశాత్తు రహదారిపై పడిపోయాడు. తలకు తీవ్రగాయాలవడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం ప్రాణాలు కోల్పోయాడు.

విభాగిని వైభవమేదీ?


మెట్రో పిల్లర్ 766-767 మధ్య పగిలిపోయి ఇలా..

మెట్రోరైలు దారిలో పలుచోట్ల ధ్వంసం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: మెట్రోరైలు విభాగిని వైభవం కోల్పోతోంది. పొడవునా పచ్చదనంతో ఆకట్టుకునేలా ఉండాల్సిన డివైడర్ కళావిహీనంగా మారుతోంది. తొలినాళ్లలో ఉన్న నిర్వహణ క్రమేణ కుంటుపడి అధ్వానంగా తయారైంది. మెట్రోస్టేషన్ పైఅంతస్తుల్లోనే శుభ్రత చర్యలపై దృష్టిసారించిన అధికారులు పార్కింగ్, విభాగినిని గాలికొదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మియాపూర్ నుంచి మూసాపేట వరకు ఇదే దుస్థితి. ఆకర్షణీయంగా ఉండాల్సిన విభాగిని వ్యర్థాలు, ప్యాచులు, ధ్వంసమైన గోడలతో శిథిలావస్థకు చేరుకుంటోంది. ప్రతి రెండు పిల్లర్ల మధ్య వ్యర్థాలు ఉండటమే విభాగిని నిర్వహణ లేదనటానికి నిదర్శనం.


పచ్చదనం ఉండాల్సిన ప్రాంతంలో చెత్తాచెదారం

కూలిన గోడ వ్యర్థాలతో ప్రమాదం

వాహనాలు ఢీకొట్టడంతో విభాగిని పలుచోట్ల ధ్వంసమైంది. వాహనాల వేగానికి గోడ ఇటుకలు అవతలి వైపు ఎగిరిపడుతున్నాయి. సకాలంలో పునరుద్ధరించకపోవడంతో మిగతా ఇటుకలు రాలి రహదారిపై పడితే వాహనదారులకు ప్రమాదం ఉంది. పిల్లర్ నంబర్ 766-767 మధ్య ఇటీవలే విభాగిని ధ్వంసమైంది. నేటికీ అధికారులు మరమ్మతులపై దృష్టి సారించలేకపోయారు. గతంలో ఇక్కడే సీసీ కెమెరా పోల్ కూడా ధ్వంసమై రోజుల తరబడిగా అలానే ఉండిపోయింది. పిల్లర్ నంబరు 820-821 మధ్య విభాగిని పునరుద్ధరణకు నోచుకోలేదు. విభాగిని గోడ ఒక వరస ఇటుకలతో నిర్మించడంతో ధ్వంసమైన రెండు పక్కల పటుత్వం కోల్పోయి అక్కడ కూడా పగిలిపోయే అవకాశముంది. గతంలో ధ్వంసమైన చోట గోడలను పునరుద్ధరించిన అధికారులు రంగులు వేయించక వదిలేశారు. కొన్నిచోట్ల ప్యాచులు కనిపిస్తున్నాయి.

పచ్చదనం కంటే ప్రకటనలకే ప్రాధాన్యమా?

పచ్చదనం కంటే అధికారులకు ప్రకటనలే ముఖ్యమని ఇక్కడి నిర్వహణే చెబుతోంది. మొక్కలకు నీరు పెట్టిన రోజే లేదు. మొక్కల మధ్య ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, రహదారి ఊడ్చగా వెలువడిన వ్యర్థాలు, తినిపారేసిన పొట్లాలు డంప్ చేస్తున్నారు. కిలోమీటరుకు ఒక పుష్పం కనిపిస్తోంది. మిగిలిన చోట్ల మొక్కలు వాలిపోయి ఉన్నాయి. మొక్కలను అక్కడొకటి ఇక్కడొకటిగా పెంచుతున్నారు. వీటి మధ్య ప్రకటనల స్టాండ్లు దర్జాగా ఏర్పాటుచేశారు. జాతీయ రహదారి పొడవునా విభాగినిలో పచ్చదనం కంటే ప్రకటనలే జోరుగా కనిపిస్తున్నాయి. వాహనదారులకు ఆహ్లాదం కంటే అధ్వాన అనుభవమే ఎదురవుతోంది.

అరకొర పని.. ఆపదా పట్టదా?



రోడ్డుమీద గుంతలు పట్టించుకోని దుస్థితి. కనీసం అరకొరగా తీసుకునే చర్యలు సైతం దయనీయంగా ఉంటున్నాయి. చందానగర్ సర్కిల్ పరిధిలోని హుడా కాలనీలో గుంతలు పూడ్చే ప్రక్రియలో భాగంగా కేవలం గుంతలో తారుతో కూడిన కంకర పోసి వదిలేశారు. దీంతో అది కాస్త వాహనాలకు చుట్టుకొని బెదిపోతుంది. ఇంజినీరింగ్ అధికారులు కాస్త దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

టీహబ్‌లో ప్లాస్టిక్ సర్జరీలపై సదస్సు

ఈనాడు, హైదరాబాద్: ప్లాస్టిక్ సర్జరీల్లో జరుగుతున్న పరిశోధనలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ బుధవారం పరిశీలించారు. టీహబ్‌లో ఇండియన్ పోడియాట్రీ అసోసియేషన్, ప్లాస్టిక్ సర్జన్స్ అసోసియేషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్లాస్టిక్ సర్జరీకు సంబంధించి అధునాతన పరికరాలను పరిశీలించి, వాటి పనితీరుపై ఆరా తీశారు. డాక్టర్ రాజా సభాపతి, డాక్టర్ సంతోష్‌మూర్తి, డాక్టర్ పాలకూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ తదితరులు

సమస్యలపై చర్చించాలి.. పరిష్కారం చూపాలి

నేడు సమన్వయ సమావేశం

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం కీలక సమావేశం జరగనుంది. దాదాపు 16 శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో కూడిన సమన్వయ సమావేశం జోనల్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ముఖ్యంగా జోనల్ కమిషనర్ విధ్వేసిన తర్వాత మొదటి సమన్వయ సమావేశం. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు కీలకం కానున్నాయి. ప్రధానంగా తప్పుడు కాలంలో జోనల్ కమిషనర్ బదిలీతో అభివృద్ధి పనులు సక్రమంగా ముందుకు సాగని పరిస్థితి శేరిలింగంపల్లి జోన్‌లో నెలకొంది. ఐటీ వల్లే పలు అభివృద్ధి పనులు గాడిన పడ్డాయి. ముఖ్యంగా తీవ్ర ఇబ్బందిగా మారిన ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పలువెల్లి ఫ్లైఓవర్లు, యూటర్న్‌లు, రోడ్ల విస్తరణ, చౌరస్తాల అభివృద్ధికి జోనల్ అధికారులు శ్రీకారం చుట్టారు. పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నారు.



మాదాపూర్ సైబర్ టవర్ నుంచి కొత్తగూడ చౌరస్తా వైపు వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం పారుతున్న మురుగు

దృష్టి సారించాల్సినవివే..

ప్రధానంగా అభివృద్ధి పనుల పూర్తి శాఖల మధ్య సమన్వయం ప్రధానం. ముఖ్యంగా ట్రాఫిక్ అంశంలో ట్రాఫిక్ ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ సంయుక్త నిర్ణయాలు తీసుకొని అమలుచేయాలి. వరద నిలిచే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలి. ◆ రోడ్ల విస్తరణలో విద్యుత్ స్తంభాలు వేగంగా తరలింపు కీలకం. దీనిపై స్పష్టమైన ప్రణాళిక అవసరం. ◆ మురుగు సమస్యలు, దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లు వాటి మూతల విషయంలో వేగంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ◆ రోడ్లపై పెద్దఎత్తున ఉన్న గుంతలు, గుంతలు పూడ్చాలి.◆ భారీ భవనాలు, ఆసుపత్రులు తదితరచోట్ల పార్కింగ్ సదుపాయాలు కల్పనపై చర్చించాలి.◆ వీధి దీపాల సమస్య తీవ్రంగా మారింది. దీనికి పరిష్కార మార్గాలు చూపాలి.◆ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు దగ్గర నుంచి తెల్లాపూర్ వరకు ఉన్న రైల్వే కల్వర్టుల కింద ఉన్న రహదారుల దగ్గర తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఒక్కొక్క కల్వర్టు దగ్గర ఉన్న సమస్యల పరిష్కారాలపై స్పష్టంగా చర్చ జరగాల్సి ఉంది. ◆ వర్షాకాలం సమయంలో వరద నిలిచే ప్రదేశాలు కొన్ని పరిష్కారం కాగా మరికొన్ని కొత్త ప్రదేశాలలో వరద నిలిచి సమస్యలు వస్తున్నాయి. వాటికి పరిష్కారాలు అన్వేషించాలి.◆ సీఆర్ఎంపీ రోడ్ల విషయంలో ఏజెన్సీ రోడ్ల రివిజ్, పారిశుద్ధ్యం, గుంతలు పూడ్చడం, ఇలా అనేక అంశాలపై ఇచ్చిన హామీలు క్షేత్రస్థాయిలో చాలా అమలు చేయడం లేదు. దీనిపై అధికారులు స్పష్టత రావాల్సి ఉంది. అనేక అంశాలపై చర్చ సాగించాల్సి ఉంది. సమయంలో పరిష్కారాలు చేసే అనేక సమస్యలు గాడిన పడే అవకాశం ఉంది.

పాదచారుల వంతెన కథ ఇంతేనా?

ఆగుతూ ఆగుతూ సాగుతున్న పనులు



రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం మల్కం చెరువు వద్ద రూ.లక్షలు వెచ్చించి ఆధునిక వసతులతో నిర్మించిన పాదచారుల వంతెన చివరి దశ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. వంతెనలోని ప్రధాన రాకపోకల భాగం, మెట్లు, ఎస్కలేటర్‌లను ఏర్పాటు చేసి చివరిదశలోని వంతెన ఎక్కే, చోట, దిగే ప్రదేశంలోని మెట్లు, ఫ్లోరింగ్‌ను పూర్తి చేయకుండా పది నెలలుగా వదిలేశారు. ఐటీ క్షేత్రం రాకపోకల కోసం నిర్మించిన ఎఫ్‌ఓబీ పది నెలలుగా అలంకార ప్రాయంగా మారింది. తప్పని పరిస్థితిలో ప్రజలు రహదారిపై రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆ దారిలో వాహనాలు అత్యంత వేగంగా వెళ్తుంటాయి. వంతెన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. ◆ మూడేళ్లుగా వంతెన నిర్మాణం చేపడుతున్న జీహెచ్ఎంసీ అధికారులు నత్తనడకనే మరిపించేలా నెమ్మదిగా పనులు సాగిస్తున్నారు. కొన్నాళ్లు పనులు చేపట్టడం, తర్వాత నెలలు అర్థంతరంగా వదిలేయడం పరిపాటిగా మారింది. **పది నెలలుగా..** ఈ ఏడాది జనవరిలోనే వంతెనను అందుబాటులోకి తీసుకొస్తామని జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నా పది నెలవుతున్నా అలా జరగలేదు. మరోవైపు ఆరంభంలోనే వంతెనలో పలు సమస్యలు వస్తున్నాయి. పలు భాగాలు తుప్పు పడుతున్నాయి. ◆ మల్కం చెరువు, సన్‌షైన్ ఆసుపత్రుల వైపు ఎఫ్‌ఓబీ వద్ద వాహనాలను నిలుపుతూ పార్కింగ్ స్థలంగా మారుస్తున్నారు.

ఈ పనులు పూర్తి చేస్తే..

చివరిదశలో నిలిచిపోయిన ఎఫ్‌ఓబీ ఎక్కి, దిగే చోట పనులను పూర్తి చేయడమేకాక తగిన ఫ్లోరింగ్ చేయాలి. లిఫ్ట్‌ల ఏర్పాటు, విద్యుత్ అనుసంధానం పూర్తి చేస్తే అందుబాటులోకి వస్తుంది. దీంతో మల్కం చెరువుకు వచ్చే సందర్శకులతోపాటు చిత్రపురికాలనీకి రాకపోకలు సాగించే స్థానికులు, ఐటీ ఉద్యోగులు, సన్‌షైన్ ఆసుపత్రికి వచ్చే రోగులకూ ఉపయోగపడుతుంది.

సంక్షిప్త సమాచారం

ఎల్ఆర్ఎస్‌పై సందేహాల నివృత్తికి వేదిక

రామచంద్రాపురం రూరల్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ 20-20 రెండు రోజుల పరిష్కార వేదిక ప్రారంభించారు. ఎల్ఆర్ఎస్‌లో వచ్చే సందేహాల నివృత్తికి కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు మంగళ, బుధవారాల్లో శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

పటాన్‌చెరు: మార్కెట్ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులకు వ్యాపారులు సహకరించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు గౌతమ్ నగర్ మార్కెట్ ప్రాంతంలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షించారు. కూరగాయల వ్యాపారులతో మాట్లాడారు. దుకాణాలు వెనక్కి జరిపి సహకరించాలని కోరారు. రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు ప్రయాణం చేయలేక పోతున్నారని తెలిపారు.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం రూరల్: కాలనీల్లో సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్ప అన్నారు. బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మయూరి నగర్‌లో పర్యటించారు. సమస్యలపై కాలనీవాసులతో సమీక్ష నిర్వహించారు. జనావాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలను తొలగింపజేయించారు. ఆమె మాట్లాడుతూ.. కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.61.5లక్షల నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు.

వరద నియంత్రణ చర్యలకు వినతి

చందానగర్: హైదరాబాద్ నగరంలో వరదల నియంత్రణకు అవసరమైన మార్పులు తీసుకురావాలని జస్టిస్ మూమెంట్ ఆఫ్ ఇండియా సివిల్ సొసైటీ ఆర్గనైజర్ శ్రీరామోజు ఆకర్ష్ కోరారు. బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన ఆకర్ష్ ఇటీవల పౌర సంఘం విడుదల చేసిన 'వరద రహిత హైదరాబాద్ కోసం సమగ్ర నినాదం' శ్వేతపత్రాన్ని అందజేశారు. వరద విపత్తుల నివారణకు స్థిరమైన పట్టణ ప్రణాళిక లాంటి 15 డిమాండ్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వివరించారు.



ఉషాముళ్లపూడి-ఎల్లమ్మ బండ దారిలో



ఆల్విన్ కాలనీ డివిజన్ జయనగర్ కాలని నుంచి హెచ్‌ఎంటీ రోడ్డులో

అడుసులో అవస్థల ప్రయాణం

ఉషాముళ్లపూడి నుంచి ఎల్లమ్మబండకు వెళ్లే దారిలో నాలా నిర్మాణ పనులు చేస్తున్నారు. ఒకవైపు రోడ్డు మూసేసి.. మరోవైపు వాహనాల రాకపోకలకు అనుమతించారు. ఈ దారిలో వర్షపు నీరు భారీగా నిలిచింది. ఎల్లమ్మబండ నుంచి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వైపు వెళ్లే రోడ్డును మూసేశారు. హుడా పార్క్ వైపు వాహనాలు మళ్లించారు. ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వర్షపు నీటిని తొలగించి వాహనాల రాకపోకలకు అనుమతించాలని, ట్రాఫిక్ లేకుండా ప్రయాణం సాగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. మరోవైపు ఆల్విన్ కాలనీ డివిజన్ జయనగర్ కాలనీ నుంచి హెచ్‌ఎంటీ రోడ్డులో వర్షాలకు రోడ్డు గుంతలు పడి, బురదమయంగా మారింది. గుంతల్లో ప్రయాణంతో నడుములు విరిగిపోతున్నాయని కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పోలీసు అమరుల త్యాగాలపై పాట

ఏసీపీ నాగభూషణంకు సీపీ ప్రశంస

రాయదుర్గం: పోలీస్ అమర వీరుల సంస్మరణ వారం సందర్భంగా పోలీస్ అమరుల త్యాగాలపై పాట రాసిన శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణంను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ప్రశంసించారు. ''చట్టం, ధర్మం న్యాయం కోసం పోరాడిన వీరులు.. ప్రజల కొరకు ప్రాణాలు అర్పించిన ధీరులు.. పోలీస్ అమర వీరులు.. త్యాగాల తురుపు ముక్కలు''.. అనే పాటను నాగభూషణం రాశారు. ప్రజల కోసం పోలీసు అమరులు ప్రాణాలు అర్పించిన తీరు.. వారి త్యాగాల గౌరవాన్ని స్మరిస్తూ.. భావోద్వేగంగా గీతం సాగుతుంది. పాటపై సందర్భానికి అతికినట్లు చిత్రీకరించిన వీడియో ఆకట్టుకునేలా ఉంది. వెంకట్ బొస్కా సంగీతం సమకూర్చగా.. నాంపల్లి హోంగార్డు వెంకట్ రగుడంపల్లి లయబద్ధంగా గానం చేశారు. బుధవారం కమిషనరేట్‌లోని తన కార్యాలయంలో కమిషనర్ అవినాశ్ మహంతి ఏసీపీని అభినందించారు.



కమిషనర్ అవినాశ్ మహంతి, జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌తో ఏసీపీ నాగభూషణం

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చందానగర్, న్యూస్‌టుడే: చందానగర్ వేంకటేశ్వర దేవాలయం బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు సత్యసాయి దేవాలయ కమిటీ సభ్యుల సమక్షంలో స్వామివారి ఉత్సవ మూర్తుల వద్ద విష్వక్సేన పూజ, దీక్షాధారణ, అకల్మష హోమం జరిపారు. సాయంత్రం పుట్టమన్ను తెచ్చి అంకురార్పణ, ధ్వజారోహణ చేశారు. స్వామివారిని శేష వాహనంపై ఊరేగింపు నిర్వహించారు.



వాలీబాల్ పోటీల్లో త్రివేణి విద్యార్థి ప్రతిభ

మియాపూర్, న్యూస్‌టుడే: జిల్లాస్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో మదీనాగూడలోని త్రివేణి పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి సుజిత్ ప్రతిభ చాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ శంకర్‌పల్లిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభను చాటడంతో రంగారెడ్డి జిల్లా తరపున అండర్ 14 జట్టుకు ఎంపికయ్యారు. బుధవారం పాఠశాలలో సుజిత్‌ను త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సీఆర్ఓ సాయినరసింహారావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ నటరాజు, ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న అభినందించారు.



సుజిత్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, ఉపాధ్యాయులు

మత్తు పదార్థాల వినియోగంతో సామాజిక ప్రభావం

పటాన్‌చెరు: మత్తుపదార్థాల వినియోగం వల్ల సామాజికంగా గుర్తింపు కోల్పోతారని రాష్ట్ర నార్కోటిక్ విభాగం డీఎస్పీ పుష్పన్ కుమార్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామం రెసోనెన్స్ అకాడమీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ వినియోగించబోమంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే చదువులో తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. సీఐలు స్వామిగౌడ్, రామునాయక్ తదితరులున్నారు.



ప్రమాణం చేయిస్తున్న పుష్పన్ కుమార్

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

పటాన్‌చెరు, చందానగర్, శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే:

? అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి దుర్గానగర్ కాలనీలో ఇంటి పనులు విధించే విధంగా ఆన్‌లైన్‌లో జీరో బిల్లుగా చూపిస్తుంది. అధికారులు చర్యలు తీసుకురావాలి. – యశ్వంత్, అమీన్‌పూర్, దుర్గానగర్

✓ జీరో బిల్లింగ్ విషయంలో ఫిర్యాదులు అందుతున్నాయి. పన్ను మదింపు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.
– జ్యోతిరెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్

? చందానగర్ హుడాకాలనీ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ కూడలి వద్ద ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. – రవిబాబు, బిల్డర్

✓ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
– పవన్, సీ.ఐ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఖైల్

? చందానగర్ భవాని నగర్ ప్రాంతంలో చెత్తకుప్పలు పెరిగిపోయాయి.
–రమేష్, భవానిపురం

✓ తగిన చర్యలు తీసుకుంటా.-మోహన్‌రెడ్డి, ఉపకమిషనర్, చందానగర్ సర్కిల్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులపై నిర్ణయం తీసుకొని అమలు చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాసులును కలిసి ఆయా అంశాలపై చర్చించారు. ప్రధానంగా లింక్ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, రైల్ ఓవర్ బ్రిడ్జిలు తదితర వాటిపై మాట్లాడారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న క్రమంలో దృష్టి సారించి పనులు ఆరంభం అయ్యేలా చూడాలని కోరారు.



జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: హఫీజ్‌పేట గంగారం ప్రాంతానికి చెందిన నాసర్‌ఖాన్, కూకట్‌పల్లి ప్రగతినగర్ నివాసి మంజులతకు ఒక్కొక్కరికి రూ.60వేల చొప్పున సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గాంధీ తన నివాసంలో అందజేశారు.

పడావుగా భవనం.. పట్టించుకోవాలి అధికార గణం

కొండాపూర్ పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉంది. 1991లో అప్పటి శేరిలింగంపల్లి పురపాలక సంఘం నిధులతో నిర్మించారు. అప్పట్లో మసీద్ బండ, కొండాపూర్ మొత్తం గ్రామీణ ప్రాంతంగా ఉండేది. కాలక్రమేణా ఈ ప్రాంతం కాంక్రీట్ జంగిల్‌గా మారింది. దీంతో ఇక్కడి వైద్యశాలకు పశువులను తీసుకొచ్చే వారు లేక దాదాపు పదేళ్ల క్రితం పశువైద్యశాల మూసేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న భవనం క్రమంగా శిథిలావస్థకు చేరుతోంది. భవనం పటిష్ఠతను పరిశీలించి బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రం లేదా కమ్యూనిటీ హాల్‌గా దీన్ని ఉపయోగించుకోవచ్చు. ఈ స్థలం విలువ కోట్లల్లో ఉంటుంది. దీన్ని పరిరక్షించి ప్రజా అవసరాల కోసం వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గచ్చిబౌలి



ట్రేడింగ్ యాప్ పేరిట మోసం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: స్టాక్ మార్కెట్ యాప్‌లో లావాదేవీలు చేసుకోవచ్చని సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడ్డారు. అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం. . అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి ఎన్‌ఆర్‌పి కాలనీలో ఉంటున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఫోన్ వాట్సాప్‌లో ఆగస్టు 5న ఎం స్టాక్ యాప్ క్రియేట్ అయింది. దాన్ని తెరవగా ఒకేసారి రూ.10లక్షలు వేస్తే స్టాక్ మార్కెట్ లావాదేవీలు నిర్వహించుకోవచ్చని అందులో ఉంది. అతను మాత్రం రూ.2.65లక్షలు వేశాడు. రెండు రోజుల తర్వాత తాము సూచించిన డబ్బులు వేయలేదని, అవి వెనక్కి రావంటూ ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయడానికి అర్హత లేదని ఫోన్ నంబర్‌ను బ్లాక్‌లో పెట్టారు. యాప్ నకిలీదని తెలుసుకొని పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు.

రోడ్ల మరమ్మతులకు వినతి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జోనల్‌కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కోరారు. వివిధ కాలనీల నేతలతో కలిసి బుధవారం జడ్సీకి వినతిపత్రాన్ని సమర్పించారు. రాయదుర్గం, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లి మంజీరా డైమండ్ హైట్స్, నల్లగండ్ల, నేతాజీనగర్, హుడాకాలనీల్లో రహదారులు వర్షాలతో అధ్వానంగా మారాయని జడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. దారులను విస్తరించాలని కోరారు. ఉపకమిషనర్ ముకుందరెడ్డితో భేటీ అయ్యారు.

ఇష్టమైన రంగంలో రాణించండి

పటాన్‌చెరు: చదువుతున్న సమయంలోనే ఇష్టమైన రంగాన్ని ఎంపిక చేసుకోవాలని లేస్ అకాడమీ సీఈవో మిక్కిలినేని నరసింహ అన్నారు. రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో కోగన్ ఫ్యూజన్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి విషయంలో మెలకువలు చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. ఎంచుకున్న రంగాన్ని పూర్తిగా నమ్ముకోవాలన్నారు. నమ్మకం ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పారు. జొమాటో సాంకేతిక అభివృద్ధి ఇంజనీర్ హర్షవర్ధన్, స్కేలార్ ఆర్గానిక్ గ్రోత్ స్పెషలిస్ట్ స్వరూప్, వసంతకుమార్ ఉన్నారు.

బడి ఈడు పిల్లలపై సర్వే

రామచంద్రాపురం రూరల్: మూసీ నది పరీవాహక ప్రాంతాల నిర్వాసితులకు కేటాయించిన కొల్లూరు రెండు పడక గదుల ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారి పిల్లల విద్యపై బుధవారం సర్వే చేశారు. చిన్నారులను పాఠశాలల్లో చేర్పించడానికి వీలుగా తల్లితండ్రులతో సీఆర్పీలు మాట్లాడి వివరాలు సేకరించారు. బడి ఈడు పిల్లలను కొల్లూరు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు. ఎక్కువ మంది పిల్లలుంటే ఇక్కడే పాఠశాల ఏర్పాటు చేయనున్నామని వారు చెప్పారు.



ఇరుకు దారిలో ట్రాఫిక్ ఇక్కట్లు

గంగారం జాతీయరహదారి నుంచి పీజేఆర్ ఎన్‌క్లేవ్ వెళ్లే మార్గంలో వాహనాల సంచారం అస్తవ్యస్తంగా మారింది. రహదారి ఇరుకు మార్గం కావడంతో ట్రాఫిక్ విభాగం కొంత దూరం డివైడర్ వేశారు. పూర్తి స్థాయిలో లేక వ్యతిరేక దిశలో వాహనాలు తిరుగుతున్నాయి. శ్రీరాంనగర్ కాలనీ వీధి నుంచి నేరుగా రహదారిలోకి రావడంతో గంగారం వైపు నుంచి వచ్చే వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. – న్యూస్‌టుడే, చందానగర్

నూతన ఓటర్ల నమోదుకు సహకరించండి

పటాన్‌చెరు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగానమోదు చేయించేలా ప్రతి రాజకీయ నాయకుడు కృషి చేయాలని పటాన్‌చెరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి దేవుజ అన్నారు. పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చేనెల 9, 10 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారితోపాటు ఇతర ప్రాంతాల నుంచి స్థానికంగా నివాసముంటున్న వారిని ఓటరుగా నమోదుచేయించాలని తెలిపారు. ఈనెల 29న ముసాయిదా నోటిఫికేషన్ విడుదలచేయనున్నామన్నారు. తహసీల్దారు రంగారావు, డీటీ సంతోష్, కాంగ్రెస్, భారాస, భాజపా, తెదేపా, సీపీఎం, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు నరసింహారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, నరేష్, శ్రీధర్, ప్రశాంత్ కుమార్, నాగేశ్వరరావు ఉన్నారు.



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న దేవుజ

కాఫీ షాప్‌లో తనిఖీలు

మాదాపూర్, న్యూస్‌టుడే: మాదాపూర్ అమర్‌సొసైటీలో ఉన్న లాస్ట్‌హౌజ్ కాఫీ షాప్‌లో బుధవారం జీహెచ్ఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. కాఫీషాప్ వంటగదిలో కాలం చెల్లిన ఆహార ప్యాకెట్లను గుర్తించారు. వంట గది అపరిశుభ్రంగా ఉండటంతో నిర్వాహకులకు తాఖీదులు జారీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కాఫీ షాప్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శేరిలింగంపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. చందానగర్ ఎస్ఐ నాగేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలుకు చెందిన బోయ వెంకటేష్ శేరిలింగంపల్లి గుల్‌మోహర్ కాలనీ పార్క్ దగ్గర ఉన్న నేతాజీ నగర్‌లో ఉంటున్నారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న అతని కుమారుడు **బోయ శ్రీనివాస్**(20) ఈనెల 16న స్నేహితుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాడు. బయట భోజనం తిందామని ఆటోలో మొత్తం 8 మంది స్నేహితులు కలిసి అర్ధరాత్రి బయల్దేరారు. గచ్చిబౌలి వైపు వెళ్లే క్రమంలో సిగ్నల్ దగ్గర ముందు వెళుతున్న డీసీఎం వాహనం ఆగుతున్న క్రమంలో వెనకనుంచి ఆటో ఢీకొంది. ముందు కూర్చున్న శ్రీనివాస్ గాయపడగా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ప్రాణాలు కోల్పోయాడు. నిర్లక్ష్యంగా ఆటో నడిపిన అతని స్నేహితుడు శ్రీనాథ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. డీసీఎంకు ఆటో ఒకవైపు ఢీకొనడంతో శ్రీనివాస్ గాయపడినట్లు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో ప్రైవేటు ఉద్యోగి..

శేరిలింగంపల్లి: చందానగర్ ఠాణా పరిధిలో ఉండే కోల్‌కతాకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి శ్వేత సుబ్రసేన్(33) నల్లగండ్ల అపర్ణ సరోవర్ జనిత్‌లో ఉంటున్నాడు. ఈనెల 22న ఇంట్లో కుప్పకూలిపడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. కొద్దిరోజులుగా తీవ్ర గ్యాస్ట్రిక్‌సమస్యతో బాధపడుతున్నాడని భార్య పాంట్రిక్ చటర్జీ తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. గుండెపోటుతో మృతిచెందాడని భావిస్తున్నట్లు ఎస్సై రఘు తెలిపారు.

కుత్బుల్లాపూర్

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత



పురపాలిక మేనేజర్ సునందకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

దుండిగల్: పురపాలిక కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లిస్తూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కన్వీనర్ లింగస్వామి అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దుండిగల్ పురపాలిక కార్యాలయంలో బుధవారం మేనేజర్ సునందకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురపాలిక కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. పురపాలిక కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. నరసింహ, సురేందర్, ఎల్లయ్య, క్రాంతి, జ్యోతి పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ



కాచిగూడ, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా శాంతిని కోరుతూ ర్యాలీని నిర్వహించారు. బుధవారం తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.నారాయణ్ ముదిరాజ్, తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌లర్ లక్ష్మణ్‌రావు, ఎన్‌ఎస్ఎస్ అధికారిణి విజయలక్ష్మి, నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల హేమంత్, హైకోర్టు న్యాయవాది ఎల్లయ్య తదితరులు కాచిగూడ చౌరస్తా మీదుగా సాగిన శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రపంచ శాంతి అన్ని దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని వారంతా తెలిపారు. భారతదేశం సమైక్యత, సమగ్రతల కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: ● ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు **ప్రాంతాలు:** టీఎస్‌ఐఐసీ కాలనీ. ● మ.3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు **ప్రాంతాలు:** గంపల బస్తీ ఇండస్ట్రియల్ ఏరియా

'దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి'

బాగ్‌లింగంపల్లి,న్యూస్‌టుడే: ఎన్నికల హామీ మేరకు దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని రూ.4 వేల నుంచి రూ.6 వేలకు వెంటనే పెంచాలని 'డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్'(డీఎస్‌డీ) జాతీయ కన్వీనర్ పల్లవరపు ప్రసాద్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నల్లకుంటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల చట్టం-2016ను పటిష్ఠంగా అమలుచేయడంతోపాటు వారికి కేటాయించిన ఉద్యోగాలను సత్వరం భర్తీ చేయాలని కోరారు. సంఘం జాతీయ కో కన్వీనర్ కాటమోని వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల్లో బధిరులకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వానికి సూచించారు.

నకిలీ పత్రాలతో ఆక్రమణ

● అక్రమ రిజిస్ట్రేషన్లతో దందా



కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: పీయల పుట్టలో పాములు దూరినట్లు.. కొందరు సూరారం బలహీన వర్గాల ఇళ్లలో పాగా వేస్తున్నారు.. మరికొందరు పరిసర బస్తీలు, కాలనీలో ఖాళీగా ఉన్న అమాయకుల స్థలాను కాజేస్తున్నారు. నకిలీ పత్రాలతో వాటిని కబళించి క్రయవిక్రయాలు చేస్తున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత పత్రాలపై లోతుగా విచారణ జరిపి నిగ్గుతేల్చాల్సిందిపోయి.. కొనుగోలు చేసిన వ్యక్తుల పేరిట మ్యుటేషన్లు చేసి ఇంటి నంబర్లు జారీ చేస్తుండడం గమనార్హం.

ఇదీ పరిస్థితి..

1986 సంవత్సరంలో సూరారం 107 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో గృహ నిర్మాణ శాఖ వారు బలహీన వర్గాల వారికి ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అప్పట్లో ఈ ఇళ్లు కేటాయింపులో భారీగా అవకతవకలు జరిగాయి. ఇదే అదనుగా రాజకీయ పలుకుబడితో కొందరు ఇక్కడ తిష్ఠ వేసి నకిలీ పత్రాలతో అమాయకుల ఇళ్లను ఆక్రమిస్తున్నారు. సుభాష్‌నగర్, శ్రీరాంనగర్, శివాలయనగర్, సాయిబాబానగర్ తదితర ప్రాంతాల్లో కూడా మరికొందరు ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలకు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఆక్రమిస్తుండటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. నిబంధనల ప్రకారం ఇంటి నంబర్ల ఆధారంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు చేయకూడదు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు సంబంధిత వ్యక్తులతో లాలూచీపడి అడ్డదారిలో రిజిస్ట్రేషన్లు చేయడంతో సమస్య తలెత్తుతోంది.

మచ్చుకు కొన్ని..

● రాజమ్మకు చెందిన ఇంటి(నంబర్ 03-356)ని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేసినట్లు ఇటీవల నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి తన పేరిట మ్యుటేషన్ చేయించుకున్నారు. ఆమె సోదరి బాలమ్మకు సంబంధించిన ఇంటి(నంబర్ 03-355)ని కూడా సెల్ఫ్ అసెస్‌మెంట్ విధానంలో తన అక్క పేరిట ఇంటి నంబరు వేయించుకుని రెండిళ్లను ఓ వ్యక్తికి రూ. 1.73 కోట్లకు విక్రయించారు. ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద ఆర్జీ పెట్టుకోవడంతో ఇంటి నంబరు 03-356 మ్యుటేషన్ రద్దు చేసి రెండో ఇంటిని వదిలేశారు. ఇప్పటికీ ఆ రెండిళ్లు అతని ఆధీనంలోనే ఉండడం విమర్శలకు తావిస్తోంది.

● సూరారం కాలనీలో ఓ మహిళా నాయకురాలు అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో అద్దెకుంటూ తప్పుడు పత్రాలతో ఆ ఇంటిని కబళించేందుకు యత్నించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇటీవల పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు.

● అదే కాలనీకి చెందిన మరో నాయకురాలు సుభాష్‌నగర్‌లో బతికున్న మనిషి చనిపోయినట్లుగా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి 200 గజాల స్థలాన్ని కబళించి తన సోదరి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జీడిమెట్ల పోలీసులు ఈ నెల 4న ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ -8008573403,	పేట్‌బషీరాబాద్: 8008573405
దుండిగల్ - 80085 73410	నిజాంపేట: 8008573423,
షాపూర్‌నగర్: 8008573404,	జీడిమెట్ల: 8008574405

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

దుండిగల్, న్యూస్‌టుడే: దూలపల్లిలోని ఆలయంలో నల్లపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కొంపల్లి పురపాలిక ఛైర్మన్ శ్రీశైలం యాదవ్, వైస్ ఛైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

● నల్లపోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శివకుమార్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు నేటి నుంచి

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: జీడిమెట్ల డివిజన్ గోదావరిహోమ్స్ కాలనీలోని వేంకటేశ్వరాలయంలో ఈ నెల 24 నుంచి 27 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి రామాచారి ఒక ప్రకటనలో తెలిపారు. 24న విష్వక్సేన పూజ, విష్ణుసహస్రనామ పారాయణం, విశ్వక్సేనారాధన, రక్షాబంధనం.. 25న యాగశాల ప్రవేశం, శాంతిపాఠం, అగ్ని ప్రతిష్ఠ.. 26న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి శాంతి కల్యాణం, 27న సుదర్శన, నారసింహ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

గురు పాదుకాపూజ 29న

కొంపల్లి (పేట్‌బషీరాబాద్): కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎన్సీఎల్‌కాలనీలోని నోబుల్‌పార్కులో శ్రీదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 29 గురు పాదుకాపూజ నిర్వహించనున్నట్లు సరస్వతి ఉపాసకులు బ్రహ్మ రవిచంద్రశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణామ్నాయ శృంగేరి శ్రీశారదా పీఠం జగద్గురు భారతీతీర్థ మహాస్వామి సన్యాస స్వీకరించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు హాజరవుతారన్నారు.

మురుగు ప్రవాహం.. దుర్వాసనతో సతమతం



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీలోని సామాజిక భవనం పక్కన రోడ్డుపై మురుగు పారుతోంది. భూగర్భ డ్రైనేజీలో పూడిక నిండడంతో పది రోజులుగా మురుగు మ్యాన్‌హోల్ నుంచి పొంగిపొర్లి దారిపక్కే చేరుతోంది. దుర్గంధం వెలువడుతోంది. స్థానికులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. - న్యూస్‌టుడే, షాపూర్‌నగర్

తాగునీటి కష్టాలు



జగద్గిరిగుట్టలోని శ్రీనివాస్‌నగర్ సీపీఐ కార్యాలయం సమీపంలో గుట్టపై కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. అక్కడ పైప్‌లైన్ లేదు. దీంతో ఇలా కింది భాగంలో మోటార్లను ఏర్పాటు చేసుకుని మంచినీటిని తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుట్టపై పైప్‌లైన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

లిఫ్ట్ పనిచేయక.. ఇబ్బందులు పడలేక



ఐడీపీఎల్ కాలనీ ప్రధాన రహదారిపై రూ.3.5 కోట్లతో పాదచారుల వంతెన నిర్మించారు. ఇందులో ఐదు నెలలుగా లిఫ్ట్ పనిచేయడం లేదు. వృద్ధులు, వికలాంగులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. -న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్

కైసర్‌నగర్ అభివృద్ధికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: కైసర్‌నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కైసర్‌నగర్‌లో అంతర్గత రోడ్ల విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన విషయాన్ని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి రోడ్ల నిర్మాణానికి రూ.15.50 లక్షలు మంజూరు చేయించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు శ్రీశైలంగౌడ్ కాలనీకి సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. కాలనీ అభివృద్ధి విషయంలో ఎల్లవేళలా సంక్షేమ సంఘం నేతలు, కాలనీ వాసులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. మహ్మద్ తౌసిఫ్, జమీల్ పాషా, జబ్బార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రహదారి విస్తరణకు వినతి

కుత్బుల్లాపూర్: చింతల్ ఎల్లమ్మ దేవాలయం సహారా హోటల్ పక్క నుంచి పల్లవి స్కూల్ వరకు 30 అడుగుల వెడల్పుతో రహదారిని విస్తరించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కె.ఎం. ప్రతాప్ బుధవారం సర్కిల్ ఉప కమిషనర్ నర్సింహకు వినతిపత్రం అందజేశారు. వాహనాల రద్దీతోనిత్యం ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పరిధిలోని 20వ డివిజన్‌లో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ దొంతగాని శాంతి ప్రారంభించారు. దేవేందర్‌నగర్, భాగ్యనగర్‌లతో పాటు జై రామ్‌నగర్ కాలనీలకు రోడ్డుతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

హస్మత్‌పేట: పాతరామంతాపూర్ మల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీ ఆలయ ఛైర్మన్ నామ్ రాజిరెడ్డి, సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ బాధ్యుడు పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

హబ్సిగూడ, న్యూస్‌టుడే: రామంతాపూర్ డివిజన్‌లో రూ.92లక్షలతో నిర్మిస్తున్న సీవరేజీ పనులను కార్పొరేటర్ శ్రీవాణితో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. అనంతరం ప్రగతినగర్, గోకులేనగర్, బృందావన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను ఆయన ప్రారంభించి, పరిశీలించారు.

ముమ్మరంగా భాజపా సభ్యత్వ నమోదు

నాగారం, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా చేపట్టామని బుధవారం పురపాలక ఛైర్మన్ కౌన్సిలర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. 8 వేలకు పైగా సభ్యత్వం అందాయన్నారు.


మహిళా వర్సిటీ వీసీకి సన్మానం

విద్యానగర్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ దనావత్ సూర్యను భాజపా గ్రేటర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ హరిచరణ్, కార్యదర్శి డాక్టర్ ప్రభ పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సుదీర్ఘకాలం ఉన్నత విద్యాశాఖలో సేవలు అందించిన నిపుణురాలిగా, ఉత్తమ పరిశోధకురాలిగా గుర్తింపు పొందిన ఆమెకు మహిళా వర్సిటీ వీసీగా బాధ్యతలు అప్పగించడం హర్షణీయమన్నారు. బుధవారం కోఠిలోని విశ్వవిద్యాలయంలో వారు ప్రత్యేకంగా కలిసి శాలువాలు కప్పి అభినందించారు. భాజపా నేతలు ఆర్.రాంరెడ్డి, గణేశ్, రాజేందర్, ప్రవీణ్ కుమార్, విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కళాకారులను గౌరవించుకుందాం

గాంధీనగర్: ప్రతిభావంతులను గుర్తించి గౌరవించడం ఉత్తమ సంస్కారమని ఆదర్శిరణం పత్రిక సంపాదకులు వంగల బాలరాజ్‌గౌడ్ అన్నారు. మానస ఆర్ట్ థియేటర్, త్యాగరాయగానసభల సంయుక్తాధ్వర్యంలో.. బుధవారం గుండవరపు హనుమంతరావు వేదికలో కవి ఉమ్మడిశెట్టి కృష్ణారావు బహుభాషా కవిసమ్మేళనం నిర్వహించారు.

స్వచ్ఛత కరవై.. అసౌకర్యానికి గురై



కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు



పగిలిపోయిన చెత్త డబ్బాలు



మరమ్మతులకు గురైన గేటు



మరుగుదొడ్డిలో వ్యర్థాలు

కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వినతిపత్రాలు ఇస్తుంటారు. కానీ కార్యాలయంలోని సమస్యలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయాయి. అందులో వ్యర్థాలను మూటల్లో వేశారు. దుర్వాసన వెలువడుతోంది. ప్రధాన గేటు పనిచేయడం లేదు. ఆవరణలో తడి, పొడి చెత్త డబ్బాలు విరిగిపోయాయి. పిచ్చి మొక్కలు పెరిగాయి. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లకు సంబంధించిన అధికారులు ఇక్కడే విధులు నిర్వహిస్తుంటారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి ప్రజలు వస్తుంటారు. కార్యాలయం, ఆవరణ పరిసరాలు అధ్వానంగా ఉండడంతో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

● ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ డిమాండ్



మేడ్చల్ డీసీపీ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న శంభీపూర్ రాజు, కె.పి.వివేకానంద్

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: ఇటీవల దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌లు డిమాండ్ చేశారు. వారు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డిని పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలని పోలీసులను కోరారు. వారి వెంట కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, కొంపల్లి మున్సిపల్ ఛైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ తదితరులు ఉన్నారు.

పోక్సో చట్టం కింద కేసు నమోదు

పేట్‌బషీరాబాద్: నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి తెలిపారు. బుధవారం కార్యాలయంలో డీసీపీ వివరాలను వెల్లడించారు. పోక్సో చట్టం కావడం వల్ల నిందితుడి వివరాలను బహిర్గతం చేయలేకున్నామన్నారు. చట్టం ప్రకారం నిందితుడిపై చర్య తీసుకున్నామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీ



విద్యార్థులతో ఏజీఎం రమణారావు, ప్రిన్సిపల్ చందు, సాయి కృష్ణ తదితరులు

కొంపల్లి (పేట్‌బషీరాబాద్),న్యూస్‌టుడే: శ్రీచైతన్య యాజమాన్యం దేశవ్యాప్తంగా నవంబరు 6న మాస్టర్ మైండ్ క్విజ్ పోటీలు నిర్వహించనుంది. అన్ని శ్రీచైతన్య పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి విద్యార్థుల పోటీల్లో పాల్గొనేందుకు యాజమాన్యం సన్నద్ధం చేస్తోంది. బుధవారం శ్రీచైతన్య కొంపల్లి శాఖ-1లో 15 మంది విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. పాఠశాల ఏజీఎం జీవీ రమణారావు, కో ఆర్డినేటర్ అన్నపూర్ణ, జయపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ సాయికృష్ణ, చందు విద్యార్థులను అభినందించారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రం తనిఖీ



చిర్యాల గీతాంజలి కళాశాలలో గ్రూప్ పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ గౌతమ్

చీర్యాల (కీసర), న్యూస్‌టుడే: చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్-1 మెయిన్ పరీక్ష మూడో రోజు బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను సూచించారు.

బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బౌరంపేటకు చెందిన ఆయుర్వేద బాలిక దుండగుడి చేతిలో గాయపడ్డ సంగతి తెలిసిందే. కేపీహెచ్‌బీ రాణా పరిధిలోని రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద అడిగి తెలుసుకున్నారు. బుధవారం రాత్రి ఆమె బాలిక చికిత్స పొందుతున్న తీరును పర్యవేక్షించారు. బాలిక తల్లిదండ్రులను పరామర్శించారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని చెప్పామన్నారు. పాప చికిత్స ఖర్చు, సదుపాయాలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. దోషులకు కఠినంగా శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కీ వెంకటయ్య కూడా బాధితురాలి తల్లిదండ్రులను పరామర్శించారు.

రిజర్వు ఫారెస్టు మార్గం.. వ్యర్థాలకు నిలయం



రహదారి పక్కన పేరుకుపోయిన..

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: పచ్చని చెట్లతో ఆహ్లాదాన్ని పంచుతున్న రిజర్వు ఫారెస్టుల్లో జీవవైవిధ్యం విధ్వంసమవుతోంది. పక్షుల కిలకిలారావాలు.. నెమళ్ల నాట్యాలతో శోభాయమానంగా కన్పించే అటవీ ప్రాంతాలు రసాయన మన వ్యర్థాలు, బల్దియా చెత్త పారబోతకు నిలయంగా మారింది. సమస్యను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ వారు చుట్టూ రూ. 2.6 కోట్లతో కంచె నిర్మించారు. కానీ కొందరు రాత్రి వేళల్లో రసాయన మన వ్యర్థాలను సంచుల్లో మూటకట్టి రహదారుల పక్కన పారవేస్తున్నారు. దీంతో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది.

నిర్వహణ ఛార్జీలు తప్పించుకోవడానికి.. గాజులరామారం, సూరారం పారిశ్రామికవాడల పక్కన సుమారు 250 ఎకరాల రిజర్వు ఫారెస్టు ఉంది. పచ్చని చెట్లు, నెమళ్లతో స్థానికులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ముద్దుప్పర్లే క్రితం చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు. యాదాద్రి బిల్డర్లు ఏర్పాటు చేశారు. జీడిమెట్ల, గాండీనగర్, ఎస్సార్ ఆటోటికే, సూరారం పారిశ్రామికవాడల్లోని రసాయన కంపెనీల్లో వెలువడే మన రసాయన వ్యర్థాలను దుండిగల్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంటుకు, వ్యర్థజలాలను జీడిమెట్ల ఉమ్మడి కాలుష్య జలశుద్ధి కర్మాగారానికి తరలించాలి. కానీ అందుకు చార్జీలు చెల్లించాల్సి ఉండడంతో కొందరు వాటిని తప్పించుకోవడానికి పారిశ్రామికుల రహదారులపై రసాయన వ్యర్థాలను పారబోస్తుండడంతో ఘాటు వాసన వెలువడుతోంది.

సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే.. వివిధ బస్తీలు, కాలనీల నుంచి రిజర్వు ఫారెస్టు నుంచి వెళ్లే రహదారి పక్కన పలుచోట్ల సీసీ కెమెరాలను అమర్చారు. వాటి ఫుటేజీని ఆధారంగా ఆయా రహదారి మీదుగా ప్రయాణం చేసేవాహనాలను గుర్తించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంది. కానీ పోలీసులు, జీహెచ్ఎంసీ, పీసీబీ అధికారులు పట్టించుకోవడంలేదు.

బొడ్డాయి వార్షిక పూజలు



పూజలు చేస్తున్న పండితులు

కీసర, న్యూస్‌టుడే: కీసరలో బుధవారం నాలుగు బొడ్డాయి ప్రథమ వార్షిక పూజలు ఘనంగా నిర్వహించారు. గత ఏడాది బొడ్డాయి పండగ వైభవోపేతంగా నిర్వహించారు. ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామ పురోహితులు వెంపటి ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో బొడ్డాయికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, విశేష పూజలు చేసి అలంకరించారు. ఈనెల 27న అన్నదానం నిర్వహించనున్నట్లు సర్పంచ్‌ కీసర శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ఛైర్మన్ ఎన్.వెంకటేశముదిరాజు తెలిపారు. ఇందులో మాజీ సర్పంచి మాధురి, మాజీ వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బి.నవీన్‌గౌడ్, ఎ.జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

పనులు చేసి.. మరమ్మతులు మరచి



నెహ్రూనగర్ కూడలిలో తవ్వి వదిలేసిన రోడ్డు



పట్టణ ఆరోగ్యకేంద్రం కూడలిలో..

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం ప్రధాన రహదారిలో ఇటీవల తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో 'ఈనాడు'లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు పూర్తి చేశారు. నెహ్రూనగర్ కూడలిలో పనులు పూర్తయి 15 రోజులు కావస్తోంది. సీఆర్‌పీఎఫ్ రోడ్డుపై తవ్వకాలు చేయడానికి అనుమతులు ఇవ్వక పోవడంతో వారం రోజుల కిందట పూర్తయిన పనులు అనంతరం పనులు పూర్తి చేశారు. తర్వాత రెండు వారాలు కావస్తున్నా రోడ్డుకు మరమ్మతులు చేయడంలేదు. పట్టణ ఆరోగ్యకేంద్రం వద్ద పనులు పూర్తయి నాలుగు రోజులైంది. ఇంకా రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. జలమండలి అధికార్యంలో పనులు చేపట్టాల్సిన సందర్భంలో రోడ్డు బాగుకు రుసుము చెల్లిస్తారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత శాఖ వారు రోడ్లను పునర్నిర్మించాల్సి ఉంటుంది. కానీ రెండు చోట్ల పనులు చేపట్టలేదు. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

ఎల్‌వోసీ పత్రాల అందజేత


పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఊపిరితిత్తుల సమస్యతో కొంత కాలంగా బాధపడుతున్న రాంగోపాల్‌పేటకు చెందిన మాధవి చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.3లక్షల విలువైన పత్రాలను బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. చికిత్సకు సహకరించాలని బాధితురాలి తల్లి ఇందిర ఇటీవల ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ఈ మేరకు మంజూరైన ఎల్‌వోసీ పత్రాలను మారేడుపల్లిలోని తన కార్యాలయంలో ఇందిరకు అందజేశారు. భారాస నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌ను కలిసిన ఓయూ ఐకాస నాయకులు

లాలాపేట, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని, వైస్ ఛైర్మన్ ప్రొ.ఇటిక్యాల పురుషోత్తంను బుధవారం ఓయూ ఐకాస నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ.. విద్యార్థులకు నైపుణ్యాలు మెరుగుపరిచేలా విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టాలని కోరినట్లు తెలిపారు.


ప్రొ.బాలకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కొత్తపల్లి తిరుపతి

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: (బుధవారం నాటివి.. కిలోకు రూపాయల్లో) టమాట 39, నల్ల వంకాయ 40, పొడుగు వంకాయ 35, బెండ 60, పచ్చిమిర్చి 45, బజ్జి మిర్చి 75, క్యాప్సికం 75, పచ్చకాకర 38, పందిరిబీర 55, క్యాబేజి 25, క్యారెట్ 47, దొండ 40, గుండు బీన్స్ 115, గింజ చిక్కుడు 80, గోకరకాయ 50, కీర 23, దోస 35, బీట్‌రూట్ 31, ఉల్లి 45, ఆలు 37, చామ 43, మొరంగడ్డ 28, కంద 60, గోబీ 23, సొర 19, పొట్లకాయ 18, అరటి 9, మునగ 4, మామిడి 65, ముల్లంగి 6, ఉల్లిపొరక 50, వేరుశనగ 50, నిమ్మకాయలు(డజన్) 45, అల్లం(కోహీర్) 160, అల్లం(తెల్లది) 160, వెల్లుల్లి 320.

అల్వాల్, న్యూస్‌టుడే: టమాట 39, వంగ 40, బెండ 60, పచ్చిమిర్చి 35, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 25, క్యారెట్ 47, దొండ 40, ఆలు 37, ఉల్లి 34, సొర 19, పొట్ల 18, బీన్స్ 115, గోరుచిక్కుడు 50, చిక్కుడు 80, దోస 35, బీర 55, కాకర 38, చామగడ్డ 43, కీర 50, క్యాప్సికం 75, బీట్‌రూట్ 31, కందగడ్డ 65, చిలకడదుంప 28, మామిడి 65, మునగ 65, ముల్లంగి 6(ఒకటి).

నాలాల చుట్టూ ప్రహరీ నిర్మాణమెప్పుడో..?

కంటోన్మెంట్ ప్రాంతంలో తలెత్తుతున్న ముంపు సమస్య

కార్ఖానా, కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ ప్రాంతంలో ఓపెన్ నాలాల చుట్టు నిర్మించే ప్రహరీ నిర్మాణ పనులు ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. ప్రహరీ లేక కొన్నేళ్లుగా పలు ప్రాంతాల్లో కాలనీలు, బస్తీలు ముంపునకు గురవుతున్నాయి. ముఖ్యంగా మూడో వార్డులోని విమాన్‌నగర్ కాలనీ, వైగా కాలనీ, రెండో వార్డులోని ఇందిరమ్మనగర్, శ్రీలంకబస్తీ, సెయిల్ కాలనీ, రాయల్ ఎన్‌క్లేవ్, ఆరావలి ఎన్‌క్లేవ్, పార్క్‌వ్యూ, అమరావతి, భావనా కాలనీ, ఆనంద్‌నగర్ కాలనీలు, బస్తీలు ప్రతి ఏడాది ముంపు బారినపడుతున్నాయి. కంటోన్మెంట్ ప్రాంతంలో దాదాపు 32 కిలోమీటర్ల మేరకు రెండు ప్రధాన నాలాలు విస్తరించి ఉన్నాయి. అందులో ఒకటి హస్మత్‌పేట చెరువు నుంచి ప్యాట్నీ కాంపౌండ్ వరకు, మరొకటి పికెట్ లక్ష్మీనగర్ నుంచి ప్యాట్నీ కాంపౌండ్ వరకు ఉన్నాయి. కృష్ణానగర్ బస్తీలో, రాయల్ ఎన్‌క్లేవ్‌లో మాత్రమే ఓపెన్‌నాలాకు ఇరువైపులా ప్రహరీ నిర్మించారు. మరెక్కడా నిర్మాణాలు చేపట్టలేదు.

ప్రతిపాదనలు రూపొందించినా..

2009లో ప్రేమ్ చంద్ సీఈవోగా ఉన్నప్పుడు ఓపెన్ నాలాలకు ప్రహరీ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ఓపెన్‌నాలా ప్రవహిస్తున్న అన్ని బస్తీలు, కాలనీల్లో సర్వే చేపట్టారు. నాలా విస్తీర్ణం, అవసరమయ్యే నిధులు ఇతరత్రా విషయాలపై కసరత్తు చేశారు. దాదాపు రూ.100 కోట్లకు పైగా నిధులు అవసరం కావడంతో కేవలం బోర్డు నిధులతో సాధ్యం కాదని భావించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పూణెలోని కంటోన్మెంట్ బోర్డు కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు. ఇదంతా జరిగి దాదాపు 14 ఏళ్లు కావస్తున్నా నేటికీ పూణెలోని కంటోన్మెంట్ ప్రధాన కార్యాలయం నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.


ఇందిరమ్మనగర్‌లో నాలాకు ఇరువైపులా ఉన్న ఇళ్లు

బోర్డు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే..

ఓపెన్‌నాలాకు ఇరువైపులా ప్రహరీ నిర్మించాలంటే బోర్డుకు తలకు మించిన భారమని స్వయంగా బోర్డు ఉన్నతాధికారులే పేర్కొంటున్నారు. గతంలో బోర్డుకు ఆక్ట్రాయ్, టోల్‌ట్యాక్స్ లేకపోవడం, బోర్డుకు నేరుగా రావాల్సిన టీపీటీ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడం, కేంద్రం నుంచి వందల కోట్ల రూపాయల సర్వీస్ ఛార్జీలు పెండింగ్‌లో ఉండడంతో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించలేని పరిస్థితి. ప్రహరీ అంశంపై సీఈవో మధుకర్ నాయక్‌ను వివరణ కోరగా.. ప్రస్తుతం బోర్డు ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదని, రాష్ట్ర ప్రభుత్వం నాలా డెవలప్‌మెంట్ ఫండ్ కింద పెద్ద మొత్తంలో గ్రాంటు విడుదల చేస్తే, కంటోన్మెంట్ బోర్డు సైతం ముందుకు వచ్చి ప్రహరీ నిర్మాణానికి కసరత్తు ప్రారంభించే అవకాశం ఉంటుందని సీఈవో పేర్కొంటున్నారు.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

సంజీవరెడ్డినగర్, సికింద్రాబాద్, అమీర్‌పేట, న్యూస్‌టుడే:

? బీకేగూడ దాసారం బస్తీలో వీధిదీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. – **అజయ్‌కుమార్, దాసారం బస్తీ**

✓ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – **కిరణ్మయి, జీహెచ్ఎంసీ వీధిదీపాల నిర్వహణాధికారి**

? మెట్టుగూడ డివిజన్ దాదర్ కాంపౌండ్, ఎస్‌వీఎస్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. – **సాయిబాబా, దాదర్ కాంపౌండ్**

✓ పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించేలా కార్మికులను అప్రమత్తం చేస్తాం. – **రజనీకాంత్, వైద్యాధికారి, సికింద్రాబాద్ సర్కిల్**

? ఎర్రగడ్డ రైతుబజార్‌లో ఉల్లిగడ్డ కిలో రూ.45గా బోర్డుపై రాశారు. స్టాల్‌లో రూ.50కి విక్రయిస్తున్నారు. – **లోగిశెట్టి సునీత, కబీర్‌నగర్**

✓ వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – **రమేష్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి**

పగిలిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ఎస్సార్‌నగర్ సమీపంలోని బీకేగూడ సీటైప్ క్వార్టర్ల పరిధిలో పగిలిపోయిన మ్యాన్‌హోల్‌కు జీహెచ్ఎంసీ అధికారులు మరమ్మతులు చేశారు. పగిలిన మ్యాన్‌హోల్ చుట్టూ బారికేడ్‌ను పెట్టి చాలాకాలంగా పట్టించుకోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. సమస్య మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు.

'పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కార్ఖానా, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఒకటో వార్డులోని సంజీవయ్యనగర్ వీర్ సెక్షన్‌లో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తిరుమలగిరి తహసీల్దార్ అశోక్‌కుమార్‌తో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత మూడు ఏళ్ల నుంచి కంటోన్మెంట్ బోర్డు పాలక వర్గం ఎన్నికలు నిర్వహించకపోవడం లేదని, బోర్డు సభ్యులు లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రం నుంచి కంటోన్మెంట్‌కు రావాల్సిన సర్వీస్ ఛార్జీలు దాదాపు రూ.900 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మధుకర్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం లాలాపేట బస్తీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు.

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు వినతి

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మారేడుపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసే విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలత వ్యక్తం చేశారని ఎమ్మెల్యే శ్రీగణేష్ నారాయణ్ అన్నారు. ఈమేరకు ఆయన బుధవారం సచివాలయంలో ప్రిన్సిపల్ కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి, వచ్చే విద్యా సంవత్సరానికల్లా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేసే దిశగా పనులను వేగవంతం చేయాలని కోరారు. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీటోన్ హారన్ల తొలగింపు

సికింద్రాబాద్: చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం మెట్టుగూడ రోడ్డులో సీఎంవీఆర్ రూల్ 119 ప్రకారం అత్యవసర వాహనాలు తప్పా ఎయిర్ హార్న్‌లు, మల్టీటోన్ (సైరన్) హారన్‌లు కలిగివున్న 12 కార్ల నుంచి ఆ హారన్‌లను తొలగించారు. వాహనదారులు ఎయిర్ హార్న్‌లు, మల్టీటోన్ హారన్‌లను ఉపయోగించొద్దని ఇన్‌స్పెక్టర్ కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


నిర్మాణాన్ని కూల్చుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బౌద్ధనగర్, సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో లాలాపేట, విజయనగర్ కాలనీ, చిలకలగూడ, బౌద్ధనగర్ ప్రాంతాల్లో ఆక్రమణ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను కూల్చివేశారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్, టౌన్ ప్లానింగ్ అధికారి సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు

జూబ్లీహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లిని బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ దంపతులకు ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పెద్దమ్మతల్లి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

జట్టుగా పనిచేయటమే విజయానికి మార్గం


డ్యూటీమీట్ విజేతలతో నగర సీపీ సీవీ ఆనంద్, సీసీఎస్ డీసీపీ శ్వేత

ఈనాడు, హైదరాబాద్: పోలీస్‌డ్యూటీ మీట్‌లో విజేతలుగా నిలిచిన పోలీసు బృందం స్నేహభావం, జట్టుగా పనిచేస్తే విజయాలు వరిస్తాయనేందుకు ఉదాహరణగా నిలిచారని నగర సీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఇటీవల తెలంగాణ పోలీస్ డ్యూటీమీట్‌లో 5 బంగారు, 2 వెండి, 5 కాంస్య పతకాలతో విజేతలుగా నిలిచిన 35 మంది సిబ్బందిని బుధవారం బషీర్‌బాగ్ సీసీఎస్ ప్రాంగణంలో సీపీ అభినందించారు. వారిని నగదు ప్రోత్సాహకాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్యూటీమీట్‌లో అంతర్గత ప్రతిభ వెలుగు చూస్తుందన్నారు. టీమ్‌తో కలిసి పనిచేయడంతో స్నేహం, జట్టుతత్వం అలవడతాయని సూచించారు. పోలీసుశాఖలో సాధారణ, సందర్భ పరిస్థితులను మరచిపోకుండా ఆచరణలో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ డీసీపీ శ్వేత, ఏసీపీలు జి.గురురాఘవేంద్ర, జె.నందకుమార్, పూర్ణచందర్‌రావు, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, డి.రాంబాబు, బీటీఆర్‌మాన్ పాల్గొన్నారు.

మహాకాళి ఆలయ హుండీ లెక్కింపు

రాణిగంజ్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి దేవస్థాన హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. ఆలయ మహా మండపంలో జరిగిన కార్యక్రమానికి ఆలయ ఈవో జి.మనోహర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, అనువంశిక ధర్మకర్త కుటుంబ సభ్యుడు ఎస్.రామేశ్వర్ హాజరయ్యారు. హుండీ ఆదాయం రూ.12,58,724 వచ్చినట్లు తెలిపారు.

ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ

కాచిగూడ, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా శాంతి కోరుతూ ర్యాలీని నిర్వహించారు. బుధవారం తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ్ ముదిరాజ్, తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారిణి విజయలక్ష్మి, నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల హేమంత్, హైకోర్టు న్యాయవాది ఎట్టయ్య తదితరులు కాచిగూడ చౌరస్తా మీదుగా సాగిన శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రపంచ శాంతి అన్ని దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని వారంతా తెలిపారు. భారతదేశం సమైక్యత, సమగ్రతల కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.

భాజపా కన్వీనర్‌ను పరామర్శించిన ఎంపీ

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భాజపా కంటోన్మెంట్ కన్వీనర్ డి.బి.విజయానంద్‌ను పరామర్శించారు. గత కొద్దిరోజులుగా హృద్రోగంతో బాధపడుతున్న విజయానంద్‌కు ఇటీవలే కిమ్స్ వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ఆయన్ను పరామర్శించినవారిలో భాజపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పరశురాం, నాయకులు అశోక్, రాజ్‌మల్లేశ్‌లు ఉన్నారు.


విజయానంద్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న ఈటల రాజేందర్

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు 26న

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సీఈవో ఎంప్లాయిస్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ కింద బార్కాస్ సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో హైదరాబాద్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో పనిచేయడానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలకు నేరుగా(వాక్ ఇన్ ఇంటర్వ్యూ) ఎంపిక చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి తెలిపారు. సికింద్రాబాద్ హరిహరకళాభవన్ వద్ద ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఈనెల 26న ఉదయం 10.30గంటల అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. www.hyderabad.telangana.gov.in ద్వారా మార్గదర్శకాలు, దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు విద్యార్హత, కుల ధ్రువీకరణ, స్థానికత, బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రభుత్వ, గ్రాంట్ ఇన్ ఎయిడెడ్ ప్రైవేట్ శిక్షణ సంస్థల్లో 2024-25 విద్య సంవత్సరానికి ఎంపీహెచ్‌డబ్ల్యూ/ఏఎన్ఎం శిక్షణకు రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి అర్హత కలిగి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డా.జమ్మిడి వెంకటి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని శిక్షణ సంస్థల వివరాల కోసం ఆరోగ్య సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలను chfw.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించడంతోపాటు కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలను మరింతగా మెరుగుపర్చాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సంబంధిత కమిటీ ఆధ్వర్యంలో నేతలు బుధవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్ ప్రొహిబిషన్ కమిషనర్ శ్రీధర్‌లకు సైతం వినతిపత్రాలు సమర్పించారు. ఆ తర్వాత సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, వెంకటేశ్వర్లు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తిలో ప్రమాదాల నివారణపై తక్షణం దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నిరుపయోగంగా పార్కు

కంటోన్మెంట్ ఏడో వార్డులోని శాస్త్రినగర్ బస్తీలో ఉన్న పార్కు నిరుపయోగంగా ఉంది. పార్కు నిర్వహణ చూసేవారు లేకపోవడంతో పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలతో కళావిహీనంగా తయారైంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకొని పార్కులో పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కార్ఖానా



మానులవుతున్న మొక్కలు

సికింద్రాబాద్ ఎస్పీ రోడ్‌లోని వైఎంసీఏ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ హాస్టల్ భవనంపై రావి మొక్కలు మానులవుతున్నాయి. అవి భవనానికి చేటు చేకూర్చకముందే తొలగించాల్సిన అవసరం ఉంది.




'ఆలయాలపై దాడులు చేస్తే ఉరితీసే చట్టాలు రావాలి'


ఆలయం వద్ద మాట్లాడుతున్న రంగరాజన్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలు, విగ్రహాలపై దాడులకు పాల్పడే వారికి ఉరిశిక్ష విధించేలా చట్టాలను సవరించాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. సనాతన ధర్మానికి ఉండే శత్రువర్గాన్ని నాశనం చేయాలని ప్రార్థిస్తూ అమ్మవారికి అష్టోత్తరాల పారాయణం పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అమ్మవారిపై దుండగుడు చేసిన దాడి అమానుషమన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గతంలో జరిగిందని, ఇప్పుడు ఇక్కడ జరిగిందని దుండగుల్లో భయం, భక్తి లేకపోవడంతోనే ఇలాంటివి జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి ఘటనలు జరిగితే పోలీసులు ఐపీసీ 296 కింద కేసు నమోదు చేస్తారని దాని కింద రెండేళ్ల జైలు శిక్ష లేదా ఫైన్ ఉంటుందన్నారు. పంజాబ్‌లో ఈ చట్టాన్ని సవరించారని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి ఉరిశిక్ష విధించేలా చట్టం ఉండాలన్నారు. ఇలాంటి వారి పట్ల ప్రభుత్వాలు కఠిన వైఖరి ప్రదర్శిస్తే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అడ్డుకట్ట వేయొచ్చని పేర్కొన్నారు. ఇటీవల దేవాలయాలపై జరుగుతున్న దాడుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. చట్టాన్ని పకడ్బందీగా మార్చాలని ముఖ్యమంత్రికి విన్నవించారు.

ముత్యాలమ్మకు సాక సమర్పించిన భక్తులు

కళాసీగూడ ప్రాంతంలోని ముత్యాలమ్మ ఆలయంలో సాక సమర్పించారు. ఈనెల 14న కుమ్మరిగూడలోని అమ్మవారి ఆలయంలో జరిగిన సంఘటన నేపథ్యంలో ఆలయ శుద్ధితో పాటు ప్రత్యేక పూజలు చేపట్టిన నిర్వాహకులు వేదపంతుల సూచనల మేరకు అమ్మవారి ఆలయాల్లో సాక సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా ప్రతి రోజు ఒక్కొక్క ఆలయానికి వెళ్లి ఆయా ఆలయంలో సాక సమర్పిస్తున్నారు. బుధవారం కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయ నిర్వాహకులు, బస్తీవాసులు ఇంటి వద్ద నుంచి సాకతో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాక తీసుకుని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి సమర్పించారు.


సాక సమర్పించేందుకు వచ్చిన కుమ్మరిగూడ బస్తీవాసులు

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: అపస్మారక స్థితిలో రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మార్కెట్ ఎస్సై మొగలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 22న మధ్యాహ్నం యాత్రి ఇన్ హోటల్ ప్రాంతంలోని రోడ్డు పక్కన ఓ గుర్తుతెలియని వ్యక్తి(55) అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు 108 సిబ్బందికి సమాచారం అందించి చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'ఆకలితో అలమటిస్తున్న వారిలో 90 శాతం గిరిజనులే'



మాట్లాడుతున్న ధరావత్ రవీంద్ర

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా 12 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఆకలితో అలమటిస్తుండగా.. అందులో 90 శాతం గిరిజనులే ఉన్నారని మాజీ ఎంపీ ధరావత్ రవీంద్ర నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని గమనిస్తే గిరిజనుల అభివృద్ధి ఏమేర జరిగిందో అర్థం అవుతోందని, ఈ పరిస్థితిపై పాలకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏటా లక్షల కోట్లు వెచ్చిస్తున్నా ఆదివాసీలు, బంజారాల బతుకుల్లో మార్పు కనిపించడం లేదన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో అశాంతి పెరగడం, దీన్ని ప్రభుత్వాలు శాంతి భద్రతల సమస్యగా చూడటంతో ఆశించిన ఫలితాలు లేవని వాపోయారు. గిరిజనులతో సలహా మండళ్లు ఏర్పాటుచేసి, వాటి తీర్మానాలను పరిగణనలోకి తీసుకుని అమలు చేస్తే గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 1961 లెక్కల ప్రకారమే రిజర్వేషన్లు ఇస్తున్నారని, ప్రస్తుతం 12 శాతం ఉన్న ఈ వర్గాలకు అదే ప్రాతిపదికన పెంచాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఆదివాసీలను గౌరవించి ముర్మును రాష్ట్రపతిగా ఎన్నుకోవటంతో ఆమె ఆ స్థానానికి వన్నె తెస్తున్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలకు అందజేసినట్లు చెప్పారు. వీటి పరిష్కారం కోసం కేంద్రంలోని భాజపా ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో గిరిజన శక్తి జాతీయ అధ్యక్షుడు డా.వెంకటేష్ చౌహాన్, ఏపీ సీనియర్ గిరిజన నాయకుడు ఆర్.భీమా నాయక్ తదితరులు ఉన్నారు.

'దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి'

బాగ్‌లింగంపల్లి: ఎన్నికల హామీ మేరకు దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని రూ.4 వేల నుంచి రూ.6 వేలకు వెంటనే పెంచాలని 'డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్'(డీఎస్‌డీ) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నల్లకుంటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల చట్టం-2016ను పటిష్ఠంగా అమలుచేయడంతోపాటు వారికి కేటాయించిన ఉద్యోగాలనూ సత్వరం భర్తీ చేయాలని కోరారు. సంఘం జాతీయ కో కన్వీనర్ కాటమోని వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల్లో బధిరులకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వానికి సూచించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భారతి, నేతలు కిరణ్‌కుమార్, ఇమ్రాన్, కిషోర్, వెంకటేశ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావేద్‌తో ఇన్‌స్పెక్టర్లు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై నెలరోజులు క్రితం జరిగిన హత్య కేసులో నిందితుడు సుభాష్ బహేశ్వర్‌ను సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావేద్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు సాయి ఈశ్వర్‌గౌడ్, సరస్వత్‌లు వెల్లడించారు. మధ్యప్రదేశ్ బాలాఘాట్ జిల్లాకు చెందిన సుభాష్ బహేశ్వర్ 2009లో బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మెట్టుగూడలో ఉంటూ రైల్వే కాంట్రాక్టర్ వద్ద సెంట్రింగ్, వివిధ ప్రాంతాల్లో కూలీ పనులు చేస్తున్నాడు. అతడు రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్న సమయంలో కలిసిన నిసాద్‌రాయ్ సనై(37) అనే వ్యక్తి బహేశ్వర్‌ను బెదిరించి డబ్బులు తీసుకోవడం ప్రారంభించాడు. ఇలా పలుమార్లు తీసుకున్నాడు. గత నెల 21న పనికి వెళ్లి వస్తున్న సమయంలో జేబులో ఉన్న కూలీ డబ్బులను లాక్కుని బెదిరించాడు. అదే రోజు రాత్రి రైల్వేస్టేషన్‌కు వచ్చిన నిందితుడు బహేశ్వర్ నిసాద్‌రాయ్ సనైను కర్రతో తీవ్రంగా కొట్టి హత్య చేశాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు వివరాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు వేలిముద్రలను ఎఫ్‌పీబీకి పంపించగా.. పలు చోరీల కేసుల్లో నిందితుడుగా ఉన్న గుజరాత్‌కు చెందిన నిసాద్‌రాయ్ సనైగా గుర్తించారు. రైల్వేస్టేషన్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ఆధారంగా బుధవారం ఉదయం సీతాఫల్‌మండీ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని పోలీసులు గుర్తించారు. విచారణలో నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకున్న జీఆర్పీ కానిస్టేబుళ్లు ఎస్కే నాగుబాషా, మహిపాల్‌రెడ్డి, హరిలాల్, భవానీశంకర్‌లను అధికారులు అభినందించారు.

మురుగుతో తప్పని తిప్పలు


బీకేగూడ ప్రధాన రహదారిలో..

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: ఒకవైపు దేవాలయం.. మరోవైపు ఉద్యానం మధ్యలో మురుగు. ఇది బీకేగూడ నల్లపోచమ్మ దేవాలయం వద్ద ప్రధాన రహదారి దుస్థితి. మురుగతో వచ్చే దుర్వాసనతో పార్కుకు, దేవాలయానికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సార్టీ, ఈడబ్ల్యూఎస్ బీకేగూడ కాలనీల్లో మురుగు ఎక్కడ పొంగినా ఇక్కడే నిలిచిపోతుంది. కొందరు దారిన పోయేవారు మూత్ర విసర్జన చేస్తున్నారు. పలువురు మాంసపు వ్యర్థాలు, చెత్తాచెదారం పడేస్తున్నారు. దీంతో వీధి కుక్కలన్నీ ఇక్కడకు చేరి అటుగా వచ్చేవారిపై దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులను స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

బాధితుడికి రూ.53 లక్షలు తిరిగి ఇప్పించిన పోలీసులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయిన బాధితుడికి పోలీసులు నగదు తిరిగి ఇప్పించారు. నగరానికి చెందిన వయోధికుడి(84)కి ఫెడెక్స్ కొరియర్ ప్రతినిధినంటూ నేరస్థుడు ఫోన్ చేశాడు. మీ పేరుతో బుక్ అయిన పార్సిల్‌లో నిషేధిత వస్తువులు ఉన్నాయని చెప్పాడు. వెంటనే సీబీఐ అధికారులమంటూ వాట్సాప్ వీడియోకాల్ చేసి రూ.కోట్ల మోసం కేసులో మీ ప్రమేయం ఉందని బెదిరించారు. దాంతో బాధితుడు భయపడ్డారు. నేరస్థులు చెప్పిన ప్రకారం ఏకంగా రూ.2.88 కోట్లు బదిలీ చేసేశారు. తేరుకొని వెంటనే హైదరాబాద్ సైబర్ పోలీసులకు సంప్రదించారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు, పీసీలు డి.శేఖర్, హెచ్.శేఖర్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఫౌజియా బేగంలు వెంటనే బాధితుడి సొమ్ము ఏ ఏ బ్యాంకు ఖాతాలకు వెళ్లాయో తెలుసుకొని వాటికి నోటీసులిచ్చి సొమ్మును స్తంభింపజేయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో సూరత్‌లోని యాక్సిస్ బ్యాంక్‌లో రూ.53 లక్షలు, కేరళలోని ఎస్‌బీఐలో రూ.50 లక్షల వరకు ఫ్రీజ్ చేయించారు. అందులో కోర్టు ఆదేశాలతో రూ.53 లక్షలు బాధితుడి ఖాతాకు బదిలీ చేయించారు. సైబర్ పోలీసుల కృషిని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అభినందించారు.

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (బుధవారం నాటివి..కిలో రూ.లో) టమాట 39, వంగ 40, బెండ 60, పచ్చిమిర్చి 35, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 25, క్యారెట్ 47, దొండ 40, ఆలు 37, ఉల్లి 34, సొర 19, పొట్ల 18, బీన్స్ 115, గోరుచిక్కుడు 50, చిక్కుడు 80, దోస 35, బీర 55, కాకర 38, చామగడ్డ 43, కీర 50, క్యాప్సికం 75, బీట్‌రూట్ 31, కందగడ్డ 65, చిలకడదుంప 28, మామిడి 65, మునగ 65, ముల్లంగి 6(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాటా కిలో రూ.39, వంగ 40, బెండ 60, పచ్చిమిర్చి 35, కాకర 38, బీర 55, క్యాబేజీ 25, బీన్స్ 115, క్యారెట్ 47, దొండ 40, చిక్కుడు 80, క్యాప్సికం 75, ఆలు 37, కీర 23, దోస 35, చామగడ్డ 43, అరటి 9, బీట్‌రూట్ 31, సొర 19, గోకర 50, చిలకడదుంప 30, మామిడి 68, మునగ 66.

మల్కాజిగిరి

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

బాగ్‌లింగంపల్లి: రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించడంతోపాటు కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలను మరింతగా మెరుగుపర్చాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంబంధిత కమిటీ ఆధ్వర్యంలో నేతలు బుధవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్ ప్రొహిబిషన్ కమిషనర్ శ్రీధర్‌లకు సైతం వినతిపత్రాలు సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, వెంకటేశ్వర్లు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడారు.

లాభాలిస్తామని ఆశచూపి.. రూ.3.60 లక్షల మోసం

నారాయణగూడ: ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు ఇప్పిస్తామని ఆశచూపి నగదు దోచేశారంటూ గృహిణి హైదరాబాద్ సైబర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన గృహిణికి ఓ కంపెనీ ప్రతినిధి వాట్సాప్‌లో సంప్రదించారు. స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడి అవకాశాలను వివరించారు. నమ్మిన బాధితురాలు విడతల వారీగా రూ.3.60 లక్షలు బదిలీ చేశారు. ఆ తర్వాత మీరు పంపించిన డబ్బు ఐపీవోకు వెళ్లిందని.. దాంతో ట్రేడింగ్ తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. మరో 15 రోజుల్లో డబ్బులు తిరిగి పంపిస్తామని నమ్మించారు. ఈ ప్రక్రియ కొనసాగుతుందని.. అదనంగా కూడా పెట్టుబడులు పెట్టాలంటూ ఒత్తిడి తీసుకురావడంతో బాధితురాలికి అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

సుల్తాన్‌బజార్: దేవాదాయ శాఖలో పని చేస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ సంఘాల ఐకాస అధ్యక్షుడు కాందూరి కృష్ణమాచారి పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ ఇటీవల పలువురికి పదోన్నతులు కల్పించడంతో ఐకాస ప్రతినిధులు మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సామాన్యుడికి కూరగాయల సెగ

- తగ్గిన దిగుబడులు.. పెరిగిన డిమాండ్
- రికార్డు ధరల్లో బీన్స్, చిక్కుడు



అల్వాల్ రైతుబజార్

అల్వాల్, డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు దిగిరానంటున్నాయి. జూన్‌లో కొండెక్కిన ధరలు పైపైకి వెళ్తున్నాయి. సాధారణంగా ఆగస్టు చివరి వారం నుంచి ధరలు దిగివస్తాయి. ఆగస్టులో భారీ వర్షాలు ప్రస్తుతం అకాల వర్షాలతో కూరలకు రెక్కలొచ్చాయి. దిగుబడులు తగ్గడం.. డిమాండ్ పెరగడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. సామాన్యులు చాలా కూరగాయలను కొనలేని పరిస్థితి ఉంది. వ్యాపారులూ చాలా సంతల్లో అమ్మకాలు నిలిపివేశారు. పెరిగిన ధరల ప్రభావంతో రోజువారి గిరాకీ సగానికి పడిపోయిందని వ్యాపారులు వాపోతున్నారు. బీన్స్, చిక్కుడు గత రికార్డులను అధిగమించాయి. నియోజకవర్గంలోని అల్వాల్, సైనిక్‌పురి రైతు బజారులోనూ ఇదే పరిస్థితి. ఈ సీజన్‌లో ఎప్పుడూ లేనివిధంగా సామాన్యుడికి అందుబాటులో ఉండే వంకాయ, బీర, బెండకాయ ధరలు భారీగా పెరిగాయి.

ప్రధాన కూరగాయల ధరలు ఇలా

రకం	రైతుబజార్‌లో	బహిరంగ మార్కెట్లో (రూ.లలో)
టమాటా	35 నుంచి 45	55 నుంచి 60
వంకాయ	35-40	50-65
చిక్కుడు	65-80	80-100
బెండ	40-60	60-70
పచ్చిమిర్చి	35-50	70-80
బీన్స్	105-125	150-160
బీర	35-45	60-75
క్యాప్సికం	70-80	90- 100

ఇతర రాష్ట్రాల్లోనూ..

నియోజకవర్గంలోని రెండు రైతుబజార్లకు సంబంధించిన రైతులు మేడ్చల్, శామీర్‌పేట, తుర్కపల్లి, కీసర, కౌకూర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో సాగు చేస్తారు. సకాలంలో వర్షాలు కురిస్తే ఆగస్టు చివరి నాటికి ఉత్పత్తులు వస్తాయి. ఈసారి దిగుబడులు మొదలైన అనంతరం భారీ వర్షాలు పడటంతో పంటలకు నష్టం వాటిల్లింది. స్వయం, సహాయక బృందాల సభ్యులు బోయిన్‌పల్లి మార్కెటు నుంచి కొనుగోలు చేసి ఇక్కడ అమ్ముతారు. బోయిన్‌పల్లికి తెలంగాణ, ఆంధ్రాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తాయి. ఇతర రాష్ట్రాల్లోనూ అకాల వర్షాలు, వేడి వాతావరణంతో దిగుబడులు తగ్గాయి.

దిగుమతులు ఇలా

అల్వాల్ రైతుబజార్‌కు ప్రతి కూరగాయ 30 క్వింటాళ్ల వరకు వస్తోంది. సైనిక్‌పురికి 10 క్వింటాళ్లు వస్తాయి. కొన్ని రోజుల నుంచి బీన్స్, వంకాయ, బీర, బెండ, చిక్కుడు ఆయా మార్కెట్లకు 5 నుంచి 10 క్వింటాళ్లే వస్తున్నాయి. ఆకు కూరల దిగుమతి తగ్గింది. పాలకూర రూ.50కు మూడు కట్టలు అమ్ముతున్నారు. స్థానిక దిగుబడులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూరగాయలు నవంబరు మొదటి వారానికల్లా పెరిగే అవకాశం ఉందని..అప్పటికి ధరలు తగ్గే పరిస్థితి ఉందని రైతుబజార్ ఎస్టేట్ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు.

ధరలను నియంత్రించాలి : వనజ, రామకృష్ణాపురం

నిత్యావసరాల ధరలు ఇప్పటికే పెరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయలు సైతం కొనే పరిస్థితి కనిపించడం లేదు. తక్కువ ధరలు ఉన్నవాటినే కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

గౌతంనగర్, మల్కాజిగిరి, అల్వాల్, డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే:



? గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ మసీదు వద్ద చెట్లు విద్యుత్తు తీగలకు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. తీగల వద్ద మంటలు వస్తుండటంతో మా ఇళ్లల్లోని విద్యుత్తు పరికరాలు కాలిపోతున్నాయి. – రామిరెడ్డి, మిర్జాలగూడ

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి చెట్ల తీగలను తొలగిస్తాం. – చంద్రశేఖర్, ఏడీఈ, మల్కాజిగిరి

? వాణీనగర్ నాలుగో వీధిలో బూరుగు చెట్టు వ్యర్థాలతో పాటు చెత్త నిల్వలు పేరుకు పోయాయి. – సదాశివరావు, వాణీనగర్

✓ చెత్త నిల్వలను డంపింగ్‌యార్డుకు తరలిస్తాం. – నాగరాజు, పారిశుద్ధ్య నిర్వహణ సూపర్‌వైజర్

? తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ కల్యాణ్‌నగర్ వీధి నంబరు 1లో, ఎస్‌బీఐ బ్యాంకు కాలనీలో ఐదు రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. – హరిప్రకాశ్, సదాశివరావు, కాలనీవాసి

? ప్రశాంత్‌నగర్‌లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. – సత్యమూర్తి, కాలనీవాసి

✓ ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలను పరిశీలించి వెలగని దీపాలను సరిచేస్తాం. – వెంకటేశ్, పర్యవేక్షకుడు, సర్కిల్ వీధిదీపాల విభాగం

? మచ్చబొల్లారం లక్ష్మీఎన్‌క్లేవ్ కాలనీలో వీధిదీపాలు నెలరోజులుగా వెలగడం లేదు. పొదలు అధికంగా ఉన్న కాలనీలో రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉంటుంది. - శ్రీధర్, స్థానికుడు

✓ మరమ్మతుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందో తెలుసుకొని దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటా. – రఘుపతిరెడ్డి, డీఈ

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి యాప్రాల్ జీకే ప్రైడ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన చెత్తచెదారం పేరుకుపోయింది. దుర్గంధం, అపరిశుభ్రతతో ఇబ్బందులు పడుతున్నాం. – రమ్య, యాప్రాల్

✓ పరిశీలించి చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలిస్తాం. –నాగరాజు, పారిశుద్ధ్య అధికారి

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్ బీజేఆర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మధ్యాహ్నం అందించే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కేంద్రంలో అందిస్తున్న భోజనంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, పద్మజ, మంజుల స్థానిక నేతలు బాబు, కిషోర్, మోసిన్ పాల్గొన్నారు.

రహదారిపై ఆక్రమణలు తొలగించాలని వినతి

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: రామబ్రహ్మనగర్‌లో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టాడని స్థానిక కాలనీవాసులు మల్కాజిగిరి ఉప కమిషనర్ రాజుకు బుధవారం ఫిర్యాదు చేశారు. రీనాసింగ్ అనే వ్యక్తి కొత్తగా నిర్మించిన తన ఇంటి మెట్లను, ప్రహరీ గోడను రోడ్డుపై నిర్మించారని దాంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు. వెంటనే చర్య తీసుకోవాలని కోరారు. కాలనీవాసులు వెంకటేష్, రామారావు, కృష్ణ, గోపాల్ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

స్వచ్ఛ మాట.. ఆరోగ్యానికి బాట



గౌతంనగర్, న్యూస్‌టుడే: స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరిలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని పేర్కొంటూ జీహెచ్‌ఎంసీ సిబ్బంది గోడలపై సూచనలు రాస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి చెత్త వేస్తే రూ.1000 జరిమానా విధిస్తామని జ్యోతినగర్ కూడలిలోని గోడలపై రాస్తున్న సిబ్బంది.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



గణపతికి ప్రత్యేక హారతులు

డిఫెన్స్‌కాలనీ, మల్కాజిగిరి, న్యూస్‌టుడే: సైనిక్‌పురి శృంగేరి శంకరమఠం విజయ గణపతి ఆలయంలో బుధవారం గణనాథునికి ప్రత్యేక పూజలు జరిగాయి. సుప్రభాత సేవ, గోపూజ, గురు వందనం, ప్రత్యేక అర్చనలు, పుష్ప పూజ అనంతరం గణపతికి ప్రత్యేక అలంకరణ చేశారు.

- తూర్పుఆనంద్‌బాగ్‌లోని అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం గణపతిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. స్వామివారికి భక్తులు ప్రత్యేక అర్చనలు చేయించుకున్నారు.

25న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి



ఉపకమిషనర్ రాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ నాయకులు

గౌతంనగర్, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న తలపెట్టిన చలో హైదరాబాద్ సీఎం డీఏ కార్యాలయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఉపకమిషనర్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. జె.వెంకన్న, బి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

చెట్ల కొమ్మల తరలింపు

మౌలాలి: గాయత్రీనగర్‌లో నెల రోజుల క్రితం విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని కొమ్మలను నరికి రోడ్డు పక్కన వేశారు. అనంతరం వాటిని తీయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 21న ఈనాడు దినపత్రికలో 'కొట్టేసిన కొమ్మలు తరలించారా' శీర్షికతో ఫొటో కథనం ప్రచురితమైంది. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి. కొట్టేసిన చెట్ల కొమ్మలను, చెత్తను తరలించి శుభ్రం చేశారు.

ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యం

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: ఉద్యోగానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకనగర్‌కు చెందిన ఓ యువతి బుధవారం ఉదయం 9 గంటలకు సైనిక్‌పురిలో తాను పని చేసే దుకాణానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్పందించలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అష్టలక్ష్మి ఆలయంలో ఈటల పూజలు



ఆలయంలో ఎంపీ ఈటల రాజేందర్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు తదితరులు

ఆర్కేపురం: హైదరాబాద్ నగరంలోని ఆర్కేపురం డివిజన్‌కి చెందిన అష్టలక్ష్మి ఆలయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.. బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతన కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధారెడ్డి, నర్సింహాగుప్తా, పవన్ పాల్గొన్నారు.

హబ్సిగూడ: రామంతాపూర్ డివిజన్‌లో రూ.92 లక్షలతో నిర్మిస్తున్న సీవరేజీ పనులను కార్పొరేటర్ శ్రీవాణితో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. అనంతరం ప్రగతినగర్, గోకలేనగర్, బృందావన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను ఆయన ప్రారంభించి, పరిశీలించారు.

నాటకం.. నవజీవన సందేశం



జ్యోతి వెలిగిస్తున్న హెచ్‌జే దొర తదితరులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: నాటకం నవ జీవన సందేశమని పలువురు వక్తలన్నారు. బుధవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ)ల ఆధ్వర్యంలో తొలి మాండలిక నాటక రచయిత కె.ఎల్(కోదాటి) నరసింహారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా రెండు రోజులుగా జరుగుతున్న నాటకోత్సవాలు ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత డీజీపీ, రసరంజని వ్యవస్థాపక అధ్యక్షులు హెచ్.జె.దొర మాట్లాడుతూ.. సమాజాన్ని సంస్కరించే, ఆలోచింపజేసే నాటకాల అవసరం ఉందన్నారు. సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచందర్‌రావు, అధ్యక్షుడు ఆకుల సదానందం, ప్రధాన కార్యదర్శి సాధుశ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి తనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

గౌతంనగర్, న్యూస్‌టుడే: ఒంటరిగా జీవిస్తున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్కాజిగిరి సీఐ సత్యనారాయణ, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలీకి చెందిన వేణుగోపాల్‌రెడ్డి(52) కొన్నేళ్ల పాటు అమెరికాలో పనిచేసి 2021లో ఇండియాకు తిరిగి వచ్చారు. ఆయనకు వివాహం కాలేదు. ఆయనకు చెందిన ఫ్లాట్‌లో తల్లిదండ్రులు ఉండేవారు. వేణుగోపాల్‌రెడ్డి భారత్‌కు తిరిగొచ్చిన తరువాత కొన్ని రోజులు కలిసి ఉన్నారు. అతడి మానసిక స్థితి సరిగా లేకపోవడం, వేధిస్తుండటంతో తల్లిదండ్రులు తమ సొంత ప్రాంతమైన వనపర్తి జిల్లా యానిగిళ్ల గ్రామానికి వెళ్లిపోయారు. ఆయనకు ఇద్దరు సోదరిలు ఉన్నారు. వారు కూడా ఆయనకు దూరమయ్యారు. ఒంటరి తనంతో మానసికంగా కుంగిపోయిన ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మౌలాలిలోని తను ఉంటున్న ఫ్లాట్ తలుపులు నాలుగు రోజులుగా తెరవకపోవడం.. లోపల నుంచి దుర్వాసన రావడంతో పక్క ఫ్లాట్‌వారు ఈనెల 22న సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు మల్కాజిగిరి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తాళం పగుల గొట్టి లోనికి వెళ్లగా శరీరం మొత్తం కుళ్లిన స్థితిలో ఉంది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం.. పట్టించుకోని యంత్రాంగం



నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: సైనిక్‌పురి రోహిణి కాలనీలోని వీధి మలుపులో ఉన్న విద్యుత్తు నియంత్రిక వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం ప్రజలు వాహనాలు వచ్చిపోయే ఈ మలుపు వద్ద కేబుళ్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఎలాంటి గోడ, ఫెన్సింగ్ లేకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే నియంత్రిక చుట్టూ రక్షణ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇంకుడు గుంతకు మోక్షం



స్పందనకు వందనం

గౌతంనగర్: గౌతంనగర్ చాచానెహ్రూ ఉద్యానం వద్ద ఇంకుడు గుంత గోడలు ధ్వంసమై చెత్తాచెదారానికి నిలయంగా మారింది. ఈ నేపథ్యంలో ఈనెల 22న 'ఇంకుడు గుంత ఇలా.. నీరింకేదెట్టా' శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన చిత్ర కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. ఇంకుడు గుంతకు మరమ్మతులు నిర్వహించి, చెత్తాచెదారాన్ని తొలగించారు.

గ్రూప్-I పరీక్ష కేంద్రం తనిఖీ



చీర్యాల గీతాంజలి కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

కీసర, గౌతంనగర్, న్యూస్‌టుడే: చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్-1 మెయిన్ పరీక్ష మూడో రోజు బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. మల్కాజిగిరి పరిధిలోని ప్రోబెల్ పాఠశాలలోని రెండు కేంద్రాల వద్ద బుధవారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మల్కాజిగిరి సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి కేంద్రానికి సంబంధించి 507 మందికి.. 338, రెండో కేంద్రంలో 887 మందికి..551 మంది పరీక్షకు హాజరయ్యారు.

గోర్‌బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

ఖైరతాబాద్: లంబాడీలు మాట్లాడే భాష 'గోర్‌బోలి'ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

సంక్షిప్త సమాచారం

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాలమల్లేష్ డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాసభలో ఆయన మాట్లాడారు. కుల గణన తర్వాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలను జరపాలని కోరారు. సాయిలు గౌడ్, ఉమా మహేష్ పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన 3న

మల్కాజిగిరి: బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నవంబరు 3న ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మల్లాపూర్‌లోనీ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నామని సమాఖ్య ప్రతినిధులు చక్కిలం సుధాకర్, పి.ప్రభాకర్‌రావు, కుమారి, సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తాం

అబిడ్స్: జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ అన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవిస్తామన్నారు.

'దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి'

బాగ్‌లింగంపల్లి: ఎన్నికల హామీ మేరకు దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని రూ.4 వేల నుంచి రూ.6 వేలకు వెంటనే పెంచాలని 'డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్'(డీఎస్‌డీ) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడారు.

ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ

కాచిగూడ: ప్రపంచవ్యాప్తంగా శాంతిని కోరుతూ ర్యాలీని నిర్వహించారు. బుధవారం తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్‌నారాయణ్ ముదిరాజ్, తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారి విజయలక్ష్మి తదితరులు కాచిగూడ చౌరస్తా మీదుగా సాగిన శాంతి ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రతిభావంతులను గౌరవించాలి

గాంధీనగర్: ప్రతిభావంతులను గుర్తించి గౌరవించడం ఉత్తమ సంస్కారమని ఆదర్శకిరణం పత్రికా సంపాదకులు వంగల బాలరాజ్‌గౌడ్ అన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్, త్యాగరాయగాన సభల సంయుక్త ఆధ్వర్యంలో.. గుండవరపు హనుమంతారావు వేదికలో కవి ఉమ్మడిసింగు కృష్ణారావు బహుభాషా కవిసమ్మేళనం నిర్వహించారు.

ట్రేడింగ్ యాప్ పేరిట రూ.2.65 లక్షలకు టోకరా

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: స్టాక్ మార్కెట్ యాప్‌లో లావాదేవీలు చేసుకోవచ్చని సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడ్డారు. అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి ఎన్ఆర్‌పి కాలనీలో ఉంటున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఫోన్ వాట్సాప్‌లో ఆగస్టు 5న ఎం స్టాక్ యాప్ క్రియేట్ అయింది. దాన్ని తెరవగా ఒకేసారి రూ.10లక్షలు వేస్తే స్టాక్ మార్కెట్ లావాదేవీలు నిర్వహించుకోవచ్చని అందులో ఉంది. అతను మాత్రం రూ.2.65లక్షలు వేశాడు. రెండు రోజుల తర్వాత తాము సూచించిన డబ్బులు వేయలేదని, అవి వెనక్కి రావంటూ ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయడానికి అర్హత లేదని ఫోన్ నంబర్‌ను బ్లాక్‌లో పెట్టారు. యాప్ నకిలీదని తెలుసుకొని పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు.

ఒక పరీక్ష.. నాలుగేళ్లు ఉపకార వేతనం

- ☛ జాతీయ ప్రతిభా పురస్కార పథకం పరీక్ష నవంబరు 24న
- ☛ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి 270 మందికి అవకాశం



మల్కాజిగిరి జడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

గౌతంనగర్, న్యూస్‌టుడే: చదువులకు ఆర్థిక ఇబ్బందులు అవరోధం కాకూడదన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ ప్రతిభా పురస్కార పథకం (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్- ఎన్ఎంఎంఎస్)కు మల్కాజిగిరి పరిధిలోని విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఈ పరీక్ష చక్కని అవకాశం. నవంబరు 24న నిర్వహించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు.

ఏటా రూ.12 వేలు చొప్పున

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదు. రాష్ట్ర స్థాయిలో జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని అర్హుల జాబితా రూపొందిస్తారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న వారు ఈ పారితోషానికి ఎంపికైతే 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ప్రతి ఏటా రూ.12వేలు కేంద్రం అందజేస్తుంది. మల్కాజిగిరి మండలంలో 5 ఉన్నత పాఠశాలలు ఉండగా 497 మంది, అల్వాల్ మండలంలో 5 పాఠశాలలు ఉండగా 408 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు ఉన్నారు.

జిల్లాలో గత మూడేళ్లుగా ఎంపిక..

విద్యా సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2021–2022	210
2022–2023	214
2023–2024	167

సద్వినియోగం చేసుకోవాలి: పాపిరెడ్డి, సహాయ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ విభాగం

ఎన్ఎంఎంఎస్ పరీక్ష పేద, మధ్య తరగతి విద్యార్థులకు వరం లాంటిది. మరో నెల రోజుల మాత్రమే సమయం ఉండటంతో ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధించవచ్చు. ఈ ఏడాది జిల్లాలో 1,750 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 270 మంది వరకూ ఎంపికయ్యే అవకాశం ఉంది. విద్యార్థులు అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

ప్రయాణం అపసవ్యం.. పొంచి ఉన్న ప్రమాదం



అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని బర్కత్‌పుర-నల్లకుంట ప్రధాన రహదారి వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. స్థానికంగా నివసించే కొందరు వ్యక్తులు అక్కడికి సమీపంలో ఉన్న యూటర్న్ వద్దకు వెళ్లకుండా.. ద్విచక్రవాహనాలపై అపసవ్య దిశలో ప్రయాణిస్తుండటంతో ఇతర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం కూడా బైక్‌పై ఓ వ్యక్తి ఇలా ప్రమాదకరంగా వారికి ఎదురుగా వెళ్తూ కనిపించాడు.

ముషీరాబాద్

● ముషీరాబాద్ ● అంబర్‌పేట

జట్టుగా పనిచేయటమే విజయానికి మార్గం



విజేతలతో నగర సీపీ సీవీ ఆనంద్, సీసీఎస్ డీసీపీ శ్వేత

ఈనాడు, హైదరాబాద్: పోలీస్‌డ్యూటీ మీట్‌లో విజేతలుగా నిలిచిన పోలీసు బృందం స్నేహభావం, జట్టుగా పనిచేస్తే విజయాలు వరిస్తాయనేందుకు ఉదాహరణగా నిలిచారని నగర సీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఇటీవల తెలంగాణ పోలీస్ డ్యూటీమీట్‌లో 5 బంగారు, 2 వెండి, 5 కాంస్య పతకాలతో విజేతలుగా నిలిచిన 35 మంది సిబ్బందిని బుధవారం బషీరాబాగ్ సీసీఎస్ ప్రాంగణంలో సీపీ అభినందించారు. వారిని నగదు బహుమతితో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్యూటీమీట్‌లతో అంతర్గత ప్రతిభ వెలుగు చూస్తుందన్నారు. టీమ్‌తో కలసి పనిచేయడంతో స్నేహం, జట్టుతత్వం అలవడతాయని సూచించారు. పోలీసుశాఖలో సాధారణ, సంప్రదాయ పద్ధతులను మరచిపోకుండా ఆచరణలో కొనసాగించాలన్నారు. సీసీఎస్ డీసీపీ శ్వేత, ఏసీపీలు గురురాఘవేంద్ర, నందుకుమార్, పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి: డీఎస్‌డీ

బాగ్‌లింగంపల్లి: ఎన్నికల హామీ మేరకు దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని 'డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్'(డీఎస్‌డీ) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నల్లకుంటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల చట్టం-2016ను పటిష్ఠంగా అమలుచేయడంతోపాటు వారికి కేటాయించిన ఉద్యోగాలనూ సత్వరం భర్తీ చేయాలని కోరారు. సంఘం జాతీయ కో కన్వీనర్ కాటమోని వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల్లో బధిరులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భారతి, నేతలు కిరణ్‌కుమార్, ఇమ్రాన్, కిషోర్, వెంకటేశ్, దస్తగిరి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు

జూబ్లీహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లిని బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తన కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పెద్దమ్మతల్లి చిత్రపటాన్ని అందించారు.

నిబంధనలు పటిష్ఠం.. లైసెన్స్ తప్పనిసరి

● బాణసంచా దుకాణాల నిర్వాహకులకు స్పష్టం చేసిన జీహెచ్‌ఎంసీ యంత్రాంగం

● అంబర్‌పేట సర్కిల్‌లో పకడ్బందీగా అమలుకు చర్యలు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: దీపావళి పండగ సమీపిస్తుండటంతో.. బాణసంచా విక్రయించే దుకాణాలకు లైసెన్స్‌ను జీహెచ్‌ఎంసీ యంత్రాంగం తప్పనిసరి చేసింది. ఈ మేరకు మున్సిపల్ అంబర్‌పేట సర్కిల్-16 పరిధిలో టపాకాయల షాపుల వారు విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా బల్దియా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లేని పక్షంలో మతాబుల విక్రయాలకు అనుమతించరు. సంబంధిత విక్రయదారులు లైసెన్స్‌ను తీసుకోవాలనే నిబంధనలు ఎప్పటినుంచో ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో ఎవరికి వారే, ఎక్కడ పడితే అక్కడ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టకుండానే బాణసంచాను విక్రయిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దఫా పటిష్ఠ చర్యలు చేపట్టారు.

ఆయా ప్రాంతాలలో

జీహెచ్‌ఎంసీ సర్కిల్, అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని కాచిగూడ,



టపాకాయల దుకాణాల వద్ద విక్రయాలు(పాతచిత్రం)

నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట మున్సిపల్ డివిజన్లు, ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం హిమాయత్‌నగర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలు, కాలనీలతో పాటు ప్రధాన రహదారుల చెంత టపాకాయల విక్రయాలను ఏటా చేపడుతున్నారు. ఇలా దుకాణాలను ఏర్పాటు చేసే ప్రతిఒక్కరూ.. జీహెచ్‌ఎంసీకి ఫీజును చెల్లించి లైసెన్స్‌ను తీసుకోవాల్సి ఉంటుంది.

మున్సిపల్ డివిజన్లు	:	6
గతేడాది బాణసంచా దుకాణాలు	:	200
లైసెన్స్ తీసుకున్న వారు	:	25 శాతం
రిటైల్ షాపులకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు	:	రూ. 11 వేలు
హోల్‌సేల్ దుకాణాలకు..	:	రూ. 66 వేలు

జనావాసాలకు దూరంగా..

: మతాబుల దుకాణాల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీతోపాటు పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారుల సైతం పలు సూచనలు చేశారు. ఈ నిబంధనలను విధిగా పాటించాలని స్పష్టం చేస్తున్నారు.

● జనావాసాల మధ్య, కాలిబాటలపై సంబంధిత షాపులను ఏర్పాటు చేయొద్దు. మైదానాలు, కాలనీలు, బస్తీలకు దూరంగానే వాటిని ఏర్పాటు చేసుకోవాలి.

● ఒకవేళ అనుకోని ప్రమాదం జరిగితే మంటలను ఆర్పడానికి వీలుగా అగ్నిమాపక నిరోధక పరికరాలు తదితర ఉపకరణాలను సిద్ధంగా ఉంచుకోవాలి.

● దుకాణాలకు దగ్గరగా ఎట్టిపరిస్థితుల్లోనూ బాణసంచా కాల్చరాదు. ● షాపులలో దీపాలను వెలిగించరాదు. వాటిల్లో ఏర్పాటు చేసే లైట్లు, ఇతరత్రా కరెంటు పరికరాల కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్తు తీగలను మాత్రమే వినియోగించాలి.

అనుమతించం: డా.హేమలత, ఏఎంఓహెచ్, జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్

టపాకాయల విక్రయ దుకాణాలను ఏర్పాటుచేసే వారంతా నిర్ణీత ఫీజును చెల్లించి జీహెచ్‌ఎంసీ నుంచి ముందస్తుగా అనుమతిని తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే షాపుల ఏర్పాటునకు అనుమతించం.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

నల్లకుంట, ముషీరాబాద్, బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే:

? న్యూనల్లకుంట సెయింట్ ఆగస్టీన్ పాఠశాల లేన్‌లో రోడ్డు గుంతలమయమైంది. రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. –మురళి, న్యూనల్లకుంట

✓ మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాను. –మనీషా, ఏఈ

? రాంనగర్ చౌరస్తా నుంచి రాంనగర్ గుండు ప్రాంతం వరకు రహదారికి ఇరువైపులా కాలిబాటలపై వ్యాపారాల కారణంగా ప్రతిరోజూ ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. –జయకుమార్, రాంనగర్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించాక నియంత్రణ చర్యలు తీసుకుంటాం. –వీరేశం, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ

? అడిక్‌మెట్ డివిజన్ పరిధిలోని జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల పక్కన చెత్తచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. దుర్వాసనతో ప్రజలు సతమతమవుతున్నారు. –లింగమయ్య యాదవ్, స్థానికుడు

✓ సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగింపజేయిస్తాం. –గోవర్ధన్, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య నిర్వహణ సూపర్‌వైజర్

? పద్మకాలనీలోని ఇం.నం.2-8-702/32/14 సమీపంలో కొన్నిరోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. –సంఘేవర్, పద్మకాలనీ

✓ పరిశీలించాక వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. – అనూష, విద్యుత్తు దీపాల నిర్వహణ విభాగం ఏఈ, జీహెచ్‌ఎంసీ.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

నల్లకుంట, న్యూస్‌టుడే: నల్లకుంట డివిజన్ పరిధి న్యూనల్లకుంటలోని హనుమాన్ దేవాలయం ఎదురు వీధిలో మ్యాన్‌హోల్ కుంగిన సమస్యను వివరిస్తూ ఈ నెల 21వ తేదీన 'ప్రమాదభరితంగా మ్యాన్‌హోల్' అనే శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్రకథనానికి జలమండలి అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో సిబ్బందిని అక్కడికి పంపించి.. కుంగిపోయిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు.

సభ్యత్వ నమోదు విజయవంతం: మహిళా కాంగ్రెస్



శంభుల ఉషశ్రీని సన్మానిస్తున్న అల్క లాంబా

అంబర్‌పేట, న్యూస్‌టుడే: మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు ప్రక్రియ విజయవంతమైందని ఆ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంభుల ఉషశ్రీ తెలిపారు. బుధవారం అంబర్‌పేటలో ఆమె మాట్లాడుతూ.. సెప్టెంబరు 15 నుంచి 30 వరకు జరిగిన తొలివిడత సభ్యత్వ నమోదులో ఖైరతాబాద్ జిల్లా తెలంగాణలో మొదటి, జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా.. రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావుతో కలిసి సన్మానించి తమను అభినందించారని ఆమె వెల్లడించారు.

'స్వచ్ఛ హైదరాబాద్'కు తోడ్పాటునివ్వాలి: ఎమ్మెల్యే





అంబర్‌పేటలో జెండా ఊపుతున్న కాలేరు వెంకటేష్. చిత్రంలో విజయ్‌కుమార్‌గౌడ్, పద్మ, కాచిగూడలో కార్పొరేటర్ ఉమారాణి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: 'స్వచ్ఛ హైదరాబాద్' కార్యక్రమం విజయవంతానికి అన్నివర్గాల ప్రజలు తోడ్పాటు అందించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం అంబర్‌పేటలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మలతో కలిసి.. పారిశుద్ధ్య కార్మికులకు సైకిల్ రిక్షాలను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రహదారులపై చెత్తను పారేయకుండా ఇంటింటికి వచ్చే ఆటో ట్రాలీలకు అందజేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ మారుతీదివాకర్, ఏఎంఓహెచ్ డా.హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

కాచిగూడ: నింబోలిఅడ్డాలోని కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి సంబంధిత రిక్షాలను పంపిణీ చేశారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్, ఎస్ఎస్ తిరుపతి, ఎస్ఎఫ్ఏలు అమరేశ్వరి, విష్ణు, రామారావు, దేవ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి



బాక్స్‌డ్రైన్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గౌసుద్దీన్, నేతలు

ముషీరాబాద్, న్యూస్‌టుడే: భోలక్‌పూర్ డివిజన్ పరిధిలో వరదనీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మహ్మద్ గౌసుద్దీన్ అన్నారు. దీనిలో భాగంగా వరదనీటి పైప్‌లైన్ల ఆధునికీకరణ చేపడుతున్నట్లు వివరించారు. స్థానిక డా.వారిస్ ఆసుపత్రి నుంచి పద్మశాలి కాలనీ వరకు.. సుమారు 100 మీటర్ల మేరకు నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ పనులను కార్పొరేటర్ బుధవారం పరిశీలించి మాట్లాడారు. నూతనంగా రూ.65 లక్షలతో చేపడుతున్న బాక్స్‌డ్రైన్ పూర్తయి అందుబాటులోకి వస్తే.. వరదనీటి సమస్య తీరుతుందని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ సుభాష్, వర్క్ఇన్‌స్పెక్టర్ దాసు, ఎంఐఎం నేతలు మహ్మద్ షరీఫ్‌హుస్సేన్, ఖాజీ అజీజుల్లా ఉస్మాని పాల్గొన్నారు.

గాంధీనగర్, న్యూస్‌టుడే: వరదనీటి సమస్య పరిష్కరించేలా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని కోరారు. బుధవారం అరుంధతినగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో.. ఈఈ శ్రీనివాస్, డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలాంలతో కలిసి పర్యటించాక ఆమె మాట్లాడారు. ఏటా వర్షాకాలంలో వరదనీరు పోటెత్తి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. భాజపా సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, నేతలు ఎం.ఉమేష్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచ శాంతిని కోరుతూ ర్యాలీ



కాచిగూడ, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా శాంతిని కోరుతూ ర్యాలీని నిర్వహించారు. బుధవారం తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్‌నారాయణ్ ముదిరాజ్, బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారిణి విజయలక్ష్మి, నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల హేమంత్, హైకోర్టు న్యాయవాది ఎట్టయ్య తదితరులు కాచిగూడ చౌరస్తా మీదుగా సాగిన శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రపంచ శాంతి అన్ని దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని వారంతా తెలిపారు. భారతదేశం సమైక్యత, సమగ్రతల కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశానికి విజ్ఞప్తి



బుర్రా వెంకటేశానికి వినతిపత్రం అందజేస్తున్న ఎంవీ రమణ, వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించడంతోపాటు కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలను మరింతగా మెరుగుపర్చాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంబంధిత కమిటీ ఆధ్వర్యంలో నేతలు బుధవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్ ప్రొహిబిషన్ కమిషనర్ శ్రీధర్‌లకు సైతం వినతిపత్రాలు సమర్పించారు. ఆ తర్వాత సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, వెంకటేశ్వర్లు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తిలో ప్రమాదాల నివారణపై తక్షణం దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరారు. తాడి, ఈత వనాల పెంపకానికి స్థలాలనూ కేటాయించాలన్నారు. తాడి, ఈత కల్లు, నీరా ఉత్పత్తుల పరిశ్రమలను విరివిగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరానికి అడ్డుకట్ట

బాధితుడికి రూ.53 లక్షలు తిరిగి ఇప్పించిన పోలీసులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయిన బాధితుడికి పోలీసులు నగదు తిరిగి ఇప్పించారు. నగరానికి చెందిన వయోధికుడి(84)కి ఫెడెక్స్ కొరియర్ ప్రతినిధినంటూ నేరస్థుడు ఫోన్ చేశాడు. మీ పేరుతో బుక్ అయిన పార్సిల్‌లో నిషేధిత వస్తువులు ఉన్నాయని చెప్పాడు. వెంటనే సీబీఐ అధికారులమంటూ వాట్సాప్ వీడియోకాల్ చేసి రూ.కోట్ల మోసం కేసులో మీ ప్రమేయం ఉందని బెదిరించారు. దాంతో బాధితుడు భయపడ్డారు. నేరస్థులు చెప్పిన ప్రకారం ఏకంగా రూ.2.88 కోట్లు బదిలీ చేసేశారు. తేరుకొని వెంటనే హైదరాబాద్ సైబర్ పోలీసులకు సంప్రదించారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు, పీసీలు డి.శేఖర్, హెచ్.శేఖర్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఫౌజియా బేగంలు వెంటనే బాధితుడి సొమ్ము ఏ ఏ బ్యాంకు ఖాతాలకు వెళ్లాయో తెలుసుకొని వాటికి నోటీసులిచ్చి సొమ్మును స్తంభింపజేయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో సూరత్‌లోని యాక్సిస్ బ్యాంక్‌లో రూ.53 లక్షలు, కేరళలోని ఎస్‌బీఐలో రూ.50 లక్షల వరకు ఫ్రీజ్ చేయించారు. అందులో కోర్టు ఆదేశాలతో రూ.53 లక్షలు బాధితుడి ఖాతాకు బదిలీ చేయించారు. సైబర్ పోలీసుల కృషిని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అభినందించారు.

బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీసీపీ బాలస్వామి. చిత్రంలో అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీలు

గోల్నాక, న్యూస్‌టుడే: బాణసంచా విక్రేతలు నిబంధనలను విధిగా పాటించాలని పోలీస్ తూర్పు మండలం డీసీపీ బాలస్వామి కోరారు. బుధవారం చే నంబర్ చౌరస్తాలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాలులో.. తూర్పు మండలంలోని బాణసంచా దుకాణాల నిర్వాహకులు, హోటళ్లు, లాడ్జీల యజమానులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. హోటళ్లు, లాడ్జీలలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. ప్రతిఒక్కరి నుంచి గుర్తింపుకార్డులను తీసుకోవడంతోపాటు రిజిస్టర్‌లనూ క్రమంతప్పకుండా నిర్వహించాలన్నారు. అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీలు రఘు, శంకర్, జగన్, జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న సరోజ

బాగ్‌లింగంపల్లి: ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఇండోర్ మైదానంలో నిర్వహించిన తైక్వాండో టోర్నమెంట్‌లో బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారు. ఎస్.నితీష్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించారు. ఏ.పురుషోత్తం సిల్వర్ పతకం దక్కించుకున్నారు. అనంతరం వారికి నిర్వాహకులు జ్ఞాపికలను ప్రదానం చేశారు. విజేతలను అంబేడ్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సరోజవివేక్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కబడ్డీ పోటీల్లోనూ తమ విద్యాసంస్థలకు చెందిన జట్టు రాణించిందన్నారు. మానసిక ఉల్లాసంతోపాటు శరీరకదారుఢ్యానికీ క్రీడలు దోహదపడతాయని చెప్పారు.

కళాకారులను గౌరవించడం ఉత్తమ సంస్కారం



సత్కార గ్రహీతలతో రాధాకుసుమ, బాలరాజ్‌గౌడ్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రతిభావంతులను గుర్తించి గౌరవించడం ఉత్తమ సంస్కారమని ఆదర్శకిరణం పత్రికా సంపాదకులు వంగల బాలరాజ్‌గౌడ్ అన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్, త్యాగరాయగానసభల సంయుక్తాధ్వర్యంలో.. బుధవారం గుండవరపు హనుమంతారావు వేదికలో కవి ఉమ్మడిసింగు కృష్ణారావు బహుభాషా కవిసమ్మేళనం నిర్వహించారు. కవులు, కవయిత్రులు పాల్గొని తమ స్వీయకవితలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వివిధరంగాల నుంచి ఎంపిక చేసిన పలువురికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు కపిల వరలక్ష్మి, పీసపాటి నాగేశ్వరశర్మ, రాధాకుసుమ, కోక భవానీవిజయ్‌కుమార్, రామచంద్రరావు, లలితావాణి, రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులకు న్యాయం చేయాలి: సీపీఐ

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మూసీ నది పునరుద్ధరణ, హైడ్రాలో ఇళ్లు కోల్పోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూసీ నది పునరుద్ధరణకు సీపీఐ వ్యతిరేకం కాదని, అక్కడ నివాసం ఉండే పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయం వీసీకి సన్మానం



వీసీ ప్రొఫెసర్ ధనావత్ సూర్యను సన్మానిస్తున్న హరిచరణ్, పాండురంగయ్య, ఆర్.రాంరెడ్డి

విద్యానగర్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ధనావత్ సూర్యను భాజపా గ్రేటర్ విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ హరిచరణ్, కార్యదర్శి డాక్టర్ పుట్టా పాండురంగయ్యలు సన్మానించారు. సంబంధిత వర్సిటీకి తొలి మహిళా వీసీగా ఆమె బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో..బుధవారం కోఠిలోని విశ్వవిద్యాలయంలో వారు ప్రత్యేకంగా కలిసి శాలువాలు కప్పి అభినందించారు. భాజపా నేతలు ఆర్.రాంరెడ్డి, గణేశ్, రాజేందర్, ప్రవీణ్‌కుమార్, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికుడి మృతి

కాచిగూడ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో స్వీపర్ మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, ఎస్సై సురేష్‌లు తెలిపిన వివరాల ప్రకారం... తులసీరాంనగర్‌కు చెందిన స్వీపర్ సాయిమల్లు(65) బుధవారం తెల్లవారుజామున హర్రాస్‌పెంట వద్ద వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉంగరాలు, సెల్‌ఫోన్ల బ్యాగు చోరీ

కాచిగూడ: ఉంగరాలు, నగదు, సెల్‌ఫోన్లతో కూడిన బ్యాగు చోరీకి గురైన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం... నాంపల్లి ప్రాంతానికి చెందిన రతిలాల్‌జైన్.. తన భార్య, కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 5న కాచిగూడ నుంచి లాల్‌ఘర్ ఎక్స్‌ప్రెస్‌లో జోధ్‌పూర్‌కు బయలుదేరారు. రైలు ముత్కేడ్ స్టేషన్ వద్ద ఉండగా 6 గ్రాముల రెండు బంగారు ఉంగరాలు, రెండు సెల్‌ఫోన్లు, రూ. 50 వేల నగదు ఉన్న బ్యాగు చోరీకి గురైంది. వారు తిరిగి నగరానికి వచ్చాక చూసుకునే సరికి సెల్‌ఫోన్ నుంచి ఫోన్‌పే ద్వారా రూ. 68 వేల నగదు కాజేసినట్లు గుర్తించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

ఏఎన్‌ఎం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన 25, 26 తేదీల్లో

గన్‌ఫౌండ్రి: హైదరాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం(ఔట్‌సోర్సింగ్) పోస్టుల భర్తీకి ఈ నెల 25, 26న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ కార్యాలయం స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్‌లోని నాలుగో అంతస్తులోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో జరుగుతుందన్నారు. గతేడాది జిల్లాలోని గిరిజన వసతి గృహాలలోని ఏఎన్‌ఎం పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మాత్రమే పరిశీలనకు హాజరు కావాలని కోరారు.

సికింద్రాబాద్‌లో 25న ఉద్యోగ మేళా

కార్వాన్: ప్రైవేటు సంస్థల్లోని వివిధ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.జయశ్రీ తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా కలిగిన సం.18 నుంచి 30 మధ్య ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు ధ్రువపత్రాలతో సికింద్రాబాద్ చంద్రలోక్ కాంప్లెక్స్‌లోని స్టాఫింగ్ టైటాన్స్ కార్యాలయంలో నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరుకావచ్చన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

గోల్నాక, న్యూస్‌టుడే: పేదలు మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి దోహదం చేస్తుందని మాజీ కార్పొరేటర్ జగన్, భారాస నేత దూసరి శ్రీనివాస్‌గౌడ్‌లు పేర్కొన్నారు. బుధవారం శంకర్‌నగర్‌లోని కార్యాలయంలో.. అంబర్‌పేటకు చెందిన నజీనా కిడ్నీ శస్త్ర చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయించిన రూ. 60 వేల చెక్కును జగన్, శ్రీనివాస్‌గౌడ్‌లు అందజేశారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని కోరారు.

గోల్నాక మార్కెట్‌లో కూరగాయల ధరలు

తిలక్‌నగర్: (బుధవారం నాటివి.. కిలోకు రూపాయల్లో) టమాట 50, ఆలుగడ్డ 40, వంకాయ 40, బెండ 60, దొండ 45, దోసకాయ 40, కాకర 70, బీర 60, సొర 30, క్యాబేజి 40, క్యాప్సికం 60, బీన్స్ 90, చిక్కుడు 70, క్యారెట్ 45, బీట్‌రూట్ 50, ఉల్లిగడ్డ 40, పచ్చిమిర్చి 45, వెల్లుల్లి 340, అల్లం 80.

పర్యవేక్షణ లేక.. కళావిహీనంగా

ముషీరాబాద్ నియోజకవర్గంలో అధ్వానంగా పార్కులు

ముషీరాబాద్, న్యూస్‌టుడే: జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని జీహెచ్‌ఎంసీ ఉద్యానాలు అధ్వానంగా మారాయి. స్థానికులకు పచ్చదనంతోపాటు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు.. నిర్వహణలేమితో కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. వాటిల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో సందర్శకులు అవస్థలు పడుతున్నారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని కోదండరెడ్డి పార్కు, బ్యాంక్ ఆఫ్ బరోడా కాలనీ పార్కు, ముషీరాబాద్ చౌరస్తాలోని జీహెచ్‌ఎంసీ పార్కుతోపాటు ఇతరప్రాంతాల్లోని ఉద్యానాలూ అభివృద్ధికి నోచుకోవడం లేదు. పార్కుల్లోని గ్రీనరీ, మొక్కలకు సకాలంలో నీళ్లు పోయకపోవడంతో గడ్డి ఎండిపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. దీంతో వాటిల్లోకి నడక కోసం వచ్చే వాకర్లు, ఆహ్లాదం కోసం వస్తున్న సందర్శకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై ఫిర్యాదు చేస్తున్నా సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పార్కుల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



భోలక్‌పూర్‌లోని కోదండరెడ్డి ఉద్యానం దుస్థితి

● భోలక్‌పూర్‌లోని కోదండరెడ్డి పార్కు సీనియర్ సిటిజన్ల ఉద్యానంగా పేరుగాంచింది. ప్రస్తుతమిది నిర్వహణలేమితో సమస్యలకు నిలయంగా మారింది. పార్కులోని వాకింగ్‌ట్రాక్ అధ్వానస్థితికి చేరడంతో.. ఉదయం నడక కోసం వచ్చే వృద్ధులు, మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు. పార్కు ముందు కాలిబాట పరిసరాల్లోనూ చెత్తచెదారం పేరుకుపోయింది. మరోవైపు, టెంట్‌హౌస్ సామగ్రి నిల్వలతోనూ వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. ● ముషీరాబాద్ చౌరస్తాలో ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కులోని వాటర్‌ఫౌంటేన్ నిరుపయోగంగా మారింది. ఇది కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇందులోకూడా వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు.. ఏపుగా పెరిగిన చెట్లకొమ్మలను సకాలంలో నరికివేయకపోవడంతోనూ ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాకర్స్ చెబుతున్నారు.



ముషీరాబాద్ చౌరస్తాలోని పార్కులో నిరుపయోగంగా వాటర్‌ఫౌంటేన్

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

బీపీ, మధుమేహం మందుల కొరత

ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాలోని బస్తీ దవాఖానాలను బుధవారం పరిశీలించింది.



జవహర్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో పేరు నమోదు చేసుకుంటున్న రోగులు

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: అత్యవసరమైన బీపీ, మధుమేహానికి సంబంధించిన మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. జవహర్‌నగర్ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంతో పాటు పలు బస్తీదవాఖానాల్లో తరచూ మందుల కొరత ఏర్పడుతోంది. ప్రైవేటు మందుల దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాల్సి వస్తుందని బాలాజీనగర్‌కు చెందిన రామచంద్రమ్మ (58) వాపోయారు. ● మహిళా రోగులు ఆసుపత్రికి ఎక్కువగా వస్తున్నారు. ● కొన్ని సందర్భాల్లో ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తే ఎండలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ● రెండు రోజుల వ్యవధిలో రోగులకు ఆ మందులను అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.



అంబేడ్కర్ నగర్‌లో చిన్న గదిలోనే సేవలు

శామీర్‌పేట ●ప్రాంతం: తూంకుంట మున్సిపాలిటీ, ●ప్రాంతం: హకీంపేట.
●నిత్యం వచ్చే రోగుల సంఖ్య 50-65 మంది
●రోగులు: సీజనల్ వ్యాధులతో..
●మందుల కొరత: నొప్పులు, కాల్షియం



హకీంపేటలో రోగి వివరాలు సేకరిస్తున్న వైద్యుడు



వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న వైద్యుడు రుషి కేష్

నాగారం: వచ్చే రోగులు: జ్వరాలతో ఎక్కువగా వస్తున్నారు. ప్రాంతం: శ్రీనివాసనగర్ కాలనీలో రోజుకు 80 మంది వరకు వస్తున్నారు. ● వెంకటేశ్వరనగర్ కాలనీలో వైద్యుడు లేకపోవడంతో రోగులను శ్రీనివాసనగర్‌కు పంపిస్తున్నారు. మందులకు ఇబ్బంది పడుతున్నారు.

సరిపోని మందులు..

ఉప్పల్: ● చిలుకానగర్ బస్తీ దవాఖానకు రోజు 75 నుంచి 90 మంది రోగులు వస్తున్నారు. రోజూ 15 నుంచి 20 మందికి రక్త పరీక్షలు చేస్తున్నారు. ● రోగుల్లో కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, పరిశ్రమలు, కెమికల్ ఇండస్ట్రీస్‌లో పనిచేసే కార్మికులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఎక్కువగా వస్తుంటారు. ● చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్, జ్వరాలు, డయేరియా, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, దగ్గు, జలుబులతో రోగులు వస్తున్నారు. ● మందుల కొరత ఉంది. పంపిణీ చేసే మందులు సరిపోవడం లేదు. ● కొన్ని రోజులుగా పరికరాలు, ట్యూబ్‌లు లేక రక్త పరీక్షలను నిలిపివేశారు.



మందుల వివరాలు చెబుతున్న సిబ్బంది

రోగుల అవస్థలు..

హబ్సిగూడ, కాప్రా
● రామంతాపూర్ డివిజన్‌లో రెండు, హబ్సిగూడ డివిజన్‌లో రెండు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. ● గత రెండు నెలల నుంచి సరిపడా మందులు లేవు. ● 60 మంది రోగులు వస్తుంటారు. కొరత: మధుమేహం, బీపీ, అజీర్ణం, దగ్గు, జలుబు మందులు ● చిన్నపిల్లలకు సిరప్, డ్రాప్స్ అందుబాటులో లేవు.

అంతంత మాత్రంగానే.. ● సాయిరాంనగర్, సాయిబాబానగర్ పేదల బస్తీలోని దవాఖానాకు రోజూ 60-90 మంది రోగులు వస్తుంటారు. 20 మందికి పైగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ●టైఫాయిడ్, చికున్ గున్యా, జ్వరాలు, దగ్గు, జలుబు, తీవ్రమైన విరోచనాలతో వస్తున్నారు. ● ఇక్కడ మందుల కొరత ఉంది. ఇచ్చే మందులతో జబ్బు తగ్గడం లేదని రోగులు చెబుతున్నారు. ● పిల్లలకు జ్వరం, జలుబు, దయారియాకు సిరప్‌లు లేవు.

కొరతను భర్తీ చేస్తున్నాం:
డాక్టర్ జి.రమాదేవి, కుషాయిగూడ
ఎప్పటికప్పుడు మందులను రోగులకు అందుబాటులో ఉంచుతున్నాం. మందులు అందని వారికి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో అందజేస్తున్నాం.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాలమల్లేష్ డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాసభలో ఆయన మాట్లాడారు. కుల గణన తర్వాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలను జరపాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే: కీసర, శామీర్‌పేట కీసర, కాప్రా

? ఓటరు కార్డులో కొన్ని మార్పులు చేయాల్సి ఉంది. ఎప్పుడు అవకాశం ఇవ్వనున్నారు. – సృజన్, నేతాజీనగర్

✓ నవంబరు 10, 11 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నాం. పోలింగ్ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి.
– ఆంజనేయులు, ఎన్నికల అధికారి, ఉప్పల్ నియోజవర్గం

? ఓల్డ్ కాప్రాలో నోబుల్ స్కూల్ వద్ద డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతుంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. చాలా ఇబ్బందికరంగా ఉంది.
– భాస్కర్‌గౌడ్, వంపుగూడ

✓ భూగర్భ డ్రైనేజీకి మరమ్మతులు చేపడుతాం. – రోహిత్, ఏఈ, జలమండలి

? అంకిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలోని బాలికల గురుకుల పాఠశాల ముందు రోడ్డుపై భారీ లోడుతో వెళ్లే లారీల్లో నుంచి పడిన కంకర రాళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. – జాంగీర్‌బాబు, అంకిరెడ్డిపల్లి

✓ ఎక్కడెక్కడ రోడ్డుపై రాళ్లు పడి ఉన్నాయో గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – ధన్‌రాజు, ఆర్అండ్‌బీ ఏఈ కీసర

? పద్మశాలి కాలనీలో నెల రోజుల క్రితం బోరు మోటర్ చెడిపోయింది. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం.
– రమణ, అలియాబాద్

✓ గ్రామపంచాయతీ కార్యదర్శికి సమస్యను వివరించి పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటాం
యాదగిరి రెడ్డి, మండల తహసిల్దార్, అలియాబాద్ పంచాయతీ, ప్రత్యేక అధికారి

కూల్చివేసి... కంచె మరచి

● రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి ఎసరు
● కబ్జా చేసి రోడ్డు నిర్మించి...


న్యూస్‌టుడే, మేడ్చల్ రూరల్

వడ్డించేవాడు.. మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఇబ్బందులుండవనే నానుడు ఈ కబ్జాకు సరిగ్గా సరిపోతుంది. ప్రభుత్వ భూమి అని తెలుసు.. అయినా స్థిరాస్తి వ్యాపారులు బహుళ అంతస్తులు కట్టినప్పుడు రోడ్డు లేదని గృహ వినియోగదారులు చెప్పలేదు. ఈ విషయం ఆ భవనాలకు అనుమతులిచ్చిన అధికారులు పట్టించుకోలేదు. అక్కడి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించలేదు. అవకాశం వస్తే ఆ భూమిని మాయం చేసేద్దామని అనుకున్నారు. తీరా ఇప్పుడు కథ అడ్డం తిరిగింది. ఎలాగంటే...! హైదరాబాద్ మహానగర శివారు ప్రాంతమైన మేడ్చల్ స్థిరాస్తి వ్యాపారానికి పెట్టింది పేరు. ఈ ప్రాంతంలో వెంచర్లు, లేఔట్లు పెద్ద ఎత్తున వెలుస్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని పట్టణంలో కొందరు స్థిరాస్తి వ్యాపారులు రహదారి లేని లేఔట్‌కు మూడు చోట్ల ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేసి అమ్మి సొమ్ము చేసుకున్నారు. దీంతో రూ. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జా కోరల్లో చిక్కింది.



ప్రభుత్వ స్థలంలో అరకొరగా తొలగించిన రహదారి

2.18 ఎకరాలపై కన్ను: మేడ్చల్ పట్టణంలోని కిష్టాపూర్ రోడ్డులో సర్వే నంబరు 145లోని 2.18 ఎకరాల స్థలానికి సమీపంలో ఉన్న సర్వే నంబరు 139, 143, 144లో రెండెకరాల 39గుంటల్లో దాదాపు 42 ప్లాట్లతో పంచాయతీ నుంచి 2006లో అనుమతి పొందిన లేఅవుట్‌ను తయారు చేసి ప్లాట్లుగా విక్రయించారు. 2023లో ఇదే లేఅవుట్‌ను ఆధారంగా చేసుకుని రోడ్లను అనుసంధానం చేస్తూ సర్వే నెంబరు 138, 140, 141లో దాదాపు 33 ప్లాట్లతో మరో హెచ్ఎండీఏ వెంచర్‌ను తయారు చేశారు. ఈరెండు వెంచర్లకు వెళ్లాలంటే ప్రభుత్వ స్థలంలో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి. మట్టితో ఉన్న రహదారిని చాలా రోజులుగా వాడుతున్నప్పటికీ... సీసీ రహదారి వేసుకుని శాశ్వత దారిగా మార్చేందుకు స్థిరాస్తి వ్యాపారులు సిద్ధమయ్యారు. రెండు నెలల క్రితం వెంచర్‌కు ప్రభుత్వ స్థలంలో నుంచి సీసీ రోడ్డు వేస్తున్న క్రమంలో ప్రభుత్వ స్థలమని బయట పడింది. స్థానికులు రహదారి పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి సీసీ రోడ్డును ధ్వంసం చేశారు.



ప్రభుత్వ స్థలంగా గుర్తింపు (ఎర్రగుర్తు)

కూల్చివేత సరే... రక్షణేది?: అధికారులు ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ ఏర్పాటు చేసిన బోర్డును మరుసటి రోజే తొలగించినా అధికారులు పట్టించుకోలేదు. స్వాధీనం చేసుకున్న స్థలాన్ని అలాగే వదిలేయడంతో రక్షణ లేకుండా పోయింది.

కబ్జాకు పాల్పడితే క్రిమినల్ చర్యలు: శైలజ, తహశీల్దార్, మేడ్చల్

ప్రభుత్వ స్థలం కబ్జాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. సర్వే నెంబరు 145లో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటా. సుమారు ఒక ఎకరం స్థలంలో ఉప విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు స్థలం కోరుతూ విద్యుత్‌శాఖ నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. కేటాయింపు జరగగానే మిగిలిన స్థలానికి కంచె వేసి పరిరక్షిస్తాం.

శ్రీవారి రథోత్సవం... పులకించిన భక్తజనం

నాచారం, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి రథోత్సవము అత్యంత వైభవంగా నిర్వహించారు. ఊరేగింపులో భక్తుల గోవిందా నామస్మరణతో పురవీధులన్నీ భక్తజనంతో నిండిపోయాయి. మాడవీధులు, కాలనీ పురవీధుల్లో గజవాహనం, హనుమంత వాహనంపై ఊరేగింపుగా వచ్చిన శ్రీవారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతిసాయిజెన్, ఆలయ ధర్మాధికారి డా.తుమ్మల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



పురవీధుల్లో రథంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

బొడ్రాయికి గ్రామస్థుల పూజలు

కీసర, న్యూస్‌టుడే: కీసరలో బుధవారం నాభి శిల బొడ్రాయి ప్రథమ వార్షిక పూజలు ఘనంగా నిర్వహించారు. గత ఏడాది బొడ్రాయి పండగ వైభవోపేతంగా నిర్వహించారు. ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామ పురోహితులు వెంపటి ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో బొడ్రాయికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, విశేష పూజలు చేసి అలంకరించారు. ఈనెల 27న ఆదివారం బోనాలను సమర్పించేందుకు సిద్ధమవుతున్నామని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ఛైర్మన్ ఎన్.వెంకటేశ్‌ముదిరాజు తెలిపారు. ఇందులో మాజీ సర్పంచి మాధురి, మాజీ వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బి.రమేష్ గుప్తా, ఎం.జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.



అభిషేకం చేస్తున్న పండితులు

పరికరాలు బాగున్నాయి..



పరిశీలిస్తున్న ఎంపీ ఈటల, తదితరులు

హబ్సిగూడ, న్యూస్‌టుడే: రామంతాపూర్ డివిజన్‌లో రూ.92లక్షలతో నిర్మిస్తున్న సీవరేజీ పనులను కార్పొరేటర్ శ్రీవాణితో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. అనంతరం ప్రగతినగర్, గోకలేనగర్, బృందావన్ గార్డెన్స్‌ల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను ఆయన ప్రారంభించి, పరిశీలించారు.

నీటి గుంతలో పడి యువకుడి మృతి

మేడ్చల్: నీటి గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. కండ్లకోయ పరిధిలోని ప్రతాప్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పనిచేసే మహేశ్(21) మంగళవారం కనిపించకుండా పోయాడు. బుధవారం వ్యవసాయ క్షేత్రంలోని ఓ నీటి గుంతలో మృతదేహం లభ్యం అయింది. పూర్తి కారణాలు తెలియలేదని పోలీసులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

హబ్సిగూడ: పాతరామంతాపూర్ మల్లికార్జున స్వామి ఆలయం నూతన కమిటీ ఆలయ ఛైర్మన్ నామ్ రాజిరెడ్డి, సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. అతిథిగా కాంగ్రెస్ ఉప్పల్ పార్టీ ఇన్‌ఛార్జి పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

శామీర్‌పేట: **సమయం:** గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు **ప్రాంతాలు:** లక్ష్మాపూర్ గ్రామంతో పాటు వ్యవసాయ బోరు బావులు, లక్ష్మాపూర్ తండా

ముమ్మరంగా భాజపా సభ్యత్వ నమోదు

నాగారం, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా చేపట్టామని బుధవారం పుర ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు. 8 వేలకు పైగా సభ్యత్వం ఇచ్చామన్నారు.

మూడు కాలనీలకు ప్రయోజనం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పరిధిలోని 20వ డివిజన్‌లో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ దొంతగాని శాంతి ప్రారంభించారు. దేవేందర్‌నగర్, భాగ్యనగర్‌లతో పాటు జై రామ్‌నగర్ కాలనీలకు రోడ్డుతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వజ్రేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామశాల ఏర్పాటు చేయాలని వినతి

నాచారం: నాచారంలోని స్నేహపురికాలనీ, వీఎస్టీ, రాఘవేంద్రనగర్‌లోని రైతుబజార్ వెనక ఓపెన్ వ్యాయామశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ బుధవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం ఇచ్చారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

మేడ్చల్, న్యూస్‌టుడే: ప్రార్థనా మందిరాలు, ఆలయాల వద్ద సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అన్ని మతాల పెద్దలతో బుధవారం మేడ్చల్ పట్టణంలో సమావేశాన్ని నిర్వహించారు. ఏ మతస్థులైనా విద్వేషాలకు వెళ్లకూడదన్నారు. అనుమానితులు ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థుల బకాయిలు చెల్లించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు

మేడ్చల్ కలెక్టరేట్: విద్యార్థుల పెండింగ్ ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేశారు. జిల్లా అదనపు విజయేందర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెహమాన్, జిల్లా అధ్యక్షుడు చిన్న, కార్యదర్శి ఎండీ అన్వర్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి సాయం



చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా, న్యూస్‌టుడే: పేద వైద్య విద్యార్థి చదువుకు అయ్యే ఫీజును బీఎల్ఆర్‌ట్రస్ట్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. సాయి వెంకట్ ఎంక్లేవ్‌కు చెందిన నిఖిల్‌చారికి సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఫీజు రూ.29,000ల చెక్‌ను బుధవారం ఎమ్మెల్యే ఇచ్చారు.

స్వచ్ఛ బోడుప్పల్ లక్ష్యంగా అడుగులు



చెత్త వాహనాలను ప్రారంభిస్తున్న మేయర్

బోడుప్పల్: స్వచ్ఛ బోడుప్పలే లక్ష్యంగా పని చేస్తున్నామని నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పేర్కొన్నారు. కొత్తగా 5 చెత్త సేకరణ వాహనాలను బుధవారం ప్రారంభించారు.

చెంగిచర్ల(బోడుప్పల్): చెంగిచర్లలో నూతనంగా నిర్మించిన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం రూ.3 కోట్ల వ్యయంతో చెంగిచర్లలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించింది. దీన్ని ఈనెల 28న జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు.

డెంగీతో దెబ్బతిన్న ఊపిరితిత్తులు.. బతికించిన కామినేని వైద్యులు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: డెంగీతో ఊపిరితిత్తులు తీవ్రంగా దెబ్బతిన్న రోగి ప్రాణాలను ఎల్బీనగర్ కామినేని వైద్యులు కాపాడారు. ఎక్మో చికిత్స ద్వారా ఆరోగ్యవంతుడిగా మారడంతో డిశ్చార్జి చేశారు. కామినేని ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు ఈ వివరాల వెల్లడించారు. నాచారానికి చెందిన 51 ఏళ్ల వ్యాపారికి డెంగీ సోకింది. ఆక్సిజన్ శాచ్యురేషన్ పడిపోయి ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. కుటుంబసభ్యులు వారం క్రితం ఆసుపత్రిలో చేర్పించడంతో వైద్యులు ఎక్మో చికిత్స ప్రారంభించారు. తొమ్మిది రోజుల్లో కోలుకున్నాడు.

బీరువా తాళం తీసి చోరీ

కాప్రా: కుషాయిగూడలోని సాయినగర్‌లోని ఐడియాస్ సుదర్శన్ అపార్టుమెంట్‌లోని నాలుగో అంతస్తులో నివాసం ఉంటున్న గుత్తి అజయ్ (30) దంత వైద్యుడు. ఈ నెల 17 భార్య, తల్లితో కలిసి అతను చెన్నై వెళ్లాడు. ఈ నెల 21న అతను తిరిగి ఇంటికి చూసేసరికి తాళాలు తీసి బీరువాలోని 16 తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు.

ఇలాగైతే స్వచ్ఛత ఎలా..!

పట్టణంలోని జాతీయ రహదారి సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర తడి, పొడి చెత్త డబ్బాలు ఏర్పాటు చేశారు. అవి నిండి చెత్త కింద పడుతున్నా పుర సిబ్బంది శుభ్రం చేయడం లేదు.
మేడ్చల్ రూరల్ న్యూస్‌టుడే:



గ్రూప్-I పరీక్ష కేంద్రం తనిఖీ



చీర్యాల గీతాంజలి కళాశాలలో పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్ గౌతమ్

చీర్యాల(కీసర): చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్-1 మెయిన్ పరీక్ష మూడో రోజు బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు.

మందులు స్వాధీనం

మేడ్చల్: డ్రగ్స్ కంట్రోల్ అధికారులు బుధవారం మేడ్చల్‌లో దాడులు నిర్వహించారు. పట్టణంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లపై దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న సుమారు రూ.20వేల విలువైన పలు రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు.

యూపీహెచ్‌సీలో ముళ్లచెట్ల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

నాచారం, న్యూస్‌టుడే: మల్లాపూర్ సూర్యనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిసరాల్లోని ముళ్లచెట్లు, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం పూర్తిచేసినట్లు ఆసుపత్రి వైద్యాధికారి డా.వినోద్‌కుమార్ తెలిపారు. 'అడవికాదు...ఆసుపత్రి ప్రాంగణమే' శీర్షికతో సెప్టెంబరు 30న ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రాంగణంలోని ముళ్లచెట్లు తొలగించి పరిశుభ్రంగా మార్చారు.

సామగ్రి తొలగించారు

పోచారం(ఘట్‌కేసర్): నారపల్లిలోని వరగంల్ జాతీయ రహదారిపై పక్కనే ఉన్న సప్తగిరి కాలనీకి వెళ్లే పాదచారుల బాటపై నిర్మాణ సామగ్రితో వ్యాపారం చేస్తున్నారని బుధవారం'ఈనాడు'లో 'పాదబాటపై వ్యాపారం.. పట్టించుకోని యంత్రాంగం' శీర్షికతో చిత్ర కథనానికి మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి స్పందించారు.

ధాన్యం కొనుగోలు చేసేదెవరూ..?



పంట చేతికొచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రకటించారు. కానీ ఎక్కడా వాటి జాడ కనిపించడం లేదు. కల్లాల్లో ధాన్యం పెట్టుకొని రైతులు కొనుగోలు ఎప్పుడు చేస్తారా..? అని ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితి ఘట్‌కేసర్ మండలం మాదారం, ఎదులాబాద్‌లలో ఉంది. అకాల వర్షం వచ్చి.. ధాన్యం తడిస్తే దిక్కేంటని రైతులు వాపోతున్నారు. అధికారులు కాస్త దృష్టి సారించరూ...!

–న్యూస్‌టుడే,ఘట్‌కేసర్

నగరంలో పట్టి.. గ్రామాల్లో వదిలి



నగరంలో వీధి కుక్కల బెడద ఎక్కువవుతుండటంతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో వాటిని పట్టుకుని అక్కడ సమస్యను పరిష్కరిస్తున్నారు. కానీ..ఆ వీధి కుక్కలను నగరానికి సమీప గ్రామాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. వదిలేసిన కుక్కలు భయభ్రాంతులకు గురికావడంతో రోడ్డుపై వెళ్లేవారిపై దాడులు చేస్తున్నాయి. గ్రామాలకు చేరి చిన్నపిల్లలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రత పెరుగుతోంది. - **మేడ్చల్, న్యూస్‌టుడే:**